శ్రీ సాయి సచ్ఛరిత్ర

నిత్యపారాయణ గ్రంథం

నాలుగవరోజు పారాయణ - ఆదివారము

పంధొమ్మిదవ అధ్యాయము

1903వ సంవత్సరంలో తన ఉద్యోగమునకు రాజీనామా చేసినప్పటి నుంచి అన్య ఆలోచనలు లేక పూర్తికాలము భక్తి భావములో వుండి బాబా యొక్క ప్రచారములోనే వుండుటవలన దాసుగణుకు మనస్సు స్థిరమయ్యెను. భౌతిక కోరికలు పూర్తిగా నశించెను. హరికథల ద్వారా కీర్తనల ద్వారా తానే అనేక ఆధ్యాత్మిక విషయములను యితరులకు చెపుతూ వుండటంవల్ల దాసుగణుకు బాబా అనుగ్రహముతో భక్తి, జ్ఞాన, వైరాగ్యములకు సంబంధించిన అనేక విషయములు వాటంతట అవే పూర్తిగా అర్థమౌతూవుండెడివి. మనసును ప్రశాంత పరుచుకుని పవిత్రంగా వుండుట వలన, గురువు అనుగ్రహం వలన జ్ఞానం దానంతట అదేవస్తుంది. అట్లావచ్చిన జ్ఞానదృష్టిని జోడించి దాసుగణు సంతకథామృతము అనుగ్రంథమును 1905లోను, భక్త లీలామృతము అను గ్రంథమును 1906లోను రచించి ముద్రించెను. హేమాద్రిపంతు బాబా జీవితచరిత్రను 1917లో ప్రారంభించి 1929కి వ్రాయుట ముగించెను. వీరు రచించిన బాబా జీవిత చరిత్ర పుస్తకము ముద్రించబడి భక్తులకు అందుబాటులోకి వచ్చే వరకు దాసుగణు రచించిన పైరెండు చిరు గ్రంథములను సాయిభక్తులంతా ఎక్కువగా చదువుతూ వుండేవారు. ఈ రెండు గ్రంథములలో సాయి లీలలు ఎక్కువగానే వున్నవి.

నానావళి

భక్తులు అనేక మంది బాబా దగ్గరకు వచ్చి కేవలం భౌతికమైన ధనం, ఆస్తిపాస్తులు, వ్యాపారంలో లాభాలు మొదలైన వాటిని మాత్రమే ఎక్కువగా కోరుతూ వుండేవారు. మసీదుకు అంతదూరంలోనే వుంటూ భక్తుల రాకపోకలను, వారి మనోభావాలను కూడ గమనించగల శక్తులుగలవాడు నానావళి. పిచ్చివానివలె పైన ఒక అంగూస్త్రం మాత్రం కప్పుకుని వుండేవాడు. మాట దురుసుగాను, కళ్ళు భయంకరంగాను వుండేవి. సాధారణంగా నానావళితో ఎవరూ కల్పించుకుని మాట్లాడే వారుకాదు. ఎక్కడైనా అన్యాయం, అక్రమం జరిగితే వెంటనే వెళ్ళి తనదైన పద్ధతిలో మిక్కిలి కటువైన శబ్దములనుపయోగించి ఖండించెడివాడు. సాధారణంగా ఈతడు

వస్తున్నాడంటే జనం తప్పుకునేవారు. ఒక్కొక్కప్పుడు ఎవరైనా మనసులో చెడ్డ భావాలు కలిగి అలాంటి ఆలోచనలతో వున్నవారు తనకు ఎదురుపడినా లేక తన ప్రక్కకు రావటం తటస్థించినా వారిని దుర్భాషలాడి వారిపై రాళ్ళు కూడ విసిరెడివాడు.

ముఖ్యంగా బాబాకు వ్యతిరేకంగా ఎవరైనా మాట్లాడుతూంటే ఈతడు సహించగలిగేవాడు కాదు. బాబాపై ఈగవాలినట్లు అనుమానంవస్తే ఆ ఈగను వెతికి గుర్తించి వెంటాడి మరీ దానిని హతమార్చునంతటి శ్రద్ధాభక్తులు బాబామీద నానావళికి వుండెడివి. ఒకనాడు పెద్ద పెద్ద వ్యాపారస్తులు కొందరు వచ్చి బాబాను ధనం కోసం అనేక ప్రశ్నలువేసి విసిగిస్తూ వుండటం గమనించిన నానావళి వేగంగా మసీదులోనికి దూసుకువచ్చి భక్తులందరినీ తోసుకుంటూ ముందుకువెళ్ళి బాబా ఎదురుగా కూర్చొని ఓ ఫకీరు డబ్బులు కాయలుగాకాసే ఒక పెద్ద చెట్టు నాకు వెంటనే కావాలి. ఆ చెట్టు మొక్కగా వుండి ఎప్పుడో కాయలు కాస్తేకాదు. మొలకెత్తిన నాటి నుంచే కాయలు కాయాలి. ఎన్ని డబ్బులను చెట్టు నుంచి కోసుకున్నా తరగకుండా యిస్తూనే వుండాలి. అలాంటి చెట్టును నీవు నాకు యిప్పుడే ఈ క్షణమే యివ్వాలి, అంటాడు. అతని వుద్రేకాన్ని చల్లబరుస్తూ సరేనని బాబా అభయం యివ్వగానే పకపకానవ్వు కుంటూ వెళ్ళిపోతాడు.

అప్పుడు అక్కడి భక్తులు ఈతని పిచ్చిని బాబా సమర్ధించటం బాగుండలేదని ఈ విషయం బాబా ఆలోచించాలని అంటారు. అందుకు బాబా వారితో ఆలోచించవలసింది నేను కాదు, మీరు. నేను ఈ మసీదులో మీ కొరకు, మీకు జ్ఞానమార్గాన్ని చూపించి ముక్తికి అర్హులౌనట్లుగా చేయుటకు కూర్చొని వుండగా మీరు నా వద్దకు భౌతికమైన ధనం, హోదాలలాంటి విషయవాంఛలతో వస్తున్నారు. మీ కోరికల రూప చిత్రణే నానావళి నన్ను కోరిన డబ్బులు కాసే చెట్టు. ఇప్పటికైనా మీ మీ మనోభావాలను మార్చుకోండి. ఈ జీవితంలో మనిషి సాధించవలసినదేమిటి? ధనమే ముఖ్యమా? కాదే! కాని ధనం కూడ జీవితానికి అవసరమే! అలాంటి జీవితావసరానికి సరిపడు ధనాన్ని ధర్మమార్గంలో తగినంతగా సంపాదించుకోవచ్చును. అందులో తప్పులేదు. అత్యాశతో ధనసంపాదనకే జీవితాన్నంతా వృధాచేసి మితిమీరిన ధనాన్ని సంపాదించినా అది ఆఖరికి మరణించినప్పుడు మనిషి వెంటరాదుకదా!

నా ఆధ్యాత్మిక కోశాగారము పూర్తిగా నిండి పొంగి పొర్లుతున్నది. ఎవరికి ఏమి కావాలన్నా యివ్వగలను. వారంతట వారు కూడ వచ్చి ఎవరికి కావలసినంత వారు తీసుకొనవచ్చును. కాని అందుకు తగినఅర్హతను ముందుగా పొందవలెను. నేనిచ్చునది పుచ్చుకొనుటకు ఎవ్వరూ ఇష్టపడరు. వారు కోరినదే వారికి కావలెను. నేను విలువైన బంగారము ఇచ్చుటకు సిద్ధముగా యుంటిని, కాని వారు పనికిరాని మట్టిగడ్డలనే కోరుతున్నారు.

మనము ఎక్కడి నుండి ఈ మానుష శరీరంలోకి వచ్చితిమి. యిక్కడ వుండి ఏమి చేయుచుంటిమి. చివరకు శరీరంలో నుండి ఎక్కడికి వెళ్లుచుంటిమి? చావు, పుట్టుకల ఈ చదరంగాన్ని నడిపించెదెవరు? కనిపించు ఈ సూర్యచంద్రాదులు, నక్షత్రములు, గ్రహరాసులను సృష్టించినవారెవరు? వీటిని గురించి మానవులు ఆలోచించే స్థితిలో లేరు. కేవలం ధనము, శారీరిక సుఖము సంసార విషయలోలురై ఈ శరీరమే శాశ్వితమనే భ్రమలోపడి దీపమును చూచి ఆకర్షించబడి ఆ వెలుగులోపడి కాలిపోయే పురుగువలె మానవులు నశింపువైపే మొగ్గుచూపెదరు. యిది పూర్తిగా అజ్ఞానము. జ్ఞానమార్గము దీనికి పూర్తిగా వ్యతిరేకమైనది. మానవజాతిని జ్ఞానమార్గానికి మరలించటానికే ఈ నా శరీరం ఏర్పడినది, అని వారికి బాబా సుదీర్ఘమైన సందేశము నిచ్చెను.

అనేకసార్లు బాబా తన బోధనలద్వారా నేను అనే పదమునకు వివరణను ఇస్తూ వుండేవారు. నన్ను తెలుసుకొనుటకు, లేక వెతుకుటకు నీవు ఎక్కడెక్కడికో పరుగులు తీయవలసిన అవసరంలేదు. నీ శరీరానికిగల నామమును రూపమును తొలగించినచో నీలో మిగులునది నేనే. నీలోనేకాక సకల ప్రాణికోటి యందు సమానముగానే యున్నాను. దీనిని మీరు గుర్తించినచో సకల ప్రాణులలోను నన్నే మీరు చూడగలరు. మీరు ఏ ప్రాణిని హింసించినా నన్ను బాధపెట్టినట్లే. యితరుల వలన మీకు కలుగు కష్టనష్టములను సహించి ఓర్చుకొనువారె నాకు మిక్కిలి ప్రేమ పాత్రులని బాబా చెపుతూ వుండేవారు.

చంద్రాబాయి బోర్కర్

చంద్రాబాయి అనునామె 1898వ సంవత్సరంలో తన యిరువై ఎనిమిదవ ఏట మొదటిసారిగా షిరిడికి వెళ్ళి బాబాను దర్శించినది. అప్పటికి ద్వారకామాయి

మసీదు గోడలు మట్టితో అక్కడక్కడా పడిపోయినట్టు వుండేవట. అప్పట్లో బాబా ఎక్కువకాలం వేపచెట్టు క్రిందే వుండేవారట. నీటితో దీపాలు వెలిగించుట ఈమె స్వయముగా చూచినది. ద్వారకామాయి మసీదుకు గుడ్డపీలికలతో పెద్దబల్లను వ్రేళాడగట్టి దానిపై నాలుగు ప్రక్కల దీపపు ప్రమిదలను పెట్టి మధ్యలో బాబా పడుకున్న దృశ్యాన్ని కూడ ఈమె స్వయముగా చూచినది.

ఈమె భర్త రామచంద్రబోర్కరు యింజనీరు. 1909లో అయన పండరీ పురములో ఒక వంతెన నిర్మాణమును పర్యవేక్షించుచుండెను. ఆ కాలములో ఈమె షిరిడికి వచ్చి చాలా రోజులు బాబా సమక్షములో గడిపెను. రామచంద్రబోర్కరు మాత్రం అంతకుముందెప్పుడు షిరిడికిరాలేదు. ఒకనాడు బాబా ఆమెను పిలిచి అమ్మా నీవు పండరికి వెళ్ళుము నీ వెంటనే నేను కూడ వచ్చెదనని చెప్పెను. బాబా అజ్ఞ ప్రకారము ఆమె మరియిద్దరు స్త్రీలతో కలిసి పండరీపురమునకు వెళ్ళగా ఆమె భర్త అంతకు ముందే పండరీపురము విడిచివెళ్ళినట్లు తెలిసికొని తిరుగు ప్రయాణమయ్యెను. వారి ముగ్గురి దగ్గరాగల పైకం కుర్దువాడి స్టేషన్ వరకు టిక్కెట్టు తీసుకొనుటకు మాత్రమే సరిపోగా అక్కడకు చేరిరి. కుర్దువాడి స్టేషనులో వారి దగ్గరకు ఒక ఫకీరువచ్చి ఆమె భర్త ధోండు రైల్వేస్టేషన్‌లో వున్నాడని అక్కడకు వెళ్ళమని చెప్పెను. అక్కడి వరకు చేరుటకు టిక్కెట్లకు డబ్బులు లేవని చంద్రాబాయి చెప్పగా ఆ ఫకీరు వెంటనే మూడు టిక్కెట్లు ధోండు స్టేషన్ వరకు సరిపడునవి ఆమె చేతిలో పెట్టి వెళ్ళిపోయెను. వారు రైలులో ప్రయాణమైరి.

ధోండు రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫారంమీద కూర్చుని కునికిపాట్లు పడుతున్న ఆమె భర్తకు ఎదురుగా ఒక ఫకీరు కనిపించి అతని భార్యని చూపుతూ! ఈ తల్లిని మరచితివేమి అని గట్టిగా ప్రశ్నించి ఈమె ఈ నెంబరుగల రైలు పెట్టెలో వచ్చుచున్నదని ఆమె ఎక్కివస్తున్న రైలుపెట్టె నెంబరుగల చీటీని యిచ్చి అదృశ్యమయ్యెను వులిక్కిపడి లేచిచూడగా చేతిలో వారిచ్చిన చీటీ అలాగే వుండుటచూచి అది కలకాదని నిర్ణయించుకొనెను. ఈ ఆశ్చర్యము నుండి తేరుకునేలోపుగానే రైలుబండి ఒకటివచ్చి ఆగెను. తనకు ఎదురుగాగల రైలు పెట్టె ద్వారముగుండా తన భార్య దిగివచ్చుట బోర్కరు చూసి ఆశ్చర్యపడెను. వెంటనే ఆమె దగ్గరకు వెళ్ళి జరిగిన లీల చెప్పగా ఆమె కూడ తనకు జరిగిన విషయములన్నిటినీ అయనకు చెప్పెను. సాయి ప్రేమామృతాన్ని రుచిచూచిన

వారిద్దరూ ఎంతో ఆనందపడిరి. అనేక కారణాలవలన దూరమైన భార్యభర్తలు సాయిమీద తమ పూర్తిభారాన్ని వుంచి ప్రార్థించగానే వూహాలకు అందని విధంగా వారిని ఏకంచేసిన సంఘటనలు అనేకం కలవు. అందుకు ఒక వుదాహరణే చంద్రాబాయికథ.

1910-11 ప్రాంతంలో మనదేశం బ్రిటీషువారి పరిపాలనలోవున్నది. దాదాబాయి నౌరోజీ అధ్యక్షతలో భారత జాతీయ కాంగ్రెస్ దేశమునకు స్వపరిపాలన కావాలని తీర్మానించిన రోజులు. అప్పటి కాంగ్రెసు నాయకులలో అతివాదులు - మితవాదులు అను రెండు పక్షములుండెడివి. అతివాద పక్ష నాయకుడైన బాల గంగాధర తిలక్ "స్వాతంత్ర్యం మా జన్మహక్కు" అనే నినాదంతో సంపూర్ణ స్వాతంత్ర్యము భారతదేశానికి వెంటనే కావాలని దేశం నలుమూలలా తిరిగి ప్రజలనుద్దేశించి మహాసభలలో ప్రసంగిస్తూ ప్రజలనుత్తేజపరుస్తూ ప్రసంగించుచుండెను. అట్టి అతివాదులందరినీ బ్రిటీషు ప్రభుత్వము రాజద్రోహ నేరము కింద ద్వీపాంతరవాస శిక్షలను విధించుచుండెను. తిలక్ మహాశయునికి కూడ అదే విధముగా బర్మాలోగల మాండలే జైలుకు తరలించిరి. తిలక్‌కు ముఖ్య అనుచరుడు దీవాన్ బహద్దూర్ గణేశ్ శ్రీ కృష్ణ ఖపర్దే. 1911లో ప్రభుత్వము దేశభక్తులను నిర్దాక్షిణ్యముగా శిక్షించుచుండెను. అతివాదులలో ప్రముఖుడు, బాలగంగాధర తిలక్‌కు కుడిభుజం లాంటివాడు అయిన ఖపర్దే తనకు శిక్ష తప్పదని నిశ్చయించుకుని భయపడెను. అప్పటికే షిరిడిలోగల సాయిబాబా తప్ప తనను రక్షించగల వారు లేరని నిర్ణయించుకుని 5-12-1910 నాడు షిరిడికి వచ్చి సాఈశ్వరుని సేవించెను.

జి.యస్. ఖపర్దే

ఖపర్దే అమ్రోటి అను నగరములో పేరు ప్రఖ్యాతులుగల గొప్ప న్యాయవాది. ఆ వృత్తిలో అతడు ఎక్కువ ధనమును కూడ సంపాదించెను. భారత స్వాతంత్ర్య వుద్యమంలో చురుకుగా పాల్గొనుటచే అనేకమందితో పరిచయము గలవాడు. పేరు ప్రతిష్టలు, ధన సంపాదన, కుటుంబ సుఖం మొదలైన విషయాలమీద అతనికి ఎక్కువ ఆసక్తి. ఈయన షిరిడికి వచ్చిన మొదటి రోజునే బాబా - యిది నీ గృహము, నీవు యిక్కడ నిర్భయముగా వుండవచ్చును. మీకు రక్షకుడనై నేనిక్కడ వుండగా మీరు ఏ విషయములోను భయపడవలసిన పనిలేదు అని అతని

మనోభావాలకు తగిన విధంగా అభయమిచ్చెను. ఒకవారం రోజులు మాత్రమే వుండి అతడు తిరిగి అమ్రోటికి వెళ్ళి పోయెను. రెండవసారి కుటుంబసమేతంగా 6-12-1911 న తిరిగి షిరిడికి వచ్చి సాయి ప్రభువును త్రికరణ శుద్ధిగా ఆశ్రయించెను. అతని సమస్యలు తీరువరకు బాబా అయనను మూడు నెలల 15 రోజులపాటు ఎటూ వెళ్ళనీయక షిరిడిలోనే వుంచెను.

కాసీనాధ గోవింద ఉపాసనీశాస్త్రి (ఉపాసనీబాబా)

వీరు తనకుగల. అనారోగ్యపు బాధను తొలగించుకొనుటకు వేరుమార్గములేక 27-6-1911 నాడు షిరిడికి చేరి ద్వారకామాయిలో ప్రవేశించగానే బాబా ఈయనతో "బిడ్డా! నీవు నాకు గడిచిన ఏడు జన్మల నుంచి తెలియును. నీవు స్థిమితపడి షిరిడిలో వుండిన నీ లక్ష్యము సిద్ధించును. గతజన్మ పుణ్యకర్మలచే నీవు కొంత ఆధ్యాత్మిక పురోగతి సాధించితివి. కొంతకాలమిక్కడ నిశ్చల మనస్సుతో నుండిన చాలును. ఉన్నత స్థితి పొందగలవని చెప్పి ఆశీర్వదించెను. మూడవ దినమున కాశీనాధుడు యింటికి తిరిగి వెళ్ళుటకు బాబాను అనుమతి కోరెను యిక్కడనే వుండుము వెళ్ళవలదు. ఒకవేళ నీవు వెళ్ళదలచిన వెంటనే వారము రోజులలో తిరిగిరమ్ము అని చెప్పగా అతడు షిరిడి వదిలి యింటికి చేరకముందే జరిగిన విచిత్ర సంఘటనలద్వారా బాబా చెప్పినట్లుగా ఏడవ దినమున తిరిగి షిరిడికి చేరెను. కాశీనాధుడు షిరిడికి రాక పూర్వమే బాబా వివిధ రూపాలలో కనపడియిచ్చిన అనేక సూచనలను గుర్తుచేసి 4 సంవత్సరములపాటు దీక్షాకాలమును నిర్ణయించి ఖండోబా మందిరమున వుండుమని సాయి ఆదేశించెను. ఈ దీక్షాకాలములో బాబా అనేక మహిమలను, నిదర్శనములను దైనందిన వ్యవహారములద్వారానే ఉపాసనీకి బోధిస్తూ వచ్చెను. ఈ బోధనాపద్ధతులు మిక్కిలి విచిత్రమైనవి, వూహాలకు అందనివి. అంతకు ముందెప్పుడూ జరిగినట్లుగా ఏ గ్రంధంలో కూడ లభించనవి. దీక్షాకాలం పెరుగుతున్న కొద్ది ఉపాసనీలో దివ్యశక్తులు కూడ పెరుగుతూ వచ్చెను. శక్తులు పెరుగుతున్న కొద్దీ బాబాయొక్క పరీక్షలు పెరిగెను. వారిలో పెరిగిన శక్తులనుచూసి ధనవంతులైన సాయి భక్తులు దగ్గరై వారిని తమ ప్రాంతాలకు అహ్వానించేవారు. దీక్షాకాలం కాబట్టి బయటకు వెళ్ళరాదు! కాని బాబా గురిచేసే పరీక్షలు యింకొకవైపు సహించలేకపోయేవాడు. అఖరికి యింకా బాబా యిచ్చిన దీక్ష ముగియుటకు కొద్ది నెలల ముందుగానే 25-7-1914 నాడు రాత్రిపూట బాబాకు చెప్పకుండా రహస్యముగా షిరిడి

నుంచి వెళ్ళిపోయెను. బాబా స్వయంగా చెప్పినప్పటికీ మనం కూడ అప్పుడప్పుడూ మాయయొక్క తాకిడికి తట్టుకోలేక బాబాకు దూరమయ్యే ప్రమాదముంది. పాఠకులైన సాయి భక్తులు త్రికరణ శుద్ధిగా బాబానే నమ్మి యుందురుగాక! బాబావాక్కు బ్రహ్మవాక్కు కాబట్టి అది భవిష్యత్తులో సత్యమై తీరుతుందనే ధృఢ విశ్వాసము పాఠకుల నరనరాలలో జీర్ణించిపోవుగాక! వారి మనసులు సాయినితప్ప యింకా దేనిని కోరకుండుగాక!

ఓం శాంతి శాంతి శాంతిః
పంధొమ్మిదవ అధ్యాయం సంపూర్ణం.

యిరువదవ అధ్యాయము

మానవ జీవితము ఆశలతో, కోరికలతో, యింద్రియ సుఖములతో నిండియున్నది. మనసును ఎంత నిగ్రహించుకున్నా, కోరికలను ఎంతకాలం జయించినా, యింద్రియాలను చాలాకాలం వరకు అదుపులో వుంచినా, ఎప్పుడు ఏ నిముషంలో మనిషిపై అవి తిరగబడి విజృంభించి ప్రకోపిస్తాయో తెలియదు. మాయా ప్రభావం వలన మనిషి అధోగతిపాలై దైవానికి దూరమైపోవును. దేముని చేరుదారి ముళ్ళతోను గోతులతోను నిండియుండును. ఒకవ్యక్తి వేదవేదాంగములలో గొప్పపండితుడైననూ ఈ దారివెంట సురక్షితముగా పోలేడు ముందుగా ఆదారి వెంట నడిచి ఎక్కడ ఏగొయ్యి వుందో, ఎక్కడ ముళ్ళు వున్నాయో స్వయంగా తెలుసుకున్న మార్గదర్శి తోడుగా వుండి మనకుదారి చూపించినచో మనము సురక్షితముగా గమ్యస్థానమునకు చేరగలము. ఆ మార్గదర్శకుడే గురువు. బాబా తన అనుభవమును ఒక కథరూపంలో ఒకనాడు శ్యామా, తాత్యా, సూల్కర్ మొదలగు వారికి గురుస్థాన్ దగ్గర చెప్పిన వివరాలు తెలుసుకుందాము.

దేముని వెతుకుట

“ఒకసారి మేము నలుగురము గొప్ప పండితులము అను భావముతో అడవిలోకి వెళ్ళితిమి. అడవిలోగల బంజారాల వన దేవత యొక్క గుడి ఆ ప్రాంతంలో వున్నదని విని ఆ గుడిని చూడవలెనని బయలుదేరితిమి, అది నిర్జన ప్రదేశము. మేము ముందుకు నడుస్తూ భగవంతుని జేరు మార్గము గురించి చర్చించుచుంటిమి.

మనస్సును స్వాధీనపరచుకొనిన చాలునని ఒకరు, ఆత్మను తెలుసుకొనిన చాలునని యింకొకరు యిలామాటలు సాగుతున్నవి. నేను యిలా చెప్పితిని - మనము చేయవలసిన కర్మలను సక్రమముగా నిర్వర్తిస్తూ, శరీరము, మనస్సు, పంచ ప్రాణములను గురుపాదములపైపెట్టి శరణువేడి, గురువే సర్వస్వము అనే ధృఢనిర్ణయం బలపడినచో గురు అనుగ్రహంతో భగవంతుని అతి సులభంగా చేరుకోవచ్చును. యిలా మా సంభాషణ జరుగుతూ ముందుకు సాగుతూ వుండగా దారిలో ఒక బంజారా వర్తకుడు మాకు ఎదురై ఎక్కడకు వెళ్ళుచున్నారని ప్రశ్నించెను. అతనితో మాటలాడుట మా పాండిత్యమునకు భంగకరమని తలచిన మాలోని కొందరు నిర్లక్షభావంతో ఏదో సమాధానమును చెప్పెను. అతడు మా కొరకు కొంచెము సేపు ఆగి తాను తోడుగావచ్చి మేమెక్కడకు చేరవలెనో దారి చూపెదనని కూడ చెప్పినాడు. కాని మేము అతని మాటలకోసం ఆగక చకచకా ముందుకు సాగిపోయినాము. సాయంత్రము వరకు తిరిగినను వన దేవతగుడి జాడ తెలియలేదు. మా అదృష్టవశమున తిరిగి బయలుదేరినచోటుకే వచ్చితిమి. మళ్ళీ ఆ బంజారా మాకోసం ఎదురుచూస్తూ - చూచితిరా మీరు నా సహాయమును తీసుకుని వుంటే తప్పక దేవతగుడిని చూచి మరీ తిరిగి వచ్చెడివారు. అయినను ఫరవాలేదు అడవిలో దారితప్పక బయలుదేరిన చోటుకే తిరిగి వచ్చినారు. మీరు చాలా ఆకలిగా వుండి వుంటారు. ఈ ఆహారమును భుజించుడని ఆహారమును అందించెను. మిగిలిన ముగ్గురూ అతని మాటలకు అవమానమును పొందినట్లుగా భావించి వెళ్ళిపోయిరి. నాకు చాలా ఆకలిగా వుండుటచే బంజారా యిచ్చిన ఆహారమును తిని, నీటిని త్రాగి దప్పిక తీర్చుకుంటిని. నాకు ఆశ్చర్యము కలుగునట్లుగా ఆ బంజారా స్థానములో మా గురుదేవులు ప్రత్యక్షమైరి. అప్పుడు నేను వారికి గౌరవ పూర్వకముగా నమస్కరించితిని. నా వెంట వచ్చెదవా అని వారడిగిరి. నేను వారి ఆజ్ఞకు బద్ధుడనని చెప్పితిని.

నా గురుదేవులు నన్నొక బావి దగ్గరకు తీసుకుని వెళ్ళి నారెండుకాళ్ళను తాడుతో కట్టి బావిపైగల చెట్టుకొమ్మకు కట్టిరి. తలక్రిందులుగా వ్రేలాడదీసి నా శరీరము మొత్తము తలక్రిందులుగా బావిలోపలికి వెళ్ళునట్లుగను, నీటికి రెండడుగుల దూరము వరకు నా చేతులు పోవునట్లుగాను వుండెను. నన్నట్లు వ్రేలాడకట్టి వారు ఎక్కడికో వెళ్ళిరి. రాత్రి ఆగుటచే క్రమముగా చీకటి అయ్యెను. నూతిపై భాగంలో నుంచి పులుల అరుపులు వినిపించుచుండెను. నూతి లోపలిభాగంలో విషసర్పములు

బుసలుకొట్టుచుండెను. కారు చీకటిలో ఏమీ కనిపించుటలేదు. నా గురువు సర్వసమర్థుడు. ఆయన రక్ష నాకుండగా ఈ పులులు, సర్పాలు నన్నేమీ చేయలేవని నాకు తెలియును. అట్లు నాలుగైదుగంటల తరువాత వారు వచ్చి నన్ను బావిలో నుంచి బయటకు తీసి ఎట్లుంటివి అని ప్రశ్నించిరి. ఆనందములో మునిగి యుంటినని సమాధానమిచ్చితిని. భయము వేయలేదా! అని ప్రశ్నించిరి, మీరు స్వయముగా నన్నిక్కడకు తీసుకువచ్చితిరి. మీరుండగా నాకు భయమేమి? అని జవాబిచ్చితిని. నా భుజమును చేతితో తట్టి నన్ను ఆశీర్వదించిరి. వారిది కన్న తల్లికంటే మించిన ప్రేమ• నన్ను తన గురుకులమున చేర్చుకొనిరి. వారి ప్రేమలో నా తల్లిదండ్రులను మరచితిని. తదేక దృష్టితో వారినే చూచుచుండెడివాడను. వారి నోటి నుంచి వెలువడే ప్రతి మాట నాకు వేదవాక్కు, నా గురువే నా యిల్లు, నా ఆస్తి, నా తల్లిదండ్రులు, నా సర్వస్వం. నా యింద్రియములన్నీ తమ స్థానములను విడచి నా కళ్ళయందు కేంద్రీకృతమయ్యేడివి. కళ్ళు తమ దృష్టిని గురువునందే నిల్పెడివి. నాకు మరిదేనియందు స్పృహవుండెడిదికాదు.

నా గురుదేవుని కటాక్షమువలన ఎట్టి శ్రమయు లేకనే ఆత్మజ్ఞానము దానంతట అదే నాలో ప్రకాశించెను. ఈ సృష్టిలోగల సమస్త విషయములు పగటి వెలుగు వలె వాటంతట అవే అర్థమయ్యెను. యిదే గురువు యొక్క ప్రభావము. ధర్మము, అర్థము, కామము మానవులు తమ కృషి వలన సాధించవచ్చును. కాని నాల్గవది అయిన మోక్షము గురువు సహాయము వలననే పొందుటకు సాధ్యమగును. బాబా చెప్పిన తన స్వయం అనుభవము బహుశా వెంకూసా వద్దవున్నప్పుడు జరిగి యుండవచ్చును ఈ కథ వలన మనం గ్రహించవలసిన విషయం. దేవుని కొరకు చేయు అన్వేషణలో గురువు సహాయము తప్పక అవసరము, సరైన గురువును ఎన్నుకుని వారిని పూర్తిగా నమ్మకుండా ఎన్ని కార్యక్రమములు చేసినా దైవాన్ని తెలుసుకోలేము.

బాబా ఆజ్ఞ పాటించవలెను

సాయిబాబా షిరిడి ప్రజలకు సాక్షాత్తు పరబ్రహ్మస్వరూపుడుగా అయ్యెను. బాబా వద్ద శెలవు తీసుకుని వెళ్ళునప్పుడు బాబా కొన్ని సూచనలిచ్చేవారు. అది వారి ఆజ్ఞగా భావించి భక్తులు పాటించెడివారు. అలావారి సూచనను పాటించనిచో

ఏదో బాధ కలిగెడిది. ఒకసారి తాత్యా కోటేపాటిల్ టాంగాలో కోపర్‌గాం సంతకు వెళుతూ బాబా దగ్గరకు వచ్చి నమస్కరించగా యిప్పుడు నీవు షిరిడి వదిలి పోవలదని హెచ్చరించెను. మీరుండగా నాకింకెవరితోడు అక్కరలేదని మొండిగా ప్రయాణమై వెళ్ళిపోయెను. కొంతదూరము పోయిన తరువాత గుర్రము కాలుబెణికి కూలపడగా బండి పడిపోయెను. తాత్యాకు పెద్ద ప్రమాదమేమి జరగలేదుకాని, ప్రయాణము మానుకుని వెనుకకు తిరిగిరావలసివచ్చెను. తనకు జరగబోయే ప్రమాదమును ముందుగానే వూహించి సలహా యిచ్చిన సాయి యొక్క మాతృప్రేమను గుర్తుచేసుకుని తాత్యా పరవశుడయ్యెను.

ఐరోపా దేశపు డాక్టరు ఒకసారి బాబా దర్శనమునకు వచ్చెను. మసీదులోనికి వెళ్ళి బాబా చేతిని ముద్దుపెట్టుకోవలెనని ఆశపడెను. కాని అతనిని బాబా మసీదులోపలికి రానీయక బయటనుంచే దర్శనము చేసుకోమని ఆదేశించెను దానికతడు అవమానపడి వెంటనే తిరిగి ప్రయాణమయ్యెను. ఆ రోజు వుండి మరునటిరోజు వెళ్ళమని బాబా చెప్పెను. అతడు వినక వెంటనే తిరుగు ప్రయాణమయ్యెను. కొంత దూరముపోగానే గుర్రము బెదిరి ప్రయాణము చేయుచున్న టాంగా తిరుగబడి అతడు చాలా దూరము నేలపై ఈడ్వబడగా శరీరముపై చాలాచోట్ల దెబ్బలు తగిలెను. చాలారోజులు కోపర్‌గాం ఆస్పత్రిలో వుండి చికిత్సపొందెను. ఈ రెండు సంఘటనల ద్వారా మనం గ్రహించవలసిన విషయం. తాత్యా బాబాఆజ్ఞను వ్యతిరేకించి ప్రయాణమైనా భారం మళ్ళీ బాబామీదే వెయుటవలన ప్రమాదమునుండి తప్పుకోగలిగెను. కాని విదేశీయుడు బాబా తనను అవమానపరచెనని భావించి వెడలిపోయెనేగాని తన మేలుకోరే బాబా అట్లుచెప్పెనని భావించలేదు. యిద్దరికీ జరగబోయే చెడును గ్రహించి హెచ్చరించాడు సాయి. భారాన్ని తనపై వేసిన తాత్యాను మాత్రం రక్షించక తప్పలేదు. తాత్యాచేసినది కూడ తప్పే. బాబా వద్దు అన్నపని చేసి మళ్ళీ భారం నీదే అనటం ఎంతవరకు సమంజసం. అది కేవలం బాబాను బాధపెట్టే మూర్ఖమైన చర్య.

రామచంద్ర ఆత్మారామ్

రామచంద్ర ఆత్మారామ్ అనునతడు ప్రార్థనా సమాజమునకు చెందినవాడు ఈతనికి బాబాసాహెబ్ తార్కాడ్ అను మరియొక పేరుగలదు. ఈ సమాజమువారు విగ్రహారాధనను అంగీకరించరు. యితడు బాంద్రాలో వకీలు వృత్తిలో నుండెను. విశాల

దృక్పథంగల మానవతావాది. యితని భార్యాకుమారులు మాత్రము సాయి భక్తులు. కుమారుడు ప్రతిరోజు ప్రాతఃకాలములోనే లేచి కాలకృత్యాదులు తీర్చుకుని బాబా పటమునకు పూజ చేసిన తరువాతనే దైనందిన కార్యక్రమములు ప్రారంభించెడివాడు. ఒకసారి ఆత్మారామ్ భార్య షిరిడికి వెళ్ళి బాబాను దర్శించవలెనని కోరుకున్నది. తల్లికి తోడుగా వెళ్ళమని ఆత్మారామ్ కొడుకునకు చెప్పెను. కాని తాను తన తల్లి యిద్దరూ షిరిడికి వెళ్ళినచో ప్రతిరోజు నియమంగా పూజజరుగు బాబా పటమునకు పూజ జరుగదు అను ఉద్దేశ్యముతో కుమారుడు అంగీకరించలేదు.

తనకు యిష్టము, నమ్మకము లేకపోయినా భార్య కోరిక తీర్చుటకై వారు తిరిగి వచ్చువరకు తన కొడుకు చేయునట్లు ప్రతిరోజు బాబా పటమునకు తాను పూజచేయుదునని కొడుకునకు వాగ్దానము చేసి వారిద్దరినీ షిరిడికి పంపెను. మొదటి రెండురోజులు సాయి పటమునకు పూజ సక్రమముగాచేసి మధ్యాన్న భోజనమునకు ముందుగా మొదట బాబా ప్రసాదము తీసుకుని అ తరువాతే భోజనము చేసెను. మూడవరోజు సోమవారమునాడు కోర్టుపనులు ఎక్కువగా వుండుటవలన త్వర త్వరగా పూజ చేసి వెళ్ళిపోయెను. మధ్యాన్న భోజనమునకు వచ్చినపుడు వంటవాడు భోజనమునకు ముందు సాయి ప్రసాదమును పెట్టలేదు. కారణమడుగగా వుదయపు పూజచేసి త్వరగా వెళ్ళు హడావుడిలో ప్రతిరోజు బాబాకు నైవేద్యంగా పెట్టు పటికబెల్లం పెట్టుట మరచి పోయినారని చెప్పెను. ఆ మాటలు వినిన ఆత్మారామ్ చేతితో కలుపుతున్న భోజనమును ఆపి లేచి వెళ్ళి పూజామందిరంలో చూడగా నైవేద్యం పెట్టు పళ్ళెము ఖాళీగావుండెను. అతనికి వళ్ళంతాకంపరమెత్తెను. కోర్టులోని ముద్దాయివలె బాబా ముందు తల దించుకొనెను. తన కొడుకు భయపడినదంతా జరిగినది, నీవు చేయు విధముగా ప్రతిరోజు సాయిపూజ చేసెదనని కొడుకునకు మాటయిచ్చి అమాట తప్పి ఈరోజు నైవేద్యం పెట్టనందుకు శిక్షగా ఈ పూట నేను కూడ భోజనము చేయనని ఫోటోలోనున్న బాబాకు చెప్పి భోజనము చేయకనే తిరిగి కోర్టునకు వెళ్ళిపోయెను.

అదే సమయములో షిరిడిలోని ద్వారకామాయిలో ఆత్మారామ్ కుమారుడు, భార్య భక్తి శ్రద్ధలతో బాబా ఎదురుగా నిలబడి యున్నారు. బాబా ఆమెను పిలిచి "అమ్మా నాకెంతో ఆకలిగా వుండి ఏమైనా తిందామని బాంద్రాలో గల మీ యింటికి

ఈ రోజు వెళ్ళాను. మీ పూజా గది తాళంవేసి వుంది. అయినా నేను లోపలికి వెళ్ళాను. అక్కడ తినుటకు నాకు ఏమీ లభించలేదు. ఆకలితోనే తిరిగి వచ్చాను. నన్ను ఆకలితో తిరిగి పంపిన నీ భర్త తాను కూడ ఈ రోజు ఆహారం తీసుకోలేదమ్మా" అని చెప్పగా వారిద్దరూ ఆశ్చర్యపడి విషయాన్ని వివరంగా బాంద్రాకు వుత్తరం రాశారు. కోర్టుకు తిరిగి వెళ్ళిన ఆత్మారామ్ కూడ వెంటనే అదే రోజున తన వలన జరిగిన పొరపాటును తెలియ చేస్తూ కొడుకునకు ఉత్తరము వ్రాసెను. మూడవరోజున బాంద్రా నుంచి రాసిన వుత్తరం షిరిడిలోని కుమారునకు షిరిడీలో కుమారుడు రాసిన వుత్తరం బాంద్రాలోని తండ్రికి అందినవి. ఆ వుత్తరం తీసుకుని బాబా వద్దకు పరుగున వెళ్ళిన కుమారునితో బాబా బిడ్డా నీవు భయపడకుము. యికముందు నీ తండ్రి కూడ నన్ను మరువడు. నీ వలనే అతడు కూడ పూజ చేయును. నీవు నీ యిష్టము వచ్చినన్ని రోజులు యిక్కడే వుండుమని ఆదేశించెను.

బాంద్రాలో ఆత్మారామ్ షిరిడి నుంచి కుమారుడు రాసిన వుత్తరం చూసి, బాంద్రాలో తాను నైవేద్యం పెట్టని విషయము, అందుకు శిక్షగా తాను ఉపవాసము వున్న విషయం బాబాకు ఎట్లు తెలిసెను అని ఆలోచించి, బాబా పటమునకు ఆయనకు ఏ మాత్రం తేడాలేదని, విగ్రహారాధన తప్పుకాదని నిర్ణయించుకుని ఆ రోజు నుంచి తన కొడుకుతో పాటుగా తాను కూడ పూజ చేయుదునని బాబాతో మొరపెట్టుకొనెను. తన కుమారుని వలన తనకు కలిగిన అనుభవానికి ఆనందపడెను. సాధారణంగా తల్లిదండ్రుల నుంచి పిల్లలు ఆధ్యాత్మిక విషయాలు నేర్చుకుంటారు. కాని ఈతని కుమారుడు తండ్రికి మార్గదర్శకుడై సాయి మార్గంలోకి లాగాడు. అట్టి కొడుకును కన్న ఆత్మారామ్ ధన్యుడు.

పాఠకులైన సాయి భక్తులు కూడ పిన్నలైనా పెద్దలైనా, వయసు భేదం లేకుండా పారాయణ చేయుచున్న ప్రతి కథలోని విషయాన్ని చక్కగా అవగాహన చేసుకుని జీవితంలో ఆచరణలో పెట్టుకుని ముందుకు సాగుతూ తోటి బంధుమిత్రులందరికీ ఆదర్శ సాయి భక్తులుగా నిలిచేందుకు తీవ్ర కృషి చేయవలెను. అందుకు సాయిని కూడ తనవంతు బాధ్యతను నిర్వర్తించమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువదవ అధ్యాయం సంపూర్ణం.

యిరువది ఒకటవ అధ్యాయము

ఒక్కొక్కసారి బాబా తనంతటతానే ఏదో ఒక కథవలె తనకు జరిగిన కొన్ని విషయములను తెలుపుచుండెడివాడు. ఒకనాడు లెండీబాగ్‌లో పూలమొక్కలకు నీళ్ళుపోసిన తరువాత దగ్గరలో గల ఒక చెట్టు క్రింద బాబాతో పాటుగా తాత్యా కూర్చుని వుండగా భాటే మొదలైన మరి కొంతమంది కూడ వచ్చి కూర్చొనిరి. అప్పుడు బాబా తన గతస్మృతిని ఈ విధముగా వివరించిరి.

వీరభద్రప్ప - చెన్నబసప్ప

ఒకనాటి వుదయము నేను విహారమునకు గాను కొంతదూరము నడచి వెళ్ళి ఒక చిన్న నది వడ్డునకు చేరి ఒక చెట్టు క్రింద విశ్రమించి వుంటిని. ఒక ప్రయాణీకుడు కూడ వచ్చి నాదగ్గరే కూర్చొనెను. కప్పయొకటి బెకబెకలాడుచుండెను. అతడు దానిని గురించి అడిగినాడు. ఒక కప్ప తాను పూర్వజన్మములో చేసిన పాపమును అనుభవించుచున్నదని చెప్పితిని. గత జన్మములో మనము చేసిన పాపపుణ్యముల ఫల మీ జన్మలో అనుభవించక తప్పదు. అతడు పోయి చూచి వచ్చి ఒక నల్లని పాము కప్పను మ్రింగుటకు సిద్ధముగానున్నదని చెప్పెను. గత జన్మలో ఆ రెండు ప్రాణులు దుర్మార్గముగ ప్రవర్తించినవే కావున ఆ విషయమును ఈ జన్మమున కూడ అనుభవించుచునే యున్నవని చెప్పితిని. కొద్ది క్షణములలోనే పాము కప్పను మ్రింగునని అతడు చెప్పెను, నేను దానికి తండ్రిలాంటివాడను. కప్పను చావనీయనని చెప్పి యిద్దరములేచి అక్కడకు వెళ్ళితిమి. నేను వాటికి దగ్గరగా వెళ్ళి యిట్లంటిని. ఏమి వీరభద్రప్పా! నీ విరోధి చెన్న బసప్ప కప్ప జన్మమెత్తి నీచమైన బ్రతుకు బ్రతుకుట లేదా! నీవు పాము జన్మనెత్తినను మీ మధ్యగల వైరము నశించలేదా? ఛీ! ఎందులకీ వైర భావములు. మీ ద్వేషములను వదలి శాంతింపుడు.

నా మాటలు విని పాము కప్పను విడిచి నీటిలోనికి పోయెను. కప్ప గెంతుతూ వేరొక వైపునకు పోయెను. బాటసారి ఈ దృశ్యమును చూసి ఆశ్చర్యపడి వీరభద్రప్ప, చెన్న బసప్పలు ఎవరు, ఆ వివరాలు వివరించమని కోరగా కప్ప పాముల యొక్క గత జన్మలోని విశేషములను ఈ విధముగా వివరించితిని.

మయూరి అను గ్రామమునకు కొంత దూరములో ఒక పురాతన శివాలయము వుండెడిది. అది శిథిల స్థితిలో వుండెను. ఆ గ్రామములోని ప్రజలు దానికి మరమ్మతులు చేయుటకై చందాల రూపములో పెద్దమొత్తమును వసూలు చేసి వూరిలో గల ధనవంతుని కోశాధికారిగా నియమించి ఆ ధనమును అతని చేతిలో పెట్టిరి. అతడు పరమలోభి. దేవాలయము కొరకు చాలా తక్కువ ఖర్చుపెట్టి ఎక్కువగా ఖర్చుపెట్టినట్లు లెక్కలు వ్రాసేవాడు. దేవాలయము అభివృద్ధికాలేదు. ఎవరైనా వచ్చి అడిగినచో తియ్యని మాటలు చెప్పువాడు.

కొన్ని రోజుల తరువాత ఆ మందిరములో గల మహదేవుడు ఆలోభి భార్యకు కలలో కనిపించి "నీవు దేవాలయపు శిఖరమును కట్టించుము. నీవు ఖర్చుపెట్టిన దానికి 100 రెట్లు ధనము నీకు తిరిగి యిచ్చెద" నని చెప్పెను. ఈ విషయము భర్తకు చెప్పగా అతడు యిది ధనము ఖర్చగు విషయము గనుక భార్యను ఎగతాళి చేసి అది మామూలు స్వప్నమని దానిని నమ్మవలదని చెప్పెను. తాను కూడ అక్కడే వుండగా తనకు చెప్పకుండా ఆమెకు చెప్పుట యిది భార్యభర్తలను విడదీయు మార్గమువలె తోచుచున్నదని ఆమెను భయపెట్టెను. ఆమె నిస్సహాయురాలై వూరకుండెను.

మరి కొద్ది రోజుల తరువాత మళ్ళీ ఆమె కలలో మహాదేవుడు కనిపించి భర్త వద్ద గల ధనం విషయం గురించిగాని అతని ధనం ఖర్చు విషయం గురించిగాని అడగక తన వద్ద గల దానితో మందిర గోపురం నిర్మించమని చెప్పెను. ఈ విషయము ఆమె తన భర్తతో సంప్రదించి తనకు పసుపు కుంకుమలుగా పుట్టింటివారిచ్చిన బంగారు ఆభరణములను ఈ దైవకార్యమునకు దానము చేయుటకు నిర్ణయించుకొనినది. ఆ పరమలోభి దానికి కూడ చీకాకుపడి ఆ నగలను కూడ బయటకు పోనీయరాదని వాటిని చాలా తక్కువ ధరకు వెలకట్టి వెయ్యి రూపాయలకు తానేకొని ఆ వెయ్యి రూపాయలు నగదుగా యివ్వకుండా సాగు చేయుటకు పనికిరాక బీడుపడియున్న కొంత పొలమును యిచ్చెను. ఆ పొలము కూడ అతని సొంతము కాదు. దుబాకి అను ఒక పేదరాలు రెండువందల రూపాయలకు ఎప్పుడో కుదువపెట్టగా ఆ బాకీ క్రింద పొలమును అతడు ఆక్రమించెను. యిట్లు నికృష్టుడైన ఆ లోభి ధనము మీద ఆశతో తన భార్యను, దుబాకీని, దైవమును కూడ మోసగించెను. అది ఎలాగూ పనికిరాని భూమి కాబట్టి దానిని మందిర పూజారికి స్వాధీనపరచిరి.

కొన్నాళ్ళ తరువాత గొప్ప తుఫాను వచ్చి కుంభవృష్టిగా వాన కురిసెను. ఆ సమయములో లోభి యింటిపై పిడుగుపడుటచే లోభి అతని భార్య చనిపోయిరి. కాలగమనము దుబాకి కూడ చనిపోయెను. ఆ తరువాత జన్మలో లోభి దగ్గరలో గల్ల మధురాపట్టణంలోని బ్రాహ్మణ కుటుంబంలో వీరభద్రప్పయను పేరుతో బీద బ్రాహ్మణ కుటుంబంలో పుట్టి భిక్షాటన చేయుచు జీవితం గడుపుచుండెను. అతని భార్య పూజారి కూతురుగా గౌరి అను పేరుతో పెరుగుచుండెను. దుబాకి మందిరపు యజమాని యింటిలో మగ శిశువుగా పుట్టి చెన్న బసప్ప పేరుతో పెరిగెను. వీరభద్రప్ప ఈ జన్మలో కూడ ధనమునకై మిక్కిలి తాపత్రయ పడుచుండెను.

ఉన్నట్లుండి పొలముల ధరలు పెరిగిపోయెను. గౌరికి పూజారి కానుకగా యిచ్చిన దుబాకి భూమి లక్ష రూపాయలకు అమ్ముడు పోయెను. ఆమెకు గల ఆభరణముల విలువ కూడ 100 రెట్లు పెరిగెను. ఆస్థికి విలువలేనంత వరకు ఎవరూ పట్టించుకొనలేదు. విలువ పెరుగగానే ధనమునకై తగవులాటలు ప్రారంభమైయ్యెను, సలహాకై నావద్దకు రాగా ఆ ఆస్థి అంతయు మహాదేవునిది కాబట్టి అది పూజారికి వర్తించునని పూజారికి కొడుకులు లేనందున సర్వహక్కులు గౌరికి వచ్చునని, ఆమె అనుమతి లేనిదే పైకం ఖర్చు చేయరాదని, ఆమె భర్తకు ఆస్తిపై అధికారము లేదని సలహా నిచ్చితిని. అందుకు కోపగించిన్న వీరభద్రప్ప గౌరి ద్వారా ధనము అపహరించుటకు నేనిట్లు ప్రయత్నించచున్నానని నాపై నేరారోపణ చేసెను. అతని మాటలు వినిన నేను భగవంతుని ధ్యానించి వూరుకుంటిని. ధన విషయంలో వీరభద్రప్ప చెన్న బసప్పలు విరోధులైరి శత్రుత్వము వారిలో పెరిగినది. వీరభద్రప్ప మిక్కిలి కోపిష్టి ముక్కలు ముక్కలుగా నరికెదనని చెన్న బసప్పను హెచ్చరించెను. చెన్న బసప్ప పిరికివాడు నన్నాశ్రయించెను. అతనిని తన శతృవుబారి నుండి రక్షించెదనని వాగ్దానము చేసి యుంటిని. కొంతకాలమునకు వీరభద్రప్ప చనిపోయి పాముగా జన్మించెను. చెన్న బసప్ప మరణించి కప్పగా జన్మించెను. వారి గత జన్మ వైరభావములే ఈ జన్మలోను వుండుటచే పాము కప్పను మ్రింగుటకు ప్రయత్నించెను. నావాగ్దానమునునిలుపుకొనుటకు దైవం నన్నిక్కడకు పంపి కప్పను రక్షించునట్లు చేసెను.

రెండు మేకల కథలోవలె ఈ కథ నుంచి కూడ మనం అనేక ముఖ్య విషయాలను గమనించవలెను. 1. శతృత్వము, విరోధభావాలు జీవితలక్ష్యాలుగా వుంటే

మరుజన్మలో మానవజీవితం నుండి దిగజారిపోయి జంతుజీవితం పొందక తప్పదు. కాబట్టి మన మేలుకొరకైనా మనం, శతృత్వం, విరోధాలు లేకుండా సాయి చూపిన ప్రేమ మార్గంలోనే జీవితం గడపాలి. 2. దైవ ధనాన్ని ఆశతో సొంతం చేసుకుని తనకొరకు లేక కుటుంబం కొరకు ఖర్చుపెట్టుకుంటే వీరభద్రప్పవలె మరుజన్మలో కటికదరిద్రంతో భిక్షాటన చేసుకొనక తప్పదు. పాఠకులైన వారిలో ఎవ్వరైనా దైవధనానికి ట్రస్టీలుగా, సెక్రటరీలుగా, అధికారులుగా లేక అనధికార పెద్దలుగా గాని వున్నవారుంటే జాగ్రత్తగా వ్యవహరించి, ఒక్కరూపాయి కూడ ఎలాంటి పరిస్థితులలోను స్వార్థానికి ఉపయోగించుకొనవద్దు. ఒకవేళ యింతకు ముందు తెలియని స్థితిలో అలాచేసి వుంటే వీలైనంత త్వరలో ఆ ధనాన్ని ఆ దైవానికి తిరిగి సమర్పించండి భక్తి శ్రద్ధలతో మీరు చేసే ఈ పారాయణ ఫలం మీ జీవితాలను బాగుచేయాలని, పవిత్రపరచాలనే సదుద్దేశంతో చేస్తున్న ఈ సూచనను పాఠకులు సహృదయంతో అర్థంచేసుకొని ఆచరించి పవిత్రులౌతారని ఆశిద్దాము.

దేవుతల్లి ఉద్యాపన వ్రతము

థాణా జిల్లాలో దాహమ్ అను వూరిలో దేవ్ అనుపేరుగల సాయి భక్తుడు తహసీల్‌దారుగా పనిచేయుచుండెను. వీరి కుటుంబమంతా సాయి భక్తులు. ఈతని తల్లి ఒక వ్రతమును ప్రారంభించినది. దాని ప్రకారము ఆమె ఒక నెలరోజులపాటు నిత్య పూజాది కార్యక్రములు నిర్వర్తించి ఆఖరిరోజున నోము ఉద్యాపన జరుగును. ఆరోజున శక్తి కొలది బంధుమిత్రులకు భక్తులకు భోజనము పెట్టవలసివుండును. తన తల్లిచేయు ఆ వ్రతపువుద్యాపననాడు వైభవముగా కార్యక్రమును జరిపించి నాలుగైదు వందల మందికి భోజనములు పెట్టవలెనని దేవ్ సంకల్పించెను. ఈ విషయం చర్చించుచున్న సందర్భంలో అతని భార్య షిరిడి నుండి బాబా కూడ వచ్చిన ఈ వ్రతము యొక్క ఫలము నూరురెట్లు పెరుగుతుందని, తమ ప్రత్యక్ష దైవమైన సాయిని ఆహ్వానించమని కోరగా అందరూ సంతసించి షిరిడిలోగల బాపుసాహెబ్ జోగ్‌నకు తనకు బదులుగా బాబాను ఈ కార్యక్రమమునకు రావలసినదిగా ఆహ్వానించమని దేవ్ ఉత్తరము వ్రాసెను. ద్వారకామాయిలో ఆసీనుడైన సాయి జోగ్ ద్వారా దేవ్ ఆహ్వానమును అందుకుని, "భక్తితో నన్ను పిలుచువారి వద్దకు నేను పరుగెత్తుకొనివచ్చెదను. నన్ను గుర్తుంచుకొను వారిని నేను మరువను. నన్ను ప్రేమతో ఎవరు, ఎప్పుడు తలచిన అప్పుడే వారి దగ్గర వుండగలను నేను మరియిద్దరితో

కలిసి వచ్చెదనని దేవ్‌కు వుత్తరం వ్రాయుము" అని చెప్పెను. షిరిడి నుంచి జోగ్ వ్రాసిన ఆ సమాధానం చూసి దేవ్ కుటుంబ సభ్యులంతా ఆనందించిరి. వుద్యాపన వ్రతమునకు యింకా నెలరోజులు వ్యవధి వున్నది.

దాహమ్ రైల్వే స్టేషన్‌కు గోసంరక్షణ చందాల కొరకు ఒక సన్యాసివచ్చి రైల్వే స్టేషన్ మాస్టరుతో సంప్రదించెను. అతని వేష భాషలను బట్టి బెంగాలీ వలె వుండెను. పూరిలోగల మమలత దారుదేవ్‌ను సంప్రదించినచో వారు సహాయపడెదరని స్టేషన్ మాస్టరు చెప్పుచుండెను. యింతలో దేవ్‌కూడ ఏదోపని మీద అక్కడకు వెళ్ళెను. విషయము తెలుసుకున్న దేవ్ అప్పుడు పూరిలో మరొక ధర్మకార్యం కొరకు చందాలు వసూలు చేయుచున్నారు కాబట్టి ఒకనెల రోజుల తరువాత వచ్చిన బాగుండునని చెప్పగా సన్యాసి వెళ్ళిపోయెను. నెలరోజులు గడిచినవి. ఆరోజు దేవ్ తల్లి నోము వుద్యాపన జరుగుచున్న దేవ్‌యిల్లు బంధుమిత్రులతో కోలాహలముగా వుండెను. వుదయపు వేళ బెంగాలీ సన్యాసి సరాసరి దేవ్ యింటి ముదు టాంగా దిగెను. దేవ్ వానిని గుర్తించి ఆహ్వానించెను. బెంగాలీ సన్యాసి తాను చందాల కొరకు రాలేదని, భోజనము కొరకు వచ్చితినని చెప్పెను. అందుకు దేవ్ మంచిది. ఈరోజు నా తల్లి నోమువుద్యాపన జరుగుచున్నది. మధ్యాహ్నం పన్నెండు గంటలకల్లా భోజనము వడ్డించబడును. మీరు తప్పక దయుచేయుడు. మీ మకాము తెలిపినచో కబురు పంపెదనని చెప్పెను. అందుకు నీవు కార్యార్థివి. అనేక పనులు చూసుకొనవలసి వుంటుంది. గనుక మాకు నీవు తిరిగి కబురు పంపవలసిన పనిలేదు, కావలెనని భోజనమునకు వచ్చిన మేము సరియగు సమయమునకు తప్పక వచ్చెదము నాతోపాటుగా మరి యిద్దరు మిత్రులున్నారు ముగ్గురము కలిసి వచ్చి భోజనము చేసెదమని చెప్పి వెళ్ళిపోయెను.

సమయము పన్నెండు గంటలైనది. వడ్డనలు ప్రారంభించబడు సమయమునకు సన్యాసి యిద్దరు కుర్రవాళ్ళను వెంట తీసుకొని వచ్చి భుజించెను. నిర్విఘ్నముగా నిరాటంకముగా జయప్రదముగా వ్రతము పూర్తి అయ్యెను. సాయి పదధ్యానంతో యింత చక్కగా జరిగిన ఈ కార్యమునకు బాబా రాలేదు కదా! అని భావించిన దేవ్ తిరిగి షిరిడిలో గల జోగ్‌కు ఆ విషయమై ఉత్తరం వ్రాసెను. ఉత్తరం తీసుకొని మసీదుకు చేరిన జోగ్‌తో బాబా ఈ సాయి ఎన్నటికీ మోసకాడు కాదు. రమ్మనమని పిలిచినవాడు వెళ్ళిన వారిని గుర్తించవలదా? బెంగాలీ సన్యాసి

గో సంరక్షణ చందాలకని రాలేదని, భోజనము కొరకే వచ్చితిమని, నేను కాక మరి యిద్దరు మిత్రులు వుంటిరని, కావలెనని భోజనమునకు వచ్చిన మాకు తిరిగి కబురు పంపనక్కర లేదని యిన్ని విధముల చెప్పి సరియగు సమయమునకు వెళ్ళి ముగ్గురమూ భుజించి వచ్చితిమి. యిప్పటికైనా గుర్తు తెచ్చుకోమని ఉత్తరము వ్రాయమని జోగ్‌తో చెప్పెను. జోగ్‌తో బాబా యింకనూ యిట్లు చెప్పెను.

నా పద ధ్యానముతో నన్ను స్మరించుచూ మీరు చేయు సత్కర్మలకు ఎట్టి అడ్డంకులు రాలేవు. నా భక్తులను ఎల్లప్పుడు నేను వెంటాడి తిరుగుచుందును. వారి బాగోగులు చూచి పాలించుట నా కర్తవ్యము నా మాటలను నిలబెట్టుకొనుటకు నేను ప్రాణములనైనా విడిచెదను. నా మాటలు ఎన్నటికీ పొల్లుపోవు.

గురుస్థాన్ వేపచెట్టు క్రింద పాదుకలు

1912లో బొంబాయి నివాసి రామారావు కొఠారే అను డాక్టరు షిరిడికి వచ్చి బాబా యందు ఆకర్షితుడై చాలా రోజులు షిరిడి యందే వుండెను. ఈ కాలములో బాబా వద్దగల భక్తులు దీక్షిత్, చందోర్కరు, శ్యామా మొదలయిన వారితో స్నేహమేర్పడెను. అట్లు వారిలో వారు చర్చించుకొనునపుడు బాబా మొదట షిరిడికి వచ్చి వేపచెట్టు క్రింద వున్నందుకు గుర్తుగా అక్కడ బాబా పాదములను రాతితో చెక్కించి పెట్టిన బాగుండునని తలచిరి. తరువాత కొఠారే బొంబాయి నుంచి పాదుకలను చెక్కించి పంపిరి. ఖండోబా మందిరంలో నున్న ఉపాసనీ బాబా సలహాపై శ్రావణ పౌర్ణిమనాడు వాటిని వూరేగింపుగా తెచ్చిరి. ఆ రోజు ఉదయం పదకొండు గంటలకు దీక్షిత్ పాదుకలను తన తలపై పెట్టుకుని తెచ్చెను. మేళ తాళములతో వూరేగింపుగా ఖండోబా మందిరం నుంచి ద్వారకామయి వరకు బాబా ఆశీర్వాదము తీసుకొనిన తరువాత వేపచెట్టు క్రింది ప్రతిష్ఠించిరి. ఉపాసనీ బాబా రచించిన "సదానింబ వృక్షస్య మూలాధి వాసాత్" అనే సాయి మహిమ శ్లోకాన్ని కూడ అక్కడ చెక్కించిరి. ఆరోజు నుంచి గురుస్థాన్‌లో కూడ నిత్యదీపారాధన పూజ జరుగుచున్నది. యిక్కడ గురువారమునాడు నేలను శుభ్రపరచి అగరువత్తులు, సాంబ్రాణి ధూపము వేయువారు భగవంతుని అనుగ్రహ ఆశీర్వాదములకు ప్రాప్తులయ్యెదరని బాబా స్వయముగా చెప్పెను.

రతన్‌జీ వాడియా

నాందేడు నివాసి రతన్‌జీ షాపుర్జీ వాడియా అను పార్శీ వర్తకుడు మిక్కిలి ధనవంతుడు. అతనికి సంతానము లేదు. దాసుగణు సలహాపై షిరిడికి వెళ్ళి బాబాను

దర్శించెను. బాబాకు 5 రూపాయల దక్షిణ యివ్వవలెనని మనసులో అనుకొనెను. అది గ్రహించిన బాబా నా అయిదు రూపాయలు యిమ్మని అడిగెను. వెంటనే అయిదు రూపాయలలో 3 రూపాయల 14 అణాలు యిదివరకే తనకు ముట్టినవని, మిగిలిన 1 రూపాయి 2 అణాలను యిప్పుడు యివ్వమనెను. 3 రూపాయల 14 అణాలు యింత ముందెప్పుడూ తాను బాబాకు యివ్వలేదు కదా అని ఆలోచించి మిగిలిన దక్షిణ యిచ్చెను. మరుక్షణములోనే విషయమర్థమయ్యెను. అతడు షిరిడికి వెళ్ళవలెనని నిర్ణయించుకొనగానే నాందేడ్‌లోని అతని యింటికి మౌలా సాహెబ్ అను మహమ్మదీయ ఫకీరు వచ్చెను. ఆరోజు వారిని సత్కరించుటకు సరిగా 3 రూపాయల 14 అణాలు ఖర్చు అయ్యెను. ఈ విషయము గుర్తుకురాగా బాబా సర్వజ్ఞుడని తెలుసకోగలిగిన రతన్‌జీ బాబా పాదాల చెంతకూర్చుని తనకు సంతానాన్నిమ్మని కోరెను. అతనికి బాబాపై స్థిరమైన నమ్మకం కుదిరినది. కొలదికాలమునకే పుత్ర సంతానం కలిగెను.

బాబాయొక్క దక్షిణ వివరములు

బాబా తన దగ్గరకు వచ్చు భక్తులలో కొందరిని మాత్రమే దక్షిణ అడిగెడివారు. అడగకుండా యిచ్చినచో ఒక్కొక్కసారి స్వీకరించెడివాడు. కొన్ని సందర్భములలో అట్టి పైకమును తీసుకునెడి వారు కాదు. కేవలం ధనవంతులనుగాని, లేక కేవలం పేదవారిని గాని మాత్రమే అడిగెడివారు కాదు. పేద గొప్ప అందరూ వారికి సమానమే. స్త్రీలు, పిల్లలను కూడ అడిగెడివారు. ఒక్కొక్కప్పుడు అడిగిన వారి వద్ద ధనము లేదని చెప్పినచో అప్పు తీసుకొని యివ్వమనెడి వారు. అడిగినా యివ్వని వారిపై బాబా ఎప్పుడూ కోపగించుకుని ఎరుగరు. అడిగిన దాని కంటే ఎక్కువ యిచ్చినచో దానిని తిరిగి యిచ్చెడివారు ఒక్కొక్కప్పుడు దక్షిణ యిచ్చిన దానిలో నుంచి కొంతభాగం తిరిగి యిచ్చి పూజలో వుంచుకుని పూజించుకోమని చెప్పేవారు. ఒక్కొక్క రోజు ఒకే భక్తుని నాలుగైదు సార్లు కూడ దక్షిణ అడిగేవారు. కొందరు తాము తెచ్చుకున్న పైకమునంతా బాబాకు సమర్పించిన సందర్భాలున్నవి. మొత్తము మీద బాబా దక్షిణ స్వయంగా అడిగి తీసుకున్న భక్తులు ఆశీర్వదించబడుచుండెడివారు. అలాంటి వారు ముందు జీవితములోధనమునకు బాధపడెడివారు కాదు. దక్షిణ అడుగుట తమ మంచికేననే భావన భక్తులలో వుండెడిది.

ఈ విధముగా వసూలైన పైకములో చాలా కొంచెము మాత్రమే తన చిలుమునకు, ధునికొరకు ఖర్చుపెట్టుకుని మిగిలిన ధనమును పేదలకు ఆశ్రితులకు పంచిపెట్టెడివారు. ఒక రూపాయి మొదలు 60 రూపాయల వరకు బాబా ప్రతి నిత్యము అనేకమంది ఆశ్రితులకు దానము చేయు చుండెడివారు. అప్పటి బ్రిటిష ప్రభుత్వము బాబాపై నియమించిన గూఢచారి యొక్క నివేదిక ప్రకారము బాబా తనకు దక్షిణగా వచ్చే డబ్బుకన్నా ఎక్కువ ధనాన్ని ప్రతిరోజు దానం చేసేవారట.

ఆధ్యాత్మిక జీవితమునకు ఆటంకములు సాధారంగా రెండు విషయములు 1. ధనము 2. స్త్రీ పురుష శారీరక సంబంధము. బాబా తనవద్దకు వచ్చు భక్తులకు ఈ రెంటి విషయములలోను పరీక్షించెడివారు. ధనమును దక్షిణ ద్వారా అడిగెడివారు. ఆ తరువాత వారిని రాధాకృష్ణమాయి యింటికి పంపేవారు. రాధాకృష్ణమాయి వితంతువు. బాబా భక్తురాలు. ఈమె చక్కని సౌందర్యవతి. బాబా వద్దకు దూర ప్రాంతముల నుంచి వచ్చు భక్తులకు భోజనాది ఏర్పాట్లు తన యింటిలో చేస్తూ వుండెడిది. ఈమె తన శక్తులను బాబాసేవకే అంకితమొనర్చెను. ఆమె భక్తికి మెచ్చి బాబా ఈమెకు తెలియకుండానే కొన్ని శక్తులను ప్రసాదించెను. తన దగ్గరకు వచ్చు వారి మనోభావములను ఈమె గమనించగలిగేది. ఈమె శారీరక సౌందర్యమును చూచి మనసు చలించిన వారిని వెంటనే హెచ్చరించుచుండెడిది. షిరిడికి వచ్చిన పురుషులైన భక్తులను ఎప్పుడో ఒకప్పుడు బాబా తప్పక ఈమె యింటికి పంపేవారు. యిది ఒక పరీక్ష. స్త్రీ, పురుషులెవరైనా ఈమె యింటిలో నున్నంత సేపు జాగ్రత్తగా వుండవలసి వచ్చెడిది.

షిరిడి సంస్థానములో గల విలువైన వస్తువులన్నిటినీ ఈమె సలహాపైనే భక్తులు తెచ్చియిచ్చిరి. బాబాకు వాటియందు ఏమాత్రం శ్రద్ధలేదు. బాబా తరచుగా తన ఆస్తి అంతయూ ఒక కౌపీనము, ఒక విడిగుడ్డ, ఒక గ్లాసు మాత్రమేనని చెపుతూవుండేవారు. వారి మనసు భౌతిక వస్తువుల మీదగాని విషయవాసనలయందు గాని ఏనాడు లగ్నం కాలేదు. అదే విధముగా భక్తి శ్రద్ధలతో ఈ జీవితచరిత్రను పారాయణచేయు భక్తుల మనసులందు కూడ ప్రాపంచిక వ్యామోహములు తొలగునట్లు చేయమని, వారికి శాంతి సౌఖ్యములను ప్రసాదించమని సాయిని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఒకటవ అధ్యాయం సంపూర్ణం.

యిరువది రెండవ అధ్యాయము

బాబా తనవద్దకు వచ్చు భక్తులకు అనేక విధములుగా విషయములు బోధించెడి వారు. అందుకు ఒక ప్రత్యేక స్థలముగాని, సమయము గాని వుండెడిది కాదు. ఒకనాడు ఒక భక్తుడు యింకొక భక్తుని గూర్చి అతడు లేని సమయములో యితరుల వద్ద అతనిని గూర్చి నోటికి వచ్చిన దుర్భాషలాడి నిందించుచున్నాడు. కొంతసేపటి తర్వాత బాబా లెండిబాగ్‌కు వెలుచున్నప్పుడు అతడు వచ్చి బాబాను కలిసి, ఏమోమో కోరికలు కోరెను. బాబా ప్రక్కనే గల పందిని చూపుతూ "చూడు ఈ పంది కసువును ఎంత రుచికరముగా తినుచున్నదో నీ భావము కూడ అట్లే యున్నది. సాటి సోదర భక్తుని నోటికి వచ్చినట్లు తిట్టుచున్నావు. ఎంతో పుణ్యము చేసుకొనగా నీకే మానవజన్మ లభించినది. నీ విప్పుడు యిట్టి దుష్ట ప్రవర్తనను మానుకొననిచో నీకు షిరిడి కూడ ఏ విధముగను ఉపయోగపడదు". దీనిని బట్టి మనం గ్రహించవలసిన నీతి మేము సాయి భక్తులమని, ఎన్నో పూజలు చేస్తామని, ఎన్నోసార్లు షిరిడి వెళ్ళామని సంతోషిస్తే లాభంలేదు. పరులకు కష్టనష్టాలు ఎట్టి పరిస్థితులలోను కలిగించరాదు. ఒకవేళ అలాంటి పనులు చేస్తే బాబా స్వయంగా చెప్పినట్లుగా షిరిడిలోని బాబా కూడ మనలను రక్షించడు.

చోల్కార్ చెక్కెరలేని టీ

ఠాణా జిల్లాలో ప్రసిద్ధి చెందిన కోపీనేశ్వరాలయం కలదు. ఒకనాడు దాసుగణు ఈ మందిరంలో బాబా పటంపెట్టి వారి కథ చెప్పుచుండెను. బాబా లీలలు మహిమలను వినిన చోల్కార్ పరవశించెను. అతడు నిరుపేద. కుటుంబమును కూడ సరిగా పోషించుకోలేనివాడు.. "నాకు ఖాయమైన వుద్యోగము దొరికిన షిరిడికి వచ్చి నీ పాదములను దర్శించెద"నని మొక్కుకొనెను. ఆ తరువాత ప్రభుత్వ పరీక్షలో ఉత్తీర్ణుడై సివిల్ కోర్టులో గుమస్తా వుద్యోగమును సంపాదించగలిగెను. అతనిది పెద్ద కుటుంబమగుటచే షిరిడికి వెళ్ళి మొక్కుతీర్చుకొనుటకు తగిన పైకం లేక వూరకుండెను. ఎట్లయినను ప్రయత్నించి షిరిడి వెళ్ళవలెనను పట్టుదలతో టీ త్రాగునప్పుడు అందులో చక్కెర వేయకుండా ఆ డబ్బులు మిగిల్చి కొంతకాలం తరువాత షిరిడికి వెళ్ళి బాబాను దర్శించెను. సాయి పాదములకు మ్రొక్కి పరవశుడై కలకండ ప్రసాదమును బాబా పేరున భక్తులందరికీ పంచిపెట్టెను. చోల్కార్ బాపూసాహెబ్ జోగ్ యింటిలో దిగెను. మధ్యాన్న ఆరతి తరువాత వారిద్దరూ యింటికి

వెళ్ళుటకు లేచిరి. జోగ్‌ను పిలిచి నీ అతిథికి టీ యిచ్చునప్పుడు చక్కెర అధికముగా వేసి యిమ్ము అని చెప్పెను. జోగ్‌నకు ఆ విషయమేమైనది అర్థం కాలేదు. చోల్కారునకు మాత్రం కళ్ళలో నీళ్ళు తిరిగినవి. బాబా యొక్క సర్వజ్ఞత అర్థమయ్యెను. యిన్ని రోజులూ చెక్కెరలేని టీ త్రాగి అట్లు కూడబెట్టిన పైకముతో షిరిడికి వచ్చి మొక్కు తీర్చుకున్న తాను నిజముగా ధన్యుడనైతినని సంతోషించెను ఆనంద పారవశ్యంలోనున్న చోల్కార్‌నుద్దేశించి బాబా యిట్లు పలికెను. "నా ఎదుట మీరు చేతులు చాచి నన్ను మనస్ఫూర్తిగా ప్రార్థించినచో రాత్రింపగళ్ళు నేను మీ వెంటనే వుండెదను. ఈ శరీరంతో షిరిడిలోనే నేను వున్నా సప్తసముద్రముల అవతల మీరేమి చేయుచున్నను నాకు తెలియుచునే వుండును, ఈ విశాల భూమండలం పై నీవు ఎక్కడికి వెళ్ళినా నీ చెంతనేనుండ గలను. భక్తుల హృదయమే నాకు నివాసము. నీ హృదయములోను, సర్వజనుల హృదయములోను నేను నిండి యున్నాను. ఎవరునన్ను ఈ విధముగా గుర్తించగలుగుదురో వారు పావనలు, ధన్యులు, అదృష్టవంతులు.

రెండు బల్లులుకధ

ఒకనాడు బాబా ద్వారకామాయి మసీదులో కూర్చుని వుండగా గోడపైన గల ఒక బల్లి టిక్కు టిక్కుమని శబ్దము చేసెను. ఎదురుగా కూర్చున్న భక్తుడు బల్లి అరచుటకుగల కారణమేమని బాబాను అడిగెను. ఔరంగాబాదు నుంచి తన చెల్లెలు తనను చూచుటకువచ్చుచున్నదని ఆ బల్లి సంతోషపడుతున్నట్లుగా బాబా చెప్పిరి. భక్తుడు యింకేమియు మాట్లాడక వూరకుండెను. యింతలో ఎవరో ఒక భక్తుడు బాబాను చూచుటకు ఔరంగాబాదు నుంచి గుర్రముపై వచ్చెను. గుర్రమునకు దానా పెట్టుటకు తన వద్దగల సంచిని తీసి విదిలించగా అందులో నుంచి ఒక బల్లి క్రిందపడి వేగముగా గోడపైకి ఎక్కెను. అంతకు ముందు అడిగిన భక్తునితో ఆ బల్లులను జాగ్రత్తగా గమనించమని బాబా చెప్పిరి. ఆ బల్లి తన చెల్లిని కలుసుకొనెను. అక్కచెల్లిళ్ళద్దరూ ముద్దాడుకొనిరి. ఆనందముతో గుండ్రముగా తిరుగుతూ ఆడిరి. బాబా ఎదురుగా కూర్చుని ఈ దృశ్యమును చూచిన వారంతా ఆశ్చర్యముతో నిశ్చేష్టులైరి. ఎక్కడి ఔరంగాబాదు, ఎక్కడి షిరిడి! ఈ బల్లులు రెండు అక్కచెల్లెళ్ళే అయితే యింతదూరంలో గల వేర్వేరు ప్రాంతాలలో ఎట్లుండెను. ఆ బల్లి యిక్కడకు వస్తున్నట్లు బాబా కెట్లు తెలిసెను? జంతుజాలము యొక్క భావనలు, భాష కూడ బాబాకు

తెలుసా? యిలాంటి ప్రశ్నలు, సందేహాలు, అనుమానాలు అక్కడి భక్తులలో కలగగా వారు ఆశ్చర్యముతో బాబాను తదేకంగా చూచుచుండిరి.

విషయమును గ్రహించిన బాబా వారితో ఈ బల్లులు విషయమే కాదు, సృష్టిలోని ప్రతి అణువు లోపల ఎప్పుడు ఏమి జరుగుచున్నదో సర్వం నాకు తెలియుచుండును. నా అనుమతి లేనిదే చెట్టుపై గల ఆకు గాలి వేసినా కదలుటకు కూడ వీలులేదు. భగవంతుడు సర్వశక్తివంతుడు, ఆయన సృష్టించిన ఈ సృష్టి నియమములను అందరూ పాటించవలెను. నేను కాని యింకెవరు కాని సృష్టి నియమములకు వ్యతిరేకముగా ప్రవర్తించరాదు. యావత్ సృష్టికి యజమాని దేముడే అల్లామాలిక్ హై అని చెప్పిరి.

జయజాబాయికి బాబా వాగ్దానము

బాబా స్వయంగా అక్కా అని పిలిచిన జయజాబాయి వయసు పెరుగుటచే శక్తిహీనురాలయ్యెను. మంచము మీద నుంచి కూడ లేవలేని స్థితిలో వుండెను. తాత్యాను తల్లివద్దే వుండి ఆమెకు సేవ చేయవలసిందిగా బాబా ఆజ్ఞాపించెను. అప్పుడప్పుడు శ్యామాలాంటి సన్నిహితులను కూడ తాత్యాకు తోడుగా పంపెడివాడు బాబా. ఆమె అంతిమ ఘటియలు ఆసన్నమౌతున్నవి. ఆమె ఒక్కసారి బాబాను చూడవలెనని కోరుకున్నది. వెంటనే బాబా ఆమె తల వద్ద ప్రత్యక్షమైనాడు. ఆఖరి క్షణంలో బాబా దర్శనం ఆమెలో దివ్యచైతన్యాన్నిచ్చింది. తెలియని దివ్య ఆనందం ఆమెలో ప్రవేశించింది. ఆమె ఆత్మ ఆనందడోళికలలో ఏదో తెలియని స్వర్గలోకాల్లో తెలియాడుతున్నట్లుగా అనిపించిందామెకు. అది బహుశా బాబా యొక్క సంపూర్ణ అనుగ్రహ దివ్యదర్శన ప్రభావమై వుంటుంది. ఆమె ఏదో మాట్లాడాలని ప్రయత్నించింది. కాని బాబా యొక్క రూపదర్శన ఆనందంతో ఆమె గొంతు మూగబోయింది. తాత్యా చేతిని తీసుకుని బాబా చేతిలో పెట్టింది. ఆమె భావనను గ్రహించిన సాయి తాత్యాను ఈ క్షణం నుంచి తన ప్రాణం కంటే ఎక్కువగా చూసుకుంటానని చెప్పాడు. బాబా వాక్కు తిరుగులేని, సందేహించనక్కరలేని నిత్యసత్యమైన దైవవాక్కని ఆమెకు తెలుసు. ఆ మాటలను విన్న బయజాబాయి ప్రాణం శరీరం నుంచి వేరై అనంత శూన్యంతో కలిసిపోయింది.

గుడ్డపీలికలు దొంగిలించుట

బి.వి. దేవ్‌కు జ్ఞానేశ్వరి చదువవలెనని కోరిక యుండెను. భగవద్గీతకు జ్ఞానదేవుడు మరాఠీలో చేసిన అనువాదమును మహారాష్ట్రలో జ్ఞానేశ్వరి అనిపిలిచెదరు. దీనిని అత్యుత్తమమైన గ్రంథముగా భావించి చాలామంది మహారాష్ట్రలో నిత్యపారాయణ చేయుచుండెడివారు. కాని పాపము దేవ్ ఎప్పుడు జ్ఞానేశ్వరి ప్రారంభించినను ఏవో అడ్డంకులు వచ్చి మధ్యలోనే ఆగిపోయెడిది. యిందుకు ముఖ్యకారణం దాని భావం సరిగా అర్థం కాకపోవడమే. ఒకసారి గట్టి దీక్షబూని వెళ్ళి బాబా సమక్షంలో దానిని పారాయణ చేసి పూర్తి చేయవలెనని సంకల్పించి షిరిడికి వెళ్ళెను. బాబా 25 రూపాయలు దక్షిణ అడిగెను. దేవ్ ఆపైకం బాబాకు సమర్పించెనేగాని జ్ఞానేశ్వరి పారాయణ విషయం బాబాను అడుగలేదు. సాఠేవాడాకు వెళ్ళి బాలకరాంమాన్కర్ అను వానిని బాబా లీలల గురించి అడిగెను. అతడు మరుసటి రోజున ఆ వివరములు తెలుపుచుండగా బాబా దేవ్‌ను పిలిచి కళ్ళెర్రచేసి యిట్లు గద్దించెను. “తల నెరసి ముసలివాడివైనప్పటికి నీవింకా దొంగతనము మానలేదా! నిన్ను గొడ్డలితో చంపివేయుదును” దేవ్ గడగడా వణికిపోయెను. అతనికేమి అర్థము కాలేదు. యింతలో మరల 25 రూపాయల దక్షిణ అడిగెను. దేవ్ తెచ్చి యిచ్చెను. ఈసారి బాబా శాంతించెను. “నీకు నేను జలతారు శాలువా కప్పుటకు సిద్ధముగా వుండగా పాతగుడ్డ పీలికలను దొంగిలించెదవేల. జ్ఞానేశ్వరి చదువుము, నా ఎదురుగా కూర్చుని చదువు”మని ప్రేమతో చెప్పెను. వెంటనే అతడు జ్ఞానేశ్వరి చదువుట ప్రారంభించి ఎట్టి అడ్డంకులు లేక నిర్విఘ్నముగా మొదటిసారిగా పారాయణ ముగించగలిగెను. బాబా నిన్ను గొడ్డలితో చంపుదును అనగానే అతని మనోచాంచల్యము పోయినది. ఏకాగ్రత కుదిరి జ్ఞానేశ్వరి పూర్తిగా చదవగలిగినాడు. బాబా లీలను గురించి బాలకరాంను ప్రశ్నించుట పాతగుడ్డ పీలికలను దొంగిలించుట. బాబా స్వయంగా తన మహిమను అతనిపై చూపించి చిత్త చాంచల్యమును తొలగించి ఏకాగ్రతను పెంచి జ్ఞానేశ్వరి పారాయణ పూర్తి చేయించి అందులో విషయములు చక్కగా అర్థమగునట్లు చేయుట జలతారు శాలువా కప్పుట లాంటిది.

బాబా స్వయంగా చెప్పిన ఈ మాటలనుబట్టి ఈనాడు మనం గ్రహించ వలసిన ముఖ్యవిషయం. బాబా విషయంలో సలహాలకని, సంప్రదింపులకని బాధ

గురువుల వద్దకు పరుగులు తీసి విలువైన కాలాన్నీ, ధనాన్ని వృధా చేయవద్దు. నా సలహాను గాని సహాయాన్నిగాని కోరిన తక్షణమే యిస్తానన్న బాబా యొక్క అభయం నేటికి నిత్య సత్యమైనదని నమ్మి బాబానే సలహా అడిగి జలతారు శాలువాను పొందాలిగాని బాధ గురువుల నాశ్రయించి గుడ్డ పీలికలు దొంగిలించే ప్రయత్నం చేయవద్దు.

సదాశివ తార్కాడ్

యితడు బొంబాయిలోని ఒక ఫ్యాక్టరీలో మేనేజరుగా పనిచేసి అది మూతపడుటచే జీవనోపాధి లేక బాబా దగ్గరకు వచ్చెను. ఆ సమయములో షిరిడి నుంచి తాత్యాపాటిల్ మొదలగు కొందరు బాబా అనుమతి తీసుకుని అహమ్మద్‌నగర్‌కు సినిమా చూచుటకు వెళ్ళుచుండిరి. బాబా తార్కాడ్‌ను కూడ వారి వెంట వెళ్ళి సినిమా చూసి అక్కడి నుండి పూనాకు వెళ్ళమని చెప్పెను. నిరుద్యోగియై బాధపడుచున్న తనను సినిమాకు పంపుట ఆశ్చర్యమును కలిగించెను. బాబా వాక్కు జవదాటుటకు వీలు లేనిదని అతనికి తెలుసు. అందువలన అట్లే చేసెను. అతడు పూనా చేరుసరికి అక్కడ ఒక ఫ్యాక్టరీ యజమాని తన ఫ్యాక్టరీలో మానేజరు కొరకు ప్రయత్నిస్తూ తార్కాడ్ గురించి విని అతని బొంబాయి అడ్రసునకు టెలిగ్రాము పంపి అతని రాకకోసం ఎదురుచూచుచుండుటచే వెంటనే అతనికి ఉద్యోగము దొరికెను. బాబా యొక్క ప్రతి సూచన భావగర్భితముగను, భవిష్యత్ జ్ఞానముతోను కూడి యుండెడివి.

బాబాకు భోజనము పెట్టువిధానము

యిరువదియవ అధ్యాయము కథలోని రామచంద్ర ఆత్మారామ్ భార్య ఒకసారి షిరిడిలో ఒక భక్తుని యింట బసవుండగా మధ్యాన్న భోజనసమయములో ఆకలితో వున్న ఒక కుక్క ఆమె దగ్గరకు వచ్చి మొరిగెను. ఆమె తనకు వడ్డించిన పళ్ళెములోని ఒక రొట్టె ముక్కను కుక్కకు విసరివేయగా అది ఆతురతతో దానిని తిని సంతోషించి తోకాడించుకొనుచూ వెళ్ళిపోయెను. ఆ సాయంత్రం ఆమె ద్వారకామాయికి వెళ్ళి బాబాకు నమస్కరించగా బాబా ఆమెతో యిట్లనెను. తల్లీ నీవు నా కడుపు నిండా భోజనము పెట్టితివి. నా జీవశక్తులు సంతృప్తి పడినవి. యికపై కూడ నీ విట్లే చేయుము. ఆకలితో నున్న ప్రాణికి ముందు ఆహారము

పెట్టి ఆ తరువాత నీవు భుజించుము. ఈ మసీదు నా తల్లి. ఈమె వడిలో కూర్చుని నేనెన్నడూ అసత్యమాడను. ఈ విధముగా నీవు నాపై ఎప్పుడూ దయచూపుము. సర్వప్రాణులలోను నన్ను చూడుము. నీకు తప్పక సద్గతికల్గును. బాబా మాటలు విని ఆమె ఆశ్చర్యపడెను. ఈ గ్రామములో నా భోజనమునకు యితరులపై ఆధార పడియున్నాను. నేనే డబ్బిచ్చి యితరుల వద్ద భుజించుచుంటినే, అట్టి నేను నీకెప్పుడు భోజనము పెట్టితిని బాబా యని ప్రశ్నించెను. అందుకు బాబా మధ్యాహ్నము నీవు భోజనము చేయుటకు ముందు ఏ కుక్కకు నీవు రొట్టె ముక్క విసిరినావే, ఆ కుక్క నేను ఒక్కటే! పిల్లులు, కుక్కలు, ఈగలు, ఆవులు మొదలైన జంతుజాలమంతటిలోనూ నేనే నిండియున్నాను. నన్ను అన్నిటిలోనూ చూడగలిగినవారు ధన్యులు. నేను వేరు మిగిలిన ఈ జంతుజాలం వేరు అనే ద్వంద భావమును వీడుమని చెప్పెను. ఉపనిషత్తులలో సారమైన భగవంతుని జీవులన్నిటిలో చూడుమన్న ఈ నీతిని బాబా అనుభవపూర్వకంగా ఆమెకు నేర్పినారు.

సాయిబాబా ఉపదేశములు

మన దైనందిన జీవితంలో ప్రవర్తించవలసిన తీరును గురించి బాబా తరుచుగా యిలా చెపుతూ వుండేవారు. గతజన్మ సంబంధములవలననే యిప్పుడు మనముఒకరి నొకరు కలుసుకొనుచున్నాము. ఏమనిషైనా, ఏ జంతువైనా నీ దగ్గరకు వచ్చినప్పుడు నిర్దాక్షిణ్యముగా తరిమికొట్టవద్దు. చక్కగా ఆహ్వానించి తగిన మర్యాద చేయవలెను. దాహముతో నున్న వారికి నీరు, ఆకలితో వున్న వారికి అన్నము, దిగంబరులకు బట్టలు ఇవ్వవలెను. నీ వసారా యితరులు కూర్చుని విశ్రాంతి తీసుకొనుటకు ఉపయోగపడినచో భగవంతుడు నీపట్ల సంతృప్తి చెంది నిన్ను అనుగ్రహించును. ఎవరైనా ధనము కొరకు నీ దగ్గరకు వచ్చిన నీ కిష్టము లేకున్న వారికి ఈయనక్కరలేదు. కాని కఠినముగా మాట్లాడి వారి మనసు నొప్పించవద్దు. ఈ ప్రపంచము నడక ఒక నాటకరంగము వంటిది. నీ ముందు జరుగు చిత్రవిచిత్రమైన ఈ నాటకమును శ్రద్ధతో చూచుచుండుము. ఈ ప్రపంచము తల్లక్రిందులైనా నీవు చలించకుము. స్థిరముగా నుండుము. నీకు నాకు బేధములేదు. మనిద్దరం ఒక్కటే. నీకు నాకు మధ్యగల గోడను తొలగించుము. మనందరికీ భగవంతుడే యజమాని, అల్లామాలిక్ హై! భగవంతుడు తప్ప యితరులెవ్వరు మనలను కాపాడలేరు. భగవంతుని మార్గము అసాధారణమైనది, చాలా విలువైనది.

మనము ఊహించలేనిది. మన మందరము ఋణాను బంధముచే ఇక్కడ కలిసితిమి. పరస్పర ప్రేమతో కుల, మత, జాతి భేదాలుమాని మానవులందరు సుఖశాంతులతో వర్థిల్లాలి. పరోపకారమునకు భగవంతుడిచ్చిన ఈ శరీరమును ఉపయోగించవలెను. అట్టి వారి జీవితమే ధన్యము. మిగిలిన వారంతా పేరునకే బ్రతికెదరు.

సమయము, సందర్భము వచ్చినప్పుడల్లా బాబా ఈ విధముగా అనేక విషయములపై భక్తులకు చక్కగా అర్థమగునట్లు ఉపదేశములు చేసెడివారు. తాను సర్వాంతర్యామినని, భూమి, గాలి, నీరు, నిప్పు వెలుగులాంటి సమస్త పదార్థములలో సయితము తానున్నానని చెప్పెడివారు. తన వద్దకు వచ్చు భక్తులలో కొందరికి పాదపూజ, కొందరికి తన లీలలు వినుట, కొందరిని ఖండోబా మందిరమునకు పంపుట, మరికొందరికి సద్గ్రంధ పారాయణలాంటి అనేక విషయములు ఎవరెవరికి ఏది అవసరమో దానిని వారికి చెప్పెడివారు. కొందరికి స్వయముగాను, మరికొందరికి స్వప్నములోను బాబా ఉపదేశము లిచ్చుచుండెడివారు. ఒకసారి రాధాకృష్ణమాయి జ్వరముతో బాధపడగా బాబా ఒక పెద్ద నిచ్చెనను తెప్పించి ఆమె యింటిపైకి ఎక్కెను. నిచ్చెన తెచ్చిన వానికి రెండు రూపాయలు బాబా యిచ్చెను. యివన్ని విచిత్రమైన లీలలుగా కనిపించినా, ఫలితంగా రాధాకృష్ణమాయి జ్వరం తగ్గిపోయెను.

గోధుమలు విసరుట

1910 సంవత్సరం హేమాద్రిపంత్ షిరిడికి వచ్చిన తొలిరోజులు. ఒకనాటి ఉదయము బాబా ముఖము కడుగుకొనిన వెంటనే ద్వారకామాయిలో ఒకచోట కూర్చుని గోధుమలను విసరుచుండిరి. వారు భిక్షాటనచే జీవించువారు కాబట్టి వారెప్పుడు విసరుట అనునదిచేసి యుండలేదు. అందువలన చుట్టు ప్రక్కలవారందరు ఆ దృశ్యమును వింతగా చూచుచుండిరి. వారిలోని నలుగురు స్త్రీలు సాహసించి మసీదులోనికి వెళ్ళి బాబాను ప్రక్కన కూర్చుండమని తిరుగలినివారు తీసుకుని విసరుట మొదలుపెట్టిరి. బాబాకు కోపము వచ్చినా వారి ప్రేమకు లొంగి వూరుకుండెను. విసురుట పూర్తి అయిన తరువాత ఆ స్త్రీలు పిండిని నాలుగు భాగములుగా చేసి నలుగురు తీసుకొనుచుండిరి. అంతవరకు శాంతముగా చూచుచున్న బాబా కోపముతో వారిని తిట్టెను. ఓ వనితలారా! మీకు పిచ్చెక్కినట్లున్నది. ఈ

పిండి మీసొమ్మని మీరు తీసుకొనుచున్నారా! మీ వద్దనుండి నేను గోధుమలను తీసుకొనలేదుకదా! ఎందువలన మీరు ఈ పిండిని తీసుకొనుచున్నారు? ఈ విధముగా కేకలు వేసినా మరుక్షణంలో శాంతించి, సరే పిండిని తీసుకుపోయి గ్రామపు సరిహద్దులలో చల్లుడని చెప్పెను. ఆ స్త్రీలు సిగ్గుపడి, తలలు దించుకొనిరి, బాబా పాదములకు నమస్కరించి వేగముగా వెళ్ళి వూరి పొలిమేరలో విసరిన పిండిని చల్లిరి.

గ్రామములో కలరావ్యాధి కలదని దానిని శాంతి పరచుటకు బాబా ఈ చర్య చేసిరని గ్రామస్థులు హేమాడ్ పంతునకు చెప్పిరి. గోధుమ పిండికి కలరా వ్యాధికిగల సంబంధమేమో అతనికి అర్థంకాలేదు. కాని క్రమముగా కలరావ్యాధి గ్రామములో తగ్గుటచే ఆనాడు బాబా విసిరినవి గోధుమలు కావని, కలరావ్యాధినే పిండిచేసి పొలిమేరను దాటించినారని గ్రహించెను. ఈ వింతచర్య చూసి ఆకర్షితుడైన హేమాద్రిపంతు యిలాంటి విచిత్రములతో కూడిన సాయిబాబా లీలలను జీవితచరిత్ర రూపంలో వ్రాయాలని సంకల్పించి బాబా అనుమతిని కోరగా కొంతకాలమాగమని బాబా ఆదేశించెను. ఆఖరికి 1917లో శ్యామాద్వారా ప్రయత్నించగా బాబా ఆశీర్వదించి విభూది ప్రసాదమును అతని చేతిలో పెట్టి ఆశీర్వదించెను. బాబా శరీరంలో వుండగా వారి ఆశీస్సులతో ప్రారంభించి మరాఠీ భాషలో హేమాద్రిపంతు రాసిని జీవితచరిత్రనే సాయిసచ్చరిత్రగా నేడు దేశవిదేశాలలోగల సాయి భక్తులంతా నిత్యపారాయణ చేయుచున్నారు. దీనిని తెలుగులోకి ప్రత్తి నారాయణరావుగారు అనువదించిరి.

సాయి కధలు దీపస్థంభములు

సముద్రపు మధ్యయందు పూర్వము దీపస్థంభములుండెడివి. పడవలపై ప్రయాణము చేయువారు ఆ వెలుతురు ఆధారంగా రాళ్ళు రప్పలకు పడవకొట్టుకొనకుండా తప్పించుకొనుటకు వీలుగా వుండెడిది. రకరకాల మనుష్యులు, స్వభావాలు, ఆలోచనలతో నిండిన ఈ ప్రపంచము కూడ లోతైన భయంకరమైన సముద్రంలాంటిది. బాబా లీలలతో కూడి మనం పారాయణ చేయుచున్న ఈ కధలు కూడ దీపములవలె ఏ విధముగా ఈ ప్రపంచములో మనం మెలగవలెనో దారిచూపుతాయి. ఈ కధలు అమృతమువలె తియ్యగాను, పవిత్రంగాను వుండుటచే అవి మన హృదయములో

ప్రవేశించి అహంకారమును నశింపచేయును. అహంకారము తొలగినచో జ్ఞానం కలుగును. జానమువలన పాపములు తొలగి మోక్షము సిద్ధించును.

బాబా యొక్క కారుణ్యము

1910లో దీపావళినాడు బాబా ధునికి ఎదురుగా కూర్చునియుండెను. అప్పుడప్పుడు ధనిలో కట్టెలు వేయుచుండెను. వున్నట్టుండి ఒక్కసారిగా చేతిని కట్టెవలె ధునిలోని మంటలలో పెట్టెను. చేయి కాలిపోయెను. శ్యామా మొదలైన వారు చూసి పరుగెత్తుకు వచ్చి బాబాను పట్టి వెనుకకు లాగిరి. అప్పటికి బాబాకు స్పృహలేదు. ఎక్కడో వున్నట్లుగా వుండిరి. కొంతసేపటికి మామూలు స్థితికి వచ్చి యిట్లు చెప్పిరి. దూరదేశమున వున్న కమ్మరి భార్య నా భక్తురాలు. ఆమె కొలిమిని ఊదుచుండెను. ఆమె భర్త పిలువగా ఒడిలో సున్న బిడ్డను మరచి లేచి పరుగెత్తబోయెను. ఆ బిడ్డ మండుచున్న కొలిమిలోని మంటలలో పడెను. ఈ నాచేతిని కొలిమిలోకి దూర్చి ఆ బిడ్డను రక్షించితిని. నా చేయి కాలినందుకు నాకు బాధలేదు, నా భక్తురాలి బిడ్డడు రక్షించబడినందుకు నాకు ఆనందముగా నున్నది. వందమైళ్ళ దూరములో గల కొలిమిలో బిడ్డ పడితే షిరిడిలోని ధునిలో చేతిని పెట్టి ఎట్లు రక్షించగలిగెను. యిది మన వూహకు అందని విషయం. అందుకే సాయి చేసే ఈ చర్యలను లీలలుగా మనం పిలుస్తున్నాం. అవి సామాన్య మానవ మేధస్సుకు అందునవి కావు. ఏ పనినైనా, ఎలాగైనా సరే పూర్తి చేయగల సమర్థుడు సాయి బాబా. అలాంటి సమర్థ సద్గురుని జీవిత చరిత్ర వ్రాసే భాగ్యం కలిగించినందుకు సాయికి సాష్టాంగ ప్రణామాలు సమర్పించుకుంటున్నాము. ఈ లీలా మానుష గాథలను పారాయణ చేయు మీరు కూడ ధన్యులే. ఎవరి పాపములు తొలగిపోయినవో వారు మాత్రమే బాబా కథలయందాశక్తి చూపగలరు. యిది యదార్థము.

భాగోజీషిండే-బాబా సేవ

బాబా చేయి కాలిన విషయం తెలిసిన నానాచందోర్కరు బొంబాయి నుంచి సూది వైద్యం తెలిసిన పెద్ద డాక్టరును బాబా వద్దకు తీసుకుని వచ్చెను. కాని బాబా అతనిచే వైద్యం చేయించుకొనుటకు ఒప్పుకొనలేదు. భగవంతుడే తన వైద్యుడని చెప్పెను. ప్రతిరోజు ఆ చేతికి భాగోజీషిండే నెయ్యి రాసి ఆకులు వేసి కట్టుకట్టెడి వాడు. బాబాకు అంత సన్నిహితుడై సేవ చేసిన భాగోజీ పైకి కుష్టు రోగివలె కనిపించినా గొప్ప అదృష్టవంతుడు. 1910 నుంచి 1918లో బాబా సమాధి అయ్యే

వరకు షుమారుగా ఎనిమిది సంవత్సరాలు బాబాకు ప్రతిరోజు కట్టువిప్పి మళ్ళీ కట్టి సేవచేసెను. ఈతని జన్మ ధన్యమైనది.

దాము అన్నా

ఈతనికి దామోదర్ సావల్‌రాం రసనే అని మరియొక పేరు కలదు. ఈతనికిగల బొంబాయి స్నేహితుడొకడు ప్రత్తిజాయంటు వ్యాపారము చేయుదమని ఎక్కువ లాభములు వచ్చుచున్నవని అవకాశము వదులు కోవలదని వ్రాసెను. ఈతడు బాబాభక్తుడు గనుక షిరిడిలో బాబాను ఈ విషయమై ప్రశ్నించి వారి సలహాను అడుగవలసినదిగా శ్యామాకు వుత్తరము వ్రాసెను. దానిని తీసుకుని ద్వారకామాయికి చేరగానే బాబా ఏమి ఎత్తులు వేయుచున్నాడు. భగవంతుడిచ్చిన దానితో సంతృప్తి చెందక లక్షలు సంపాదించుటకు ప్రయత్నించుచున్నాడు. సేటునకు పిచ్చి ఎక్కినది. తనకుగల సగము రొట్టెతో తృప్తిగా బ్రతుకుమని చెప్పెను. అదే విషయము శ్యామా తిరిగి వ్రాసెను. రెండవసారి స్వయముగా బాబాతో తానే మాట్లాడుటకు షిరిడి వచ్చి బాబా అనుగ్రహించినచో లాభములలో సాయికి భాగము కూడ యిచ్చెదమని మనసులో సంకల్పించెను. అతని మనోభావమును గమనించిన బాబా-ప్రాపంచిక విషయములలో తగుల్కొనుటకు నాకు యిష్టములేదని చెప్పెను. అతడు ఆ పనిని మానుకొనెను. కొద్ది రోజులకే ప్రత్తి వ్యాపారులంతా నష్టపోయిరి. యింకొకసారి ధాన్యము బేరము చేయవలెనని ప్రయత్నించగా నీవు 7 సేర్ల చొప్పున కొని 9 సేర్ల చొప్పున అమ్మవలసివచ్చునని చెప్పెను. బాబా చెప్పిన ప్రకారము కొద్ది రోజులలోనే ధాన్యముల ధరలు పడిపోయెను. నిల్వచేసిన వారంతా నష్టపోయిరి. రెండుసార్లు బాబా ఈతనిని నష్టముల నుంచి రక్షించుటచే భక్తిభావము పెరిగి బాబా సమాధి చెందువరకు సేవచేసెను. దాము అన్నాకు యిద్దరు భార్యలను వివాహము చేసుకున్నా సంతానము కలగలేదు. ఎందరో జ్యోతిష్కులు అతనికి సంతానయోగములేదని చెప్పిరి.

1915లో ఎవరో బాబాకు పెద్దమామిడి పళ్ళగంపను పంపిరి. అందులో నుంచి నాలుగు పళ్ళను తీసి బాబా ప్రక్కన వుంచి మిగిలిన వాటిని అందరికీ పంచిపెట్టెను. కాని అందరి దృష్టి ఆ నాలుగు పళ్ళమీదనే వుండెను. వారి ఆలోచనలను గమనించిన బాబా ఈ నాలుగు దాము అన్నావి. యివి ఎవరూ తీసుకొనరాదు. వాటిని అతడే తిని చావవలెను అనెను. బాబా ఈ మాటలు పలికిన కొంతసేపటికి దాము అన్నా షిరిడికి వచ్చెను. అతనికి ఆ పళ్ళను యిచ్చి వీటిని నీ చిన్న భార్యకు యిమ్ము, నీవు తినవద్దు. వాటిని తినుటవలన ఆమెకు నలుగురు పుత్రులు, నలుగురు

పుత్రికలు జన్మింతురని చెప్పిరి. కొన్నాళ్ళకు బాబా మాటలు నిజమయ్యెను. జ్యోతిష్కుల మాటలు వ్యర్థమయ్యెను.

వాటిని దాము అన్నా తిని చావవలెను అను బాబా మాటలలోని అంతర్యము. పుత్రులు లేరని బాధపడు దామ్యా ఎనిమిది మంది సంతానముకని వారిని పోషించలేక సతమతమౌనను భావము. ఒకసారి ఈ దామ్యా బాబా పాదముల చెంత కూర్చుని వుండగా అతని మనసున రెండు సందేహములు కలిగెను. 1. బాబా వద్దకు ఎందరో భక్తులు వస్తున్నారు. వారందరూ బాబా వలన మేలు పొందగలరా. 2. నేను యిప్పుడు ఏ సలహా సహాయము కావలసినా బాబాను అడిగివారు చెప్పిన విధముగా ప్రవర్తించి ఎంతో మేలు పొందుతున్నాను. కాని వారు ఈ శరీరమును వదిలిన తరువాత నా గతియేమి? తెగిన గాలిపటమువలె గాలి వాటమునకు కొట్టుకొని పోవలసినదేనా? అతని మనసులోని భావములను గుర్తించిన సాయి వెంటనే సమాధానముల నిచ్చెను. 1. ఆ మామిడి చెట్టువైపు చూడుము ఎంత పూత వున్నదో, అది అంతయు కాయలుగా మారిన ఎంత బాగుండును. పూతగానే కొంత రాలిపోవును. పిందలుగా కొన్ని రాలిపోవును. పక్షులుకొట్టుటవలన, పిల్లలు రాళ్ళతో కొట్టుట వలన మరికొన్ని రాలిపోవును. ఆఖరికి ఏ కొద్దో కాయలగును. ఈ భక్తుల విషయము అంతే 2. ఈ నాభౌతిక శరీరము తరువాత కూడ నేను అప్రమత్తుడనై వుండెదను. నా భక్తుల రక్షణ నా సమాధి నుండి వెలువడును, సమాధినుండే నేను సర్వకార్యములను నిర్వహింతును. నా ఎముకలు మీయోగ క్షేమములను కనుగొనుచుండును. ఆనాడు దాము అన్నాకు యిచ్చిన ఆ అభయ సూత్రాలనన్నిటినీ ఈనాడు భక్తితో ఈ గ్రంధమును పారాయణ చేయు మా పాఠకులకు కూడ అందించమని సాయి పాదములంటి ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓంశాంతి శాంతి శాంతిః

యిరువది రెండవ అధ్యాయం సంపూర్ణం.

యిరువది మూడవ అధ్యాయము

బాబా క్షుద్ర విద్యలను ప్రోత్సహించేవాడు కాదు. అలాంటి శక్తులు వున్నవారు వాటిని వదలనిదే తన వద్దకు రానిచ్చేవారు కాదు.

కుశాభావ్

యితడు మంత్ర తంత్ర విద్యలు తెలిసినవాడు. తలచినంతనే కోవా బిళ్ళలు, యితర తీపి పదార్థములు అతని చేతిలోనికి వచ్చేవి. బాబా మహిమలు విని అతడు షిరిడికి వచ్చి ద్వారకామాయిలో ప్రవేశించగా అతనిని వారించి బాబా ఆ క్షుద్రశక్తులను వదలినగాని తన వద్దకు రావద్దని హెచ్చరించెను. కొంతకాలం సందిగ్ధములోపడి ఆఖరికి చేతికిగల కంకణమును తీసివేసి తన విద్యలను వదిలి చాలాకాలంపాటు బాబాను భక్తిశ్రద్ధలతో సేవించెను.

ఒక ఏకాదశినాడు ఎవరో బాబాకు వుల్లిపాయలతో చేసిన వంటకమును తీసుకువచ్చిరి. బాబాకు మత నియమమలు, మూఢాచారములపై ఏ మాత్రం నమ్మకములేదు. అందువలన కుశాభావ్‌తో దానిని తినమని చెప్పెను. ఆరోజు ఏకాదశి కాబట్టి వుల్లిపాయను తాను తిననని చెప్పిననూ బాబా మరల హెచ్చరించి తినుమనెను. బాబా తినినచో తానుకూడ తినెదనని చెప్పగా మొదట బాబా తరువాత కుశాభావు యిద్దరూ వుల్లిపాయలను తినిరి. కొంతసేపటికి మసీదులోనికి యితర భక్తులు రాగా వారితో - ఈ కుశాభావ్ ఆచారవంతుడైన సద్బ్రాహ్మణుడే అయినా, ఈ రోజు ఏకాదశి అనికూడ చూడకుండా వుల్లిపాయలు తినినాడని హేళనచేసెను. అందుకు కుశాభావ్ బాబా తినుటచే తాను కూడ వారితోపాటు తింటినని చెప్పెను. అందుకు బాబా నేను వుల్లిపాయ తినలేదు. కందమూలములు తింటినని తిన్నది వాంతి చేసుకోగా వుల్లికి బదులుగా చిలగడ దుంపలు బయటకు వచ్చెను. ఆశ్చర్యము నొందిన కుశాభావ్ వాటిని ఏరుకొని తినెను. బాబా కోపోద్దీపితుడై ఏమి యింత అసహ్యమైన పని చేయుచున్నావని అరచెను. మరుక్షణములోనే కోపము కరుణగా మారి -నిన్ను నేను ఆశీర్వదిస్తున్నాను. నీవు ఎప్పుడు ఎక్కడ వుండి నన్ను తలచి కోరినా ఈ ద్వారకామాయిలోని విభూది నీ చేతిలోనికి వస్తుంది. అవసరమైన వారికి దానిని యిచ్చిన వారి బాధలు తీరి కోరికలు నెరవేరును అని చెప్పెను. ఆనాటి నుంచి అతడు మరణించు వరకు కేవలం బాబావాక్కు ప్రభావం వలననే ఎప్పుడు కావాలంటే అప్పుడు అతడు కోరగానే దోసిట నిండా విభూది వచ్చెడిదట, దీని కొరకు అతడు ఏ మంత్ర తంత్రములు, ఆచారములు పాటించలేదు. ఈ కథవలన మనం తెలుసుకోవలసిన నీతి-బాబాకు క్షుద్ర విద్యలయందు ఆశక్తి లేదు. తనను నమ్మినవారిని వాటినుంచి దూరం చేసి సంస్కరించి ఆ శక్తులకు బదులుగా దివ్యశక్తులను

ప్రసాదించెడివారు. అందువలన సాయికి నిజభక్తులైనవారు ఏ క్షుద్ర శక్తులను గురించి, గాలి, భూతంలాంటి నీచ దుష్టశక్తులను గురించి బాధపడవలసిన అవసరంలేదు. యివి సాయి భక్తుల నీడిలోకి కూడ రాలేవు.

హేమాడ్‌పంత్-శనగలకథ

ప్రతి ఆదివారము షిరిడిలో సంత జరిగెడిది. ఆరోజు చుట్టు ప్రక్కల గల గ్రామ ప్రజలు సంతకువచ్చి బాబాను కూడ దర్శించెడివారు. అందువలన ఆదివారమురోజు మధ్యాన్నం 12 గంటలకు ఆరతి సమయంలో మసీదు జనంతో క్రిక్కిరిసిపోయి వుడెడిది. ఒక ఆదివారం హేమాద్రిపంతు బాబా పాదము లొత్తుచుండెను. శ్యామా నవ్వుతూ అతనితో "నీ కోటునకు శనగ గింజలంటినట్లున్నవి చూడుమనగా అతడు పొడుగాటి చొక్కా చేతులను తట్టగా చాలా శనగలు క్రిందకు రాలెను. అక్కడున్న వారందరు వాటిని ఏరుకొనిరి. తన చొక్కాలోనికి శనగలెట్లు వచ్చెనో హేమాద్రిపంతునకు కూడ తెలియదు. మడత కూడ పెట్టని బారుచేతుల చొక్కాలో అన్ని శనగగింజలు ఎట్లు నిలచెనో అందరికీ ఆశ్చర్యము వేసెను. అప్పుడు బాబా ఈవిధముగా చెప్పెను. "ఈతనికి తానొక్కడే తిను దుర్గుణమొకటి కలదు. ఈనాడు సంతరోజు. శనగలు కొని తినుచు యిక్కడకు వచ్చినాడు. యితరులకుపెట్టక తానొక్కడే తినుట ఈతని స్వభావము. ఈ శనగలే అందుకు గుర్తు ఇందులో ఆశ్చర్యమేమున్నది".

బాబా నేనెప్పుడూ వంటరిగా తిని ఎరుగను. నా మీద ఈ చెడ్డ గుణమును ఎందుకు ఆరోపించుచున్నావు. యింత వరకు నేను షిరిడిలోని సంతను చూడనేలేదు ఏనాడు శనగలు కొనలేదు. ఈరోజున కూడ కొనలేదు, తినలేదు. నావద్దనున్న వారికి పెట్టకుండా నేను ఎప్పుడు ఏమీ తిని ఎరుగనని హేమాడ్‌పంతు చెప్పెను. వెంటనే బాబా-నీ దగ్గర నున్న వారికి పెట్టెదవు. ఎవరూ దగ్గర లేనప్పుడు ఏమి చేయుచున్నావు. నీవు ఏదైనా తినుటకు ముందు నన్ను తలచుచుంటివా? నేనెప్పుడూ నీ దగ్గరేవుంటాను కదా! మరి నీవు తినుటకు ముందుగా నా కర్పించుచున్నావా? బాబా యొక్క ఈ ప్రశ్నకు హేమాద్రిపంతు యొక్క గొంతు మూగబోయినది. నిజమే అతడు తినుటకు ముందుగా దేనిని బాబాకు సమర్పించుటలేదు. ఈ విషయమై తాను యింతవరకు ఆలోచించనే లేదు. తన జీవిత సర్వస్వం సాయి

బాబాగానే భావించునప్పుడు ప్రత్యేకించి ఈ అర్పణ అవసరమా! అతని మదిలో ఈ ఆలోచన మెదలగానే బాబా తిరిగి అతనితో యిట్లనెను.

"పంచేంద్రియముల కంటే ముందుగనే మనసు, బుద్ధి విషయములపై వాలి వాటి వాసనలను అనుభవించును. విషయ వాసనలను వదిలి పంచేంద్రియములు వుండలేవు. అందువలన విషయములకు యింద్రియములకు మధ్య భగవంతుని ఒక అడ్డుగా పెట్టినచో మనస్సు యొక్క పరుగు వేగముతగ్గును. ఏదైనను ముందు భగవంతునికి సమర్పించినచో దాని యందు వ్యామోహము తగ్గును. యిట్టి భౌతిక విషయములలోనే కాక కామ, క్రోధ, లోభమోహాదులను కూడ గురువున కర్పించిన క్రమముగా చిత్తవృత్తులన్నీ నశించును. దీనివలన విషయ విచక్షణా జ్ఞానము కలిగి చక్కని గుణశీలములు వృద్ధియగును. సద్గుణములవలన దేముని యందు నిశ్చల ప్రేమ పెరుగును. దైవానుగ్రహం వలను నేను దేహినికాను అను సత్యం దర్శనమౌను. అప్పుడు మాత్రమే బుద్ధి శుద్ధచైతన్యములో లీనమగును. యిదే ఏకాత్మ భావన. మొదట నేను వేరు విషయ వస్తువువేరు అనుభావన వుండును. అందువల్లనే వేరుగా కనిపించే విషయవస్తువు కొరకు మనసు పరుగులు పెడుతుంది. నేను, బయటగల విషయవస్తువు ఒక్కటే అనే ఏకాత్మభావన కలిగినప్పుడు. తనకు వేరైనది బయట లేదు అని తెలుసుకోగలిగినప్పుడు, తన రూపమే బయట అనేక విధములుగా వున్నదనే సత్యాన్ని గ్రహించగలిగినప్పుడు మనస్సు దేనికొరకు, ఎటూ పరుగులు తీయవలసిన అవసరం వుండదు. ఉన్నతమైన ఈ స్థితి మనిషి చేరుటకు మొదట సర్వం భగవాదార్పణమనే తొలి సాధనా కార్యక్రమంతో ప్రారంభించాలి. మీ ఆలోచనలకు, ఆశయాలకు, జీవిత గమనానికి నన్నే లక్ష్యంగా చేసుకున్న మీరు పంచేంద్రియముల ద్వారా పొందే ప్రతి అనుభవాన్ని నాకుసమర్పించాలి. లేనిచో మీరు యింద్రియములను జయించలేక కోరికలకు బానిసలై తప్పు దారినపడు ప్రమాదం వచ్చును".

బాబాయొక్క ఈ చక్కని ఉపదేశం కేవలం హేమాద్రిపంతునకే కాదు. ఈనాడు మన అందరికీ వర్తించును. ఈ నాటికే కాదు. ఈ భుమిపై మానవజీవితం వున్నంత వరకుప్రతిమనిషికీ అవసరమైన జ్ఞానబోధలు యివి. మణిదీపంలాంటి బాబా జీవితచరిత్రలో యిమిడిపోయిన ఈ అణిముత్యాల లాంటి చిన్న కధలతో కూడిన ఈ సంపూర్ణ షిరిడి సాయిబాబా జీవితచరిత్ర ప్రతి యింటిలోను పారాయణ గ్రంధమై

వర్ధిల్లుగాక? భారత, రామయణాది గ్రంధాలవలె సాయి జీవితచరిత్ర కులాంతర, మతాంతర విబేధాలకందని భారతదేశ జాతీయ జనజీవన గ్రంధంగా తయారౌగాక!

మావిషీబాయి

దామోదర్ ఘనశ్యామ్ బాబరే యనువానికి అణ్ణాచించణీకర్ అను యింకొక పేరు గలదు. ఈతడు బాబాకు భక్తుడు. మోటువాడు, మొండివాడు. వున్నదున్నట్లుగా చెప్పును. ఎవరినీ లక్ష్యపెట్టడు. మంచి హృదయముగలవాడు. ఒకనాటి మధ్యాన్నము బాబాకు ఎడమవైపుగా కూర్చుని వారి ఎడమ చేతిని తోముచుండెను. కుడివైపున ముసలి వితంతువు కౌజల్గి యనునామె బాబా నడుమును వీపును తోముచుండెను. ఆమె కూడ స్వచ్ఛమైన హృదయము కలిది. అందరూ ఆమెను మావిషీబాయి అని పిలిచెడివారు. బాబా వీపును తోమునపుడు ఆమె ముఖము ముందుకు వెనుకకు కదులుచు అణ్ణా ముఖమునకు బాగా దగ్గరగా వచ్చుచుండెను. భక్తి పారవశ్యంలో ఆమె కదులుతున్నాననే భావన లేక అణ్ణా తన దగ్గరగా వస్తున్నాడని, తనను ముద్దు పెట్టుకోవాలనే చెడు అభిప్రాయంతో అలా చేస్తున్నాడని ఆరోపించెను. ఆ మాటలు వినిన అణ్ణా కోపముతో లేచి ఆమెతో కలహమునకు కాలు దువ్వుచుండెను. ముసలివాళ్ళిద్దరి తగాదా చూచువారలకు హాస్యముగా అయ్యెను. అప్పుడు బాబా వారితో ఎందుకు అనవసరముగా ఈ రాద్ధాంతము. తల్లిని తనయుడు ముద్దుపెట్టుకొనినచో తప్పేమున్నదని యిరువురిని శాంతింపజేసెను.

వేరొక సందర్భములో ఈ మావిషిబాయే బాబా యొక్క పొత్తి కడుపును తోముచూ ఎక్కువగా బలము ఉపయోగించుచుండెను. అది చూసిన యితర భక్తులు బాబాకు హాని జరుగునేమోనని కంగారుపడి కొంచెము మెల్లగా తోముమని లేనిచో బాబా కడుపులోని ప్రేవులు తెగిపోవు ప్రమాదము కలదని హెచ్చరించిరి. వారి మాటలను వినిన బాబాకు కోపము వచ్చెను. కళ్ళు నిప్పుకణికవలె ఎర్రనైయ్యెను. చేతిలోగల సటకాను తీసుకుని ఒక చివర ద్వారకామాయిలో గల స్థంభమునకు అన్చి రెండవ చివర తన కడుపుపై వుంచుకొని స్థంభము వైపుగా బలము ఉపయోగించి పొట్టతో తోయుచుండిరి. సటకా బాబా పొట్టలోనికి దిగిపోవుచున్నట్లుగానుండెను. అందరు భయపడిరి. బాబాను మాట్లాడించుటకు గాని, తాకుటకుగాని ఎవరికీ ధైర్యము చాలకుండెను. కొంతసేపటికి శాంతించి మామూలు స్థితికి వచ్చెను. ఈ కథవలన

మనం గ్రహించవలసిన విషయం. ఎవరి భక్తి ఏమిటో బాబాకు పూర్తిగా తెలియను. ఎవరి యిష్టానుసారము వారు బాబాకు సేవ చేయుదురు. ఒకరు చేయు పనిలో అనవసరముగా యింకొకరు కల్పించుకొనరాదు.

హరిశ్చంద్ర పితళే కుమారుడు

యితడు బొంబాయి నివాసి. యితనికి మూర్ఛరోగముతో బాధపడుచున్న ఒక కుమారుడు కలడు. ఇంగ్లీషు, ఆయుర్వేదం, యునాని మొదలైన అన్ని రకముల మందులు వాడినని ప్రయోజనము కుదరలేదు. 1910లో దాసుగణు హరికథ విని కుమారుని తీసుకుని షిరిడికి వచ్చెను. మసీదులో కూర్చున్న బాబా పాదములకు సాష్టాంగ నమస్కారము చేసెను. రోగియైన కొడుకును బాబా పాదములపై వేసెను. బాబా ఆ రోగివైపు తన దృష్టిని సారించి కొంతసేపు చూచెను. పిల్లవాడు కళ్ళు గిర్రున తిప్పి స్పృహకోల్పోయి నేలపైబడెను. అతని నోట చొంగకారి, శరీరము చెమట పట్టి చల్లబడెను. చచ్చిపోయినట్లుగా అయ్యెను. పిల్లవాని స్థితిని చూచిన తల్లిదండ్రులు ఖంగారుపడిరి. తల్లి కంటి నీరు వదలుగా పారెను. ఆమెతో బాబా నీవిట్లు ఏడ్వవలసిన పనిలేదు. వీనిని తీసుకుని బసకు పొమ్ము. అరగంటలో చైతన్యము వచ్చును. వాడాకు తీసుకుని పోయిన తరువాత బాబా చెప్పినట్లుగనే పిల్లవానికి స్పృహ వచ్చెను. ఆ రోజు నుంచి అతనికి మరల మూర్ఛలు రాలేదు. పితళే తిరిగి వెళ్ళునపుడు బాబా- "బాపూ యింతకు ముందు నీకు 2 రూపాయలు యిచ్చితిని, యిప్పుడు మూడు రూపాయలు యిచ్చుచున్నాను. వీటిని నీ పూజా మందిరంలో పెట్టుకుని పూజింపుము అనెను". అతడు అదే మొదటిసారిగా షిరిడికి వచ్చుటచే బాబా యింతవరకు ముందు 2 రూపాయలెట్లు తనకిచ్చెనో అర్థంకాలేదు. యింటికి తిరిగి వెళ్ళిన తరువాత అతడు ముదుసలి అయిన తన తల్లికి ఈ విషయము చెప్పగా ఆమె యిట్లు జవాబిచ్చెను. నీ విప్పుడు నీ కుమారుని తీసుకుని షిరిడికి వెళ్ళినట్లే నిన్ను తీసుకుని నీ తండ్రి అక్కల్‌కోట మహరాజుగారి వద్దకు పోయెను. వారు మీ తండ్రికి 2 రూపాయలిచ్చి పూజలో పెట్టుకుని పూజించమని చెప్పిరి. మీ తండ్రిగారు మరణించు వరకు వాటిని పూజించుచుండిరి. ఆ తరువాత పూజ ఆగిపోయెను. ఈ కథను బట్టి సాయిబాబాయే అక్కల్ కోట మహారాజ్ అని మరియొకసారి నిరూపణ అయినది.

అంబాడేకర్

పూనా నివాసి గోపాల నారాయణ అంబాడేకర్ వుద్యోగము లేక 7 సంవత్సరములు బాధపడెను. చాలా సార్లు షిరిడికి వచ్చి బాబాను ప్రార్థించెను. క్రమముగా అతని పని క్షీణించెను. భార్యతో షిరిడికి వచ్చి రెండు నెలలుండెను. ఆర్థిక బాధలు భరించలేక ఒకనాటి రాత్రి దీక్షిత్ వాడా ముందు కూర్చునివుండెను. ఎదురుగా వున్న నూతిలోపడి మరణించవలెనని నిశ్చయించుకొనెను. యింతలో ఎదురుగావున్న హోటల్ యజమాని సగుణమేరు నాయక్ అతనిని పిలిచి అక్కల్‌కోట మహారాజా జీవితచరిత్రను చదువుమని యిచ్చెను. యిష్టములేకున్నా దానిని తీసుకుని తనకు తోచిన ఏదో పేజీ తెరచెను. అందులో ఈ వివరములున్నవి. అక్కల్‌కోట స్వామి జీవించియున్న కాలంలో దీర్ఘరోగియొకడు బాధను భరించలేక నిరాశతో ఆత్మహత్య చేసుకోవలెనని బావిలోకి దూకగా ఆ స్వామి బావిలో పడిన అతనిని పట్టుకుని పైకి తీసుకుని వచ్చి యిట్లనెను. గత జన్మ పాపపుణ్యములు నీవు అనుభవించక తప్పదు. నీ అనుభవము పూర్తికాకుండా ఆత్మహత్యను చేసుకొనినా మరుజన్మలో మరల ఈ బాధలు అనుభవించక తప్పదు. చనిపోవుటకు ముందు కొంతకాలము ఈ బాధలు అనుభవించి గతజన్మ పాపములను తుడిచివేయుము". అనాలోచితంగా తాను ఏదో ఒక పేజీ తెరిచినా తనకు సరిపోవు కథ వచ్చినందుకు దీనిని బాబా ఆదేశముగా భావించి ఆత్మహత్యా ప్రయత్నము నుండి విరమించుకొనెను.

గోవా పెద్దమనుషులు

గోవా నుండి యిద్దరు పెద్ద మనుషులు షిరిడికి వచ్చిరి. వారిలో ఒకరిని బాబా 15 రూపాయలు దక్షిణ అడిగెను. యింకొకరు 35 రూపాయల నిచ్చెను. అతని దక్షిణ సాయి స్వీకరించలేదు. యింతలో శ్యామా కల్పించుకుని యిద్దరూ కలిసి వచ్చినా ఒకరి దక్షిణ స్వీకరించి యింకొకరిది నిరాకరించితివి. ఈ భేద భావమెందుకని ప్రశ్నించెను. నేను ఎవరి వద్ద నుంచి ఏమీ కోరను, మసీదు మాత బాకీని కోరును. ఆమె ఎవరి నుంచి దక్షిణను కోరునో వారినే అడుగుదును. బాకీ యున్నవాడు చెల్లించి విమోచన పొందును. నేను యిల్లు ఆస్తి కుటుంబము లేనివాడను. నేను ధనమును కూడ బెట్టరాదు. భక్తులు మొక్కుల ద్వారా పడిన

బాకీని తీర్చుటకే వారి వద్ద నుండి దక్షిణ తీసుకొందునని బాబా సమాధానం చెప్పెను. యింకనూ వారిట్లు చెప్పిరి. ఋణము, శత్రుత్వము, హత్యా దోషము అనుభవించే తీరవలెను. తప్పించుకునే మార్గమే లేదు. నేను దక్షిణ అడిగి పుచ్చుకున్నవాడు మొదట చాలా పేదవాడు. ఉద్యోగము దొరికినచో మొదటినెల జీతము తన యిష్టదైవమునకు యిచ్చెదనని మొక్కకొనెను. నెలకు 15 రూపాయల ఉద్యోగము దొరికి అది క్రమముగా పెరుగుతూ 700లకు చేరుకొనెను. అయినను అతడు మొక్కు తీర్చలేదు. అతని కర్మఫలమే యిక్కడకు ఈడ్చుకు వచ్చెను. అతని మొక్కుబాకీనే యిప్పుడు నేనడిగి తీసుకుంటినని చెప్పెను.

ఆ తరువాత తనదైన వింత పద్ధతిలో వేరొక కథను ఈ విధముగా చెప్పెను. ఒకనాడు నేను గాఢ నిద్రలో వుండగా ఒక మనిషి రాతి పలకను తొలగించి గోడకు కన్నమువేసి 30,000 రూపాయలు దొంగిలించెను. నేను చాలా బాధపడితిని. ఆ బ్రాహ్మణుడే దానిని దొంగిలించెనని అనుకొంటిని. నా మనసు పాడైనది. భోజనము, నీరు కూడ రుచించలేదు. ఒక ఫకీరు నా పరిస్థితి చూచి ఈ విధముగా చెప్పెను. నేను ఒక ఫకీరు చిరునామాను యిచ్చెదను. వారిని కలిసినచో వారి సహాయమువలన పోయిన నీ ద్రవ్యము తిరిగి వచ్చును. అప్పటివరకు నీకు యిష్టమైన ఒక వంటకము తినుట మానివేయమని చెప్పెను. ఆ ఫకీరు చెప్పినట్లుగా నేను ప్రవర్తించి మొక్కుకొనగా నా ధనము తిరిగివచ్చెను.

నేను స్టీమరు నెక్కుటకు వెళ్ళగా జనులు ఎక్కువగా వుండుటచే ఖాళీలేదని చెప్పిరి ఒక నౌకరు సహాయముతో స్టీమరు లోపలికి వెళ్ళి కూర్చుని యివతలి తీరమునకు వచ్చితిని అక్కడ నుంచి రైలెక్కి ఈ మీ సీమకు వచ్చితిని. ఈ కథ ముగిసిన తరువాత బాబా శ్యామాను పిలిచి అతిథులను భోజనమునకు తీసుకువెళ్ళమని చెప్పెను. భోజనము చేయునప్పుడు అతిథులిద్దరూ కన్నీరు కార్చిరి. శ్యామా అందుకు కారణమడుగగా వారు బాబా చెప్పిన కథలు రెండు తమవేనని చెప్పెను. మొదటివాడు నాకు ఉద్యోగమువచ్చిన దత్తదేవునికి మొదటినెల జీతము నిచ్చెదని మొక్కుకుంటిని. వెంటనే 15 రూపాయల వుద్యోగము వచ్చెను. క్రమముగా పెరిగి 700 అయ్యెను. నా మొక్కును మరచుటచే బాబా నాకు గుర్తుచేసి నా నుండి దక్షిణ తీసుకుని నన్ను ఋణవిముక్తుని చేసెనని చెప్పెను.

రెండవవాడు తన కథనిట్లు చెప్పెను. నా వంట బ్రాహ్మణుడు నావద్ద 25 సంవత్సరములు నమ్మకముగా పనిచేసెను. కాని ఒకనాడు మా యింటికి కన్నమువేసి 30,000 రూపాయలు కరెన్సీ నోటులను దొంగిలించెను. నేను చాలా భయపడితిని ఏడ్చుచూ కూర్చుంటిని. ఒకనాడు ఒక ఫకీరు వచ్చి షిరిడి సాయిబాబాను ప్రార్థించిన పైకం తిరిగి వచ్చునని అంతవరకు నీకిష్టమైన వంటకమును తిననని మొక్కుకొనమని చెప్పెను. వారి సలహాను పాటించగా వంటవాడు మనసు మార్చుకుని మొత్తము పైకం తెచ్చియిచ్చి క్షమింపుడని కోరెను. బాబా దర్శనము కొరకు గోవాలో స్టీమరు ఎక్క ప్రయత్నించగా కెప్టెన్ ఖాళీలేదని చెప్పెను. తనకు అంతకు ముందెన్నడు పరిచయములేని నౌకరు వలన స్టీమరులో సీటు సంపాదించితినని చెప్పెను. కాని ఎక్కడో జరిగిన విషయములన్నీ బాబాకు ఎట్లు తెలిసినవని ఆశ్చర్యపడిరి.

ఈ కథవలన కూడ బాబా సర్వజ్ఞుడని సాక్షాత్తు భగవత్ స్వరూపుడని నిరూపించబడినది. యిట్టి సమర్థుడైన సాయిబాబా మనలను కూడ అన్నివిధములా రక్షించుగాక! పాఠకులంతా సాయిపై విశ్వాసముంచెదరుగాక!

ఓం శాంతి శాంతి శాంతిః
యిరువది మూడవ అధ్యాయం సంపూర్ణం.
నాలుగవరోజు పారాయణ పూర్తి అయినది.

అయిదవరోజు పారాయణ-సోమవారము

యిరువది నాలుగవ అధ్యాయము

బాబా ఎన్నడు ఉపవాసముండలేదు. తన భక్తులనుకూడ ఉపవాసము చేయనీయలేదు. ఉపవాసమువలన మనస్సు స్థిరముగా వుండదు. ఆకలిగానున్న కడుపుతో దేముని చూడలేము. మొదట ఆత్మను శాంతింపజేయుట చాలా అవసరము. భగవంతుని చూచుటకు కళ్ళు, పొగడుటకు నోరు, సత్సంగములు వినుటకు చెవి వీటికి అవసరమగు శక్తి పౌష్టిక ఆహారము వలననే లభించును. అందువలన బాబా ఉపవాసమును అంగీకరించెడి వారు కాదు.

గోఖలే భార్య ఉపవాసము

ఈమె దాదా కేల్కరుకు తెలిసినవారి ద్వారా షిరిడికి వచ్చినది. అందుచే వారి యింటిలోనే వుండెను. ఉపవసించి 3 రోజులు బాబా సమక్షంలో వుండవలెనని తలచినది. ఆమెతో బాబా వుపవాసం వుండవలసిన అవసరం లేదమ్మా! మన దాదా భట్టు యింటికివెళ్ళి బొబ్బట్లు వండి అతని పిల్లలకు పెట్టి నీవు కూడ కడుపు నిండ తినుమని చెప్పెను. దాదా భట్టు భార్య యింటిలోనికి వెళ్లుటకు వీలులేని స్థితిలో నుండుటచే ఈ సలహా సమయోచితముగా వుండెను. బాబా సలహా ప్రకారం ఆమె బొబ్బట్లుచేసి యితరులకు పెట్టి తాను తినెను. ఉపవాసము కేవలం జీర్ణశక్తిని బాగుచేసుకునే ఒక భౌతిక ప్రక్రియగాని, దాని వలన పుణ్యమొస్తుందనుకోవటం పొరపాటే! పుణ్యం సంగతి ఎలా వున్నా ఉపవాసం వున్న రోజు నీరసంగా వుండటం వలన రోజూ చేసుకునే పనులే సరిగా చేసుకోలేము. బాబా పూజ చేయుభక్తులు టైము ప్రకారం ఆహారం తీసుకున్న తరువాతే పూజ చేసుకోవచ్చును.

శ్యామా సప్తశృంగి మొక్కు

నాసిక్ జిల్లాలో గల వణీ అను వూరిలో ప్రసిద్ధి గాంచిన సప్తశృంగి దేవాలయము కలదు. కాకాజి వైద్య ఆ గుడిలో పూజారి. అతనికి జీవితములో అనేక కష్టపరంపరలు ఒకదాని వెనుక ఒకటి వచ్చుట వలన మనశ్శాంతిని కోల్పోయి వ్యాకులుడయ్యెను. ఒకనాడు ఆ దేవత ఎదురుగా నిలబడి నిన్ను యిన్ని రోజుల నుంచి భక్తి శ్రద్ధలతో పూజిస్తున్నాను. సేవిస్తున్నాను. నాకు మనశ్శాంతి నివ్వమని

త్రికరణ శుద్ధిగా ప్రార్థించెను. ఆ రాత్రి దేవత కలలో కనిపించి - బాబా వద్దకు వెళ్ళుము నీ మనస్సు శాంతించునని చెప్పెను. బాబాయనగా త్రయంబకేశ్వర్‌లోగల శివుడై వుండవచ్చునన్న భావనతో అక్కడకు వెళ్ళి పదిరోజులు భక్తి శ్రద్ధలతో పూజాది కార్యక్రమాలను నిర్వహించినా మనసు శాంతి నొందక తిరిగి తనవూరుకు వచ్చి మరల దేవతను వేడుకొనగా ఆమె స్వప్నములో-నీవు అనవసరముగా త్రయంబకేశ్వరమునకు వెళ్ళితివి. బాబా అనగా షిరిడి సాయిబాబా అని చెప్పెను. షిరిడికి ఎలా వెళ్ళవలెను. అని ఆలోచించుచుండెను. యితడు పవిత్ర జీవనం గడుపు వాడగుటచే ఈతని రాకకు బాబా కూడా తగిన ఏర్పాట్లు యింకొక విధముగా చేసెను.

బాబా భక్తుడైన శ్యామా చిన్నపిల్లవాడుగా వున్నప్పుడు జబ్బుపడగా తమ గృహదేవతయైన సప్తస్పంగి దేవతకు జబ్బునయమైనచో బిడ్డను తీసుకువచ్చి నీపాద దర్శనము చేయించెదనని అతని తల్లి మొక్కుకొనెను. కొన్నాళ్ళ తరువాత ఆమె కుచములపై తామరలేచి బాధపడగా అది తగ్గినచో రెండు వెండికుచములను ఆ దేవతకు సమర్పించెదనని మరల మొక్కుకుని ఈ రెండు మొక్కులను తీర్చకయే ఆమె మరణించెను. ఇది 32 సంవత్సరములకు ముందు జరిగిన విషయము. శ్యామా కూడ మరచిపోయెను. ఒకసారి షిరిడిలోకి ఒక జ్యోతిష్కుడు వచ్చి అందరి గురించి చెబుతూ శ్యామా తన కులదేవతకుగల మొక్కు చెల్లించలేదని చెప్పెను. బాగా ఆలోచించగా శ్యామాకు ఆ రెండు మొక్కులు జ్ఞప్తికి వచ్చెను. వెంటనే రెండు వెండి కుచములను చేయించి బాబా పాదముల చెంత వుంచి తన సప్తశృంగి దేవత బాబాయే అని వాటిని స్వీకరించమని ప్రాధేయపడెను. బాబా అంగీకరించక శ్యామాను స్వయంగా వెళ్ళి ఆ దేవతకు వాటిని సమర్పించమని ఆదేశించెను, శ్యామా వాటిని తీసుకుని సప్తశృంగికి వెళ్ళి పూజారి యిల్లు కనుగొని కాకాజీ వైద్య యింటికి వెళ్ళి వివరములు తెల్పెను.

షిరిడి నుంచి బాబాయొక్క ముఖ్య అనుచరుడే తన యింటికి వచ్చుట కాకా వైద్య గొప్ప దైవానుగ్రహంగా భావించెను. అదేవిధముగా తన మొక్కు తీర్చుటకు కావలసిన పూజారి తన కోసంఎదురుచూస్తూ వుండుట శ్యామాకు ఆనందము కలిగించెను. ఈ విధముగా బాబా వీరిద్దరినీ కలుపుటకే శ్యామాను అక్కడకు పంపి వుండవచ్చును. శ్యామా మొక్కు భక్తిశ్రద్ధలతో తీర్చుకున్న తరువాత యిద్దరు కలిసి షిరిడికి వెళ్ళిరి. వైద్య బాబా పాదములను దర్శించినంతనే అతని మనోవికారములు.

అశాంతి తొలగిపోయి పరమానందము కలిగెను. బాబా ఏమీ మాట్లాడలేదు, ఆశీర్వదించలేదు. అయినా కేవలం దర్శనం వల్లనే తన కింతటి శాంతిని ప్రసాదించిన సాయి మహామహిమాన్వితుడని గ్రహించెను. 12 రోజులు షిరిడిలో వుండి తనివితీర బాబా యొక్క దర్శన, స్పర్శన, సంభాషణల ద్వారా ఆనందించి బాబావిభూది ప్రసాదమును పొంది తిరిగివెళ్ళెను.

బాబా గుఱ్ఱం-శ్యామకర్ణ

బాబా భక్తుడొకడు తన వ్యాపారంలో బాగా లాభించినందుకు మంచి గుఱ్ఱమునొకదానిని తీసుకువచ్చి బాబాకు బహూకరించెను. బాబా దానికి శ్యామసుందర్ అనిపేరు పెట్టి తుకారాం అను భక్తునికి దాని సంరక్షణ భారమప్పగించెను. అది ఒక జంతువు అనేభావనతో చూడవద్దని తన బిడ్డలాంటిదని అనేకసార్లు బాబా ఈ గుర్రం గురించి భక్తులతో చెప్పేవారు. దీనిని శ్యామకర్ణ అని కూడ పిలిచేవారు. ఒకరోజు ఎందుకో అది పచ్చగడ్డి మేత తినలేదు. తుకారాం ఎంత అనునయించినా అది మొండికేసి ఒక్క గడ్డిపోచ కూడ నమలలేదు. అతడు విసుగుచెంది పెద్దకర్రతో దాని వీపుపై కొట్టెను. యిది మసీదుకు కొంచెం దూరంలో ప్రక్కగా జరిగెను. వెంటనే తుకారాంను పిలిపించి, అంత పెద్ద కర్రతో నన్నేల కొట్టితివని బాబా గద్దించెను. బాబా వాక్కుల తీవ్రతకు అతడు గడగడావణికిపోయెను. బాబా తనబారుచొక్కాను పైకెత్తి వాతవలె తేలిన ఎర్రని కర్రదెబ్బగుర్తును చూపించెను. దానిని చూచినవారంతా ఆశ్చర్యమును, భయమును పొందిరి. అందరూ తుకారాం వైపు అనుమానంగా చూచుచుండిరి. తుకారాం తానా రోజు ద్వారకామాయి వైపుకే రాలేదని బాబాను తాను కొట్టలేదని పదేపదే చెప్పుచుండెను. అప్పుడు బాబా నాబిడ్డ శ్యామసుందర్‌ను కొట్టిన నన్ను కొట్టి నట్లుకాదా? అని గుఱ్ఱమును కొట్టిన విషయమును తుకారాంకు గుర్తుచేసెను. వెంటనే భక్తులంతా పరుగునవెళ్ళి శ్యామకర్ణను చూడగా బాబా వీపుపై వున్నంత పొడవునా దానివీపుపై కూడ కర్రదెబ్బ తగిలి వాచియుండెను. అందరు ఆశ్చర్యపడిరి, సర్వజీవులలోను నేనే వున్నాను అని బాబా నిదర్శన పూర్వకంగా నిరూపించిన విచిత్రలీల యిది. ఆ రోజు నుంచి శ్యామ కర్ణను ఎంతో గౌరవభావంతో భక్తులంతా చూసేవారు. దానికొరకు పచ్చగడ్డి, వులవలు తెచ్చియిచ్చేవారు. కొందరు పైనవేయుటకు జరీఅంచు శాలువలు యిచ్చెడివారు. ఎంతోమంది మానవులకు లేని సాన్నిహిత్యం ఆ గుఱ్ఱం బాబాతో అనుభవించినది. దాని జీవితము ధన్యం. ఔరంగాబాదుకర్ అనునతనికి సంతానము లేదు. బాబా అనుగ్రహముతో మగపిల్లవాడు జన్మించెను. అతడు కృతజ్ఞతతో 500 రూపాయలు ఖర్చుపెట్టి శ్యామకర్ణ వుండటకు

ఒక పశుశాల నిర్మించెను. గురువారమునాడు జరుగు ఉత్సవములో శ్యామకర్ణను సుందరమైన దుస్తులు కప్పి అలంకరించి వూరేగింపుకు ముందుగా వుంచెడివారు. వాద్యములకు అనుగుణంగా అది కూడ నాట్యము చేయుచు ఆనందించెడిది.

బాబాకు పరీక్ష

అది 1915వ సంవత్సరం. ఒక గురువారం రోజు ఉదయం మసీదు భక్తులతో కోలాహలంగా వున్నది. మసీదు ముందుభాగంలో రాతిపైకాలు మీదకాలు వేసుకుని బాబా కూర్చుని వున్నారు. నానా చందోర్కరు, శ్యామా, మహల్సాపతి, దీక్షిత్, తాత్యా, సాఠే మొదలైన భక్తులంతా నిలబడి వున్నారు. ఉన్నత కుటుంబీకురాలు, ధనవంతురాలైన మధ్యవయసుగల జానకీబాయి అనే స్త్రీ జలతారు పట్టుజరీ అంచుగల చీరను ధరించి చేతితో బంగారు పళ్ళెమును ధరించి అందులో బాబా కొరకు అనేక విలువైన ఆభరణములను కానుకగా తెచ్చెను. స్త్రీల వరుసలో నిలబడి వుండెను. బాబాను సేవించుటకు ప్రతిభక్తుని చేతిలోను ఏదో ఒక వస్తువుండెను. కొందరు బాబా పాదములను వెండి పళ్ళెములో వుంచి కడుగుచుండిరి. కొందరు మెడవద్ద చందనము అత్తరులు వ్రాయుచుండిరి. కొందరు బాబాకు పూలను, పండ్లను పేడాలను నైవేద్యముగా సమర్పించుచుండిరి. కొందరు తమ శక్తికొలది ధనమును బాబాకు దక్షిణగా యిచ్చుచుండిరి. కొందరు బాబాకు చామరములు వీచుచుండిరి.

భక్తుల గుంపులకు వెనుకగా వుండి దీనినంతా గమనిస్తున్న నానావళి ఎంతో సంతోషించెను. కాని కొద్దిక్షములలోనే అతని ముఖ కవళికలు మారిపోయెను. అతని ముఖముపైగల ఆనంద చిహ్నములు పోయి అనుమానపు గుర్తులు గోచరించెను. మరుక్షణములోనే ఆ ముఖకవళికలు కోపమును సూచించెను. క్షణములలోనే అతని శరీరమంతా కోపముతో వేడెక్కెను. కళ్ళు ఎర్రనైయ్యెను. భయంకర రూపదయ్యెను. ఏయ్ ఫకీర్! అని దిక్కులు పిక్కటిల్లునట్లు అరచెను. అందరూ వెనుకకు తిరిగి నానావళి యొక్క వుద్రేకమును చూసి నిశ్చేష్టులైరి. చాలామంది భయపడి బాబాకు వెనుకవైపుగా వెళ్ళిరి. ఎవ్వరూ నోరు విప్పలేకపోయిరి. నిశబ్దము తాండవించెను. నానావళి అడుగు ముందుకువేస్తూ బాబా కూర్చున్న రాతి దగ్గరకు వెళ్ళెను. బాబా కళ్ళలోకి కళ్ళు పెట్టిచూచుచుండెను. నానావళి దురుసు స్వభావం గలవాడు. ఏమి జరుగునో అని అందరూ భయపడుచుండిరి. నానావళి బాబాతో యింతమంది నన్ను చూచి లేచి నిలబడి, భయపడియున్నారు. నీవు మాత్రం కాలుమీద కాలు వేసుకుని

దర్జాగా కూర్చునే వున్నావు అన్నాడు. బాబా తిరిగి సమాధానం చెప్పలేదు. లే అని గద్దించాడు నానావళి. బాబా లేచి ప్రక్కనే భక్తులతోపాటుగా నిలబడ్డాడు. బాబా స్థానంలో బాబావలెనే కాలుమీద కాలువేసుకుని కూర్చున్నాడు నానావళి. భక్తులు నైవేద్యంగా తెచ్చిన ఫలహారములనన్నిటినీ తెమ్మని కొన్ని తాను తిని మిగిలినవాటిని చిందర వందర చేశాడు. బంగారు పళ్ళెములో ఆభరణములను తెచ్చిన స్త్రీ వంక ఆ పళ్ళెమువంకా దృష్టిని మార్చి మార్చి చూశాడు. ఛీయని ఆమెవంక అవమాన సూచకంగా అరచాడు.

బాబావైపు చూసి ఏమి నవాబ్ ఎలావున్నావు? అని ప్రశ్నించాడు. నేను నవాబ్‌ను కాదు ఫకీరునని బాబా సమాధానమిచ్చాడు. లోకమెట్లావుంది. మళ్ళీ ప్రశ్నించాడు. మామూలుగానే వుంది బాబా జవాబు. అంటే? రెట్టించాడు నానావళి. పంచభూతాలతో, అష్టదిక్కులతో ఈలోకం నాకు మామూలుగానే కనిపిస్తున్నదని తిరిగి బాబాతన సహజధోరణిలోనే సమాధానమిచ్చాడు. బాబా సమాధానం విన్న నానావళి ముఖకవళికలు మారిపోయినాయి. నిప్పు కణికవలె ప్రజ్వలించిన మనిషి మంచుకొండవలె చల్లనైపోయాడు. మళ్ళీ బాబా కళ్ళలోకి కళ్ళుపెట్టి చూచాడు. వారిద్దరి కళ్ళు ఏవేవో మాట్లాడుకున్నాయి. నన్ను క్షమించు అంటూ నానావళి బాబా పాదాలను తాకి చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. క్షణక్షణం ఏమి జరుగుతుందో అన్న ఉత్కంఠతో సాగిన ఈ సన్నివేశం నుంచి భక్తులు తేరుకుని హాయిగా వూపిరి పీల్చుకున్నారు.

అప్పుడు నానా చందోర్కరు బాబాతో నానావళి పిచ్చిచేష్టలు రోజు రోజుకీ పెరుగుతూవున్నాయి. ఆఖరికి మీరు కూర్చునే రాయి మీదే కూర్చుని మీకు తెచ్చే నైవేద్యాన్నే తిని, పాడుచేసి, మీ భక్తులను అవమాన పరచేస్థితికి వచ్చాడు. యిక మేము యితని చేష్టలను సహించలేము. మీరు అనుతిస్తే యితనిపై తగుచర్య తీసుకుంటామని అడుగగా బాబా - మీరందరూ అనుకుంటున్నట్లుగా నానావళి పిచ్చివాడు కాదు. నన్ను పరీక్ష చేయటానికి వచ్చిన ప్రాపంచిక అవధులు దాటిన అవధూత - అని చెపుతాడు. ఆ పిచ్చివాడు మిమ్మల్ని పరీక్షించటమేమిటి బాబా అని తిరిగి నానా అడుగుతాడు. అప్పుడు పూర్తి విషయాన్ని యిలా వివరిస్తారు. సాయి - నేను ఈ వూరుకు వచ్చిన కొత్తల్లో నేను ఒక పిచ్చివాడినని నన్ను రాళ్ళతో కొట్టారు. ఆ తరువాత నన్ను వైద్యుడు అన్నారు. యిప్పుడు దేముడు అంటూ నిత్య

వైద్యాలతో, కానుకలతో, పూజలతో ఆరాధిస్తున్నారు. మీరు చేసే ఈ ఆరాధనల మత్తు నాలో యిహ లోక సంబంధమైన భౌతిక విషయాలపై వ్యామోహమును పెంచినదేమోనని నన్ను పరీక్షించాడు నానావళి. నేనిచ్చిన సమాధానం వలన నేను నా నిజస్థితి నుండి మారలేదని గ్రహించి వెళ్ళిపోయాడు. వేదాంతానికి పరకాష్టే పిచ్చి. బాబా యిచ్చిన వివరణ ప్రకారం అంతకు ముందు నానావళి ప్రవర్తనను ఒకసారి గుర్తు చేసుకొని అతని ప్రశ్నలు, బాబా సమాధానాలు కూడ అదే దృష్టిలో తెలుసుకుని ఆనందించారు. నానావళి పిచ్చివాడనే భావన ఆనాటి నుంచి పోయింది.

ఎర్రని అరటిపండ్లు

శ్రీ యం.జి. రేగే తన విద్యార్థిదశలనే బాబాను దర్శించెను. అప్పటిలో బాబాకు సన్నిహితులుగా వుండే భక్తులందరిలోను ఈయనే చిన్నవాడు. ఒకరోజు ద్వారకామాయిలో భక్తులందరూ కూర్చుని వుండగా ఒక భక్తుడు బాబాకు ఎర్ర రంగుగల అరటిపళ్ళ గెలను బహుకరించెను. అరటి పండు తొక్క యొక్క ఎర్ర రంగు రేగెను ఆకర్షించెను. ఆ పండ్లను తినవలెనని అతడు మనసులో కోరుకొనెను. బాబా ఆ పండ్లను అందరికీ పంచుతూ ఒక పండును వలిచి భక్తునికిచ్చి ఎర్రని రంగుగల తొక్కను రేగే చేతిలోపెట్టి తినుమనెను. బాబా ఆజ్ఞ శిరసావహించి రేగే ఆ తొక్క నమిలి తినెను. అందిరికీ పళ్ళుపంచుట పూర్తి అయిన తరువాత బాబా రేగే వద్దకు వచ్చి నీకేమీ పెట్టలేదు కదా అని యింకొక అరటి పండును వలిచి తొక్కను పారవేసి సగము రేగే నోట్లో పెట్టి మిగిలిన సగం బాబా తినెను. అరటిపండు తొక్క యొక్క రంగును చూసి ఆశపడినాడు కనుక కేవలం తొక్కనే యిచ్చి తినుమని దానియొక్క రుచిని బాబా చూపించినారు. దాని రుచిని తెలుసుకుని తొక్క యొక్క రంగులో రుచిలేదని, రుచికరమైనది కేవలం లోపల వుండే మెత్తని భాగమేనని తెలుపుటకు ఆఖరికి స్వయంగా తన చేతితో అసలు పండును పెట్టి దాని రుచినీ చూపించారు. బయటకు కనిపించే బాహ్యామైన అందాల కొరకే ఆశపడక లోపలగల దివ్యశక్తినే మనం ప్రతి వస్తువులోనూ చూడాలనే బాబా చూపిన ఈ ప్రత్యేక నిదర్శనాన్ని జాగ్రత్తగా గ్రహించవలెను.

ఓం శాంతి శాంతి శాంతిః
యిరువది నాలుగవ అధ్యాయం సంపూర్ణం

యిరువది అయిదవ అధ్యాయము

1914లో బాబా యిచ్చిన దీక్షాకాలం ముగియకముందే బాబాకు చెప్పకుండా వెళ్ళిపోయిన ఉపాసనీ శాస్త్రి నాగపూరులోను, సింధేయందును. అచటి నుండి ఖరగ్‌పూర్‌నకు వెళ్ళెను. ఆ తరువాత ఒక పంచముని యింటిలో నివాసమేర్పరచుకుని కొంతకాలముండిరి. బాబా అనుగ్రహము వలన షిరిడిలోనున్న కాలములోనే అనేక సిద్ధశక్తులు వీరికి వశమయ్యెను మీరు 15 నెలలపాటు బయట సంచరించి 1915లో తిరిగి షిరిడికి రాగా బాబా వీరిని దగ్గరగల సాకోరి అను గ్రామములో ఆశ్రమము నేర్పరచుకొని వుండమని సూచన చేయగా వారు అట్లేచేసిరి. ఆర్తులు, అర్థార్తులు, రోగులు వేలకువేలు ఉపాసనీబాబాను సేవించి స్వస్థతను పొందిరి. అనేక మంది భక్తులకు గురుతుల్యుడైన ఉపాసనీబాబా తన 72వ ఏట 1942లో సమాధి చెందిరి. షిరిడికి 5 కిలోమీటర్ల దూరంలోగల ఈ ఆశ్రమాన్ని షిరిడికి పోవు యాత్రికులు సందర్శించవచ్చును.

కర్మలు (పనులు) ముఖ్యము

ప్రతి రోజు బాబా భిక్షకు వెళ్ళేడివాడు. బాబా మహిమలు పెరుగుతున్న కొద్దీ బిక్షవేయు వారిలో శ్రద్ధపెరిగి బాబా వచ్చు సమయమునకు బిక్షతో సిద్ధముగా వుండెడివారు. ఒకరోజు సావిత్రిబాయి అను యిల్లాలు వంటచేయుట ఆలశ్యముకాగా బాబావచ్చునని తొందరపడుచున్నది. యింటిలోగల ముసలి మామగారు కూడ భోజనము ఆలశ్యమగుటచే ఆకలితో అలమటించుచున్నాడు. బాబా భిక్షకు వచ్చునను ఆదుర్దాలో ఆమె త్వర త్వరగా వంటను ముగించుచున్నది. రొట్టెలు కూర పూర్తి అయినవి వాటిని పళ్ళెములో బాబా కొరకు సిద్ధముగా వుంచుచుండెను. బాబా భిక్షాపాత్రతో వారియింటికీ రానేవచ్చెను. గమనించిన సావిత్రిబాయి బాబాను రెండు క్షణములు మాత్రమే వుండమని చెప్పెను. యింతలో మామగారు ఆకలితో కోడలిని కేకవేసెను. ఆమె బాబాకు భిక్షవేయుచున్నానని, భిక్ష వేసిన మరుక్షణమే ఆయనకు కూడ ఆహారము వడ్డిస్తానని చెప్పి రొట్టెలను కూరను బాబాకు వేయుటకు బయటకు వచ్చెను. ఆమెతో బాబా యిట్లనెను. అమ్మా! నీవు మునుముందుగా నీమామకు ఆహారము యివ్వవలెను ఎందుకని అడిగెదవా! నీమామకు ఆహారమిచ్చుట నీ కర్తవ్యము. నాకు బిక్షవేయుట సత్కర్మ. సత్కర్మకన్నా కర్తవ్యమును నిర్వహించుటకే ప్రాధాన్యతనివ్వవలెను. సకాలమున నీ మామకు భోజనము పెట్టుట నీధర్మము దానిని మొట్టమొదటగా నీవు నిర్వర్తించవలెను. ఆ తరువాతనే నాకు భిక్ష అని చెప్పెను. అందుకామె మీరు సాక్షాత్తు దైవస్వరూపులు, మిమ్ము ముందు సంతృప్తిపరచుటే నా

ఆశయమని చెప్పెను. ఆమెతో తిరిగి బాబా యిట్లనెను కర్మలు మిక్కిలి శక్తివంతమైన అయుధములలాంటివి తల్లీ. భగవంతుడు నీ మామగారిని నీ దగ్గరగావుంచి ఆయనకు సేవ చేయు బాధ్యత నీకప్పగించాడు. అలాంటి దైవమే నీ యింటి ముంగిట నిలచినా నీకర్తవ్యమునకే నీవు మొదటి ప్రాధాన్యత నివ్వాలి. యిదే కర్మసిద్ధాంతము, భగవంతుడు మనకిచ్చిన కర్మలను మనము సక్రమమైనరీతిలో నిర్వహించవలెను చేయవలసిన పనిని సరైన విధముగా చేయనిచో అది తప్పు అవుతుంది. నన్ను విశ్వశించిన నీచేత తప్పుచేయించుట నాకు ధర్మముకాదు కదా! నాసమక్షమున ముందు నీమామకు సంతృప్తికరముగా భోజనము పెట్టుము అంతవరకు నేను యిక్కడే కూర్చుని ఆ తరువాత ప్రేమపూరితమైన నీ భిక్షను స్వీకరించి వెళతాననిన ఆమె అదే విధముగా మామగారికి భోజనము పెట్టిన తరువాతే బాబాకు భిక్షయించ్చెను. ఆనాటి నుంచి బాబా బిక్షకు వచ్చుటకు ముందుగానే సావిత్రిబాయి మామగారికి సంతృప్తికరంగా భోజనం పెట్టేది.

బాబా సంస్కృతజ్ఞానం

సాయిబాబా ఒక విచిత్ర దైవం. అలాంటి విచిత్ర దైవాన్ని తనపై నిలుపుకున్న షిరిడి ఒక పుణ్యప్రదేశం. ఆ గ్రామ ప్రజలు ధన్యులు బాబా కాలికిందపడి నలిగిన గడ్డిపోచ బ్రతుకు కూడ ధన్యము. బాబా వలన షిరిడికి ప్రాముఖ్యము పొందెను. అలాంటి సాయి పాదముల చెంత సర్వశక్తులు ఆశ్రయించి వుండును. షిరిడికి వచ్చిన భక్తులు బాబాకు పాదసేవ చేసెడివారు ఒక రోజు నానా చందోర్కరు ఏకాంతముగా బాబా పాదముల నొత్తుచూ ఏదో సంస్కృత శ్లోకమును చర్చించుచుండెను. బాబా ఏమి చదువు చున్నావని ప్రశ్నించెను. అది సంస్కృత శ్లోకము మీకు తెలియదులే బాబా అని చందోర్కరు సమాధానం చెప్పెను. తెలియనిచో తెలుసుకొనెదను శ్లోకమును పైకి చదువుమని బాబా చెప్పెను. అప్పుడు నానా తాను గొణుగుతున్న భగవద్గీత నాల్గవ అధ్యాయంలోని 34వ శ్లోకాన్ని ఈ విధముగా చదివెను.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః"

బాబా : దీని అర్థమేమి.

నానా : బ్రహ్మ తత్వమును తెలిసిన జ్ఞానుల (గురువు) పాదములపై పడి సాష్టాంగ నమస్కారము చేసి ప్రశ్నించి, వారిని సేవించినచో వారు నీకు జ్ఞానమును ఉపదేశించెదరని దాని అర్థము చెప్పెను.

బాబా : శ్లోకములోని ప్రతి పదము యొక్క అర్థమును వివరించుమని కోరగా నానా అట్లే పతి పదార్ధమును చెప్పెను.

బాబా : పరిప్రశ్న యనగా ఏమి?

నానా : ప్రశ్నించుట

బాబా : ప్రశ్న యనగా?

నానా : ప్రశ్నించుటే

బాబా : రెండింటికి ప్రశ్నించుటేయని చెప్పుచున్నావు, పరియను సంస్కృత పదమునకు ప్రత్యేకమైన అర్థములేదా?

నానా : పరిప్రశ్నయను దానికి యింతకంటే వేరే అర్థము నాకు తెలియదు

బాబా : సేవయనగానేమి?

నానా : రోజూ మేము మీకు చేయుసేవలాంటిదే!

బాబా : పై శ్లోకములో జ్ఞానమునకు బదులు 'అజ్ఞానము' అనుపదము ఉపయోగించిన ఎట్టి అర్థము వచ్చును?

నానా : ఆ పదముతో ఈ శ్లోక అర్థమును సమన్వయ పరచుట నాకు తెలియదు.

బాబా : గీతాకారుడైన శ్రీకృష్ణుడు జ్ఞాని, తత్వదర్శి కదా! మరి అర్జునుని యితర జ్ఞానులకు నమస్కరించి, సేవచేసి, ప్రశ్నించమని ఎల చెప్పెను.

నానా : అదియును నాకు తెలియదు.

బాబాకు సంస్కృతము రాదని, తాను భగవద్గీతకు అనేకమంది వ్యాఖ్యలు చదివిన పండితుడననే భావం నానా చందోర్కరులో అంతకుముందు బాగావుండేది. కాని తన నోటికొచ్చిన కేవలం రెండు లైన్ల శ్లోకంలోని మూడు భావములకు నాకు తెలియదు అని సమాధానం యివ్వవలసి వచ్చేసరికి నానాచందోర్కరు సిగ్గుపడెను. ఎంతటి పండితుడైనా జ్ఞానులవద్ద మూగపోవలసినదేనని తాను అనుభవపూర్వకముగా గ్రహించెను. అప్పుడు బాబా పైమూడు ప్రశ్నలకు తనదైన శైలిలో ఈ క్రింది విధముగా వ్యాఖ్యానించెను.

1) గురువును ప్రశ్నించుట యనగా శోధించుటకాదు. దొంగ ఎత్తుతో దుర్బుద్ధితో, వారిని బుట్టలో వేయుటకు, వారి తప్పులు పట్టుటకుగాను పనికిరాని

ప్రశ్నలువేసి ప్రశ్నించుటకాదు. నిజముగా తెలుసుకొనుటకు, తెలుసుకొనిన దానిని మనసులో భద్రపరచుకొని జీవితంలో ఆచరించి అనుభవ పూర్వకముగా తెలుసుకొనే ఆశక్తితో కూడిన భక్తి శ్రద్ధలతో ప్రశ్నించవలెను. పరియను శబ్దము యొక్క అర్ధమిది. అదివ్యాసుడు వ్యర్ధముగా వుపయోగించిన పదంకాదు.

2) సేవయనగా మనకు యిష్టమైన రోజున చేసెదము లేనిరోజున మానెదము అను భావముతో చేయునది సేవకాదు. ఈ శరీరము తనదికాదని గురుసేవకై భగవంతుడిచ్చినదని భావించవలెను. అట్టి జ్ఞానమును కలిగినవారికే గురువు ఈ శ్లోకములో చెప్పిన జ్ఞానమును బోధించిన అర్ధమగునుగాని మిగిలిన వారికి చెప్పినను అర్ధముకాదు. అలాంటి వారికి బోధించుట అజ్ఞానము బోధించుటే అగును.

3) ఎంత గొప్ప మహాపురుషుడైనా అత్యంత సన్నిహితుడైనచో, ఆ దివ్య పురుషుని శక్తిని సామాన్యులు గుర్తించలేరు. తమలాంటి మనిషేననే సాధారణ భావన చాలాసార్లు స్ఫురిస్తుంది. యిది మాయా ప్రభావం. అందువలననే శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో అర్జునుని సంపూర్ణ జ్ఞానం కోసం తత్వవిదులను సేవించమని చెప్పెను.

బాబాయొక్క ఈ వ్యాఖ్యానమును విని నానా చాలా ఆనందించెను. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతలో యింత లోతైన విషయజ్ఞానం వున్న బాబా ఎంత గొప్ప పండితుడో నానా వూహకు అందలేదు. బాబా యొక్క జ్ఞానానికి ఆకాశమే హద్దని దానిని ఎవరూ కొలవలేరనే భావన నానాలో కలిగెను. నానా ఆలోచనలలో బాబా అనంతంగా పెరుగుతున్నట్లు తాను ఎంతో చిన్నవాడైపోతున్నట్లు అనిపించెను. నానాలో కలుగుతున్న మార్పును గమనించిన బాబా మెల్లగా నడుచుకుంటూ ద్వారకామాయి అరుగుమీదకు వచ్చెను. బాబాను తదేకంగా చూస్తూ అయస్కాంతంచేత ఆకర్షించబడిన యినుప ముక్కవలె నానా కూడ ద్వారకామాయి బయటకు వచ్చెను. చూచుచుండగనే బాబా శరీరము పెరిగిపోయెను. ముఖ కవళికలు క్షణక్షణమునకు మారుచుండెను. ఎరుపు, పసుపు ఆకుపచ్చ యిలా అనేక రంగుల కాంతి కిరణములు బాబా శరీరమునుండి దివ్య తేజస్సుతో బయటకు వచ్చుచుండెను. పెరుగుతున్న బాబా శరీరమును చూచుటకు నానా తన తలను పూర్తిగా ఎత్తిచూడవలసి వచ్చెను. తళతళలాడుతూ శరీరం నుండి వెడలు కాంతి పుంజములను నానా చూడలేక కళ్ళు మూసుకొనెను. ఆకాశంనుంచి వినపడుతున్నట్లుగా వున్న ధీర గంభీరమైన బాబా వాక్కులు యిట్లు వినపడెను.

నానా అజ్ఞాన అంధకారములో చిక్కి పరిమితమైన మానవ శరీరంలో యిమిడిన కన్నులు ఈ నా దివ్యరూపాన్ని చూడలేవు. దేవతలకుండే దివ్యదృష్టిని నీకు ప్రసాదిస్తున్నాను కన్నులు తెరచి ఈ నారూపాన్ని చూడు! సమస్త గోళాలకు ఆధారభూతుడనైన దివ్యశక్తిని నేనే. సూర్యచంద్రులు నా నేత్రాలు. ఈ సృష్టిలో పిపీలికాది బ్రహ్మ పర్యంతముగల జీవులన్నిటిలోగల జీవనచక్రము నాలో నిత్యము జరిగే మార్పు, వారి వారి కర్మలనుబట్టి పుణ్య పాపులను స్వర్గ, నరకములకు పంపు విరాట్ స్వరూపము నేనే. అగ్ని గోళములు, జలరాసులు, సమస్తరోగములు వాటి కవసరమగు దివ్యౌషధములు అన్నీ నాలోనే నిండి యున్నవి. ఈ సమస్త చరాచర సృష్టి నా కుక్షిలో నిండియున్నది. నాలో లేనిదిలేదు. నేను పూర్ణ పురుషుడను, సంపూర్ణశక్తివంతుడను.

బాబా యొక్క మాటలు, విశ్వరూప సందర్శనం వలన నానా ఒక్క క్షణం మూర్ఛబోయెను, మరుక్షణంలోనే తెలివివచ్చు సరికి మామూలు శరీరంతో బాబా చిరునవ్వులు నవ్వుతూ యింతకుముందు నీవు చూసిన దృశ్యాన్ని ఎవరికీ చెప్పవద్దనెను. తానింత వరకు చూసినది కలా, మాయా, లేక నిజమా అన్న విషయం తెలుసుకోలేని స్థితిలో నున్న నానా తాను సంపూర్ణ జ్ఞానంతో వుండి యింద్రియములన్నీ మామూలుగానే పని చేయుటచే యిది కలకాదని నిర్ణయించుకుని బాబా పాదములపై వ్రాలి ఆనంద భాష్పములతో ఆ దేవ దేవుని పాదములను కడిగెను.

నానా దేవాలయమును అగౌరవపరచుట

ఒకసారి నానా చందోర్కరు తన పడ్డకుడగు బినివల్లెతో కలిసి షిరిడీకి వచ్చెను. ఎన్నాళ్ళుగానో నా సాహచర్యంలో వుండి ఈనాడు యిట్లేల చేసితివి, కోపరగాం నుంచి షిరిడికి ఎట్లు వచ్చితివి? అని ప్రశ్నించెను. నానాకు జరిగిన పొరపాటు గుర్తుకువచ్చెను. ప్రతిసారి షిరిడికి వచ్చునప్పుడు కొపరగాంలో దిగి గోదావరిలో స్నానంచేసి దత్తదేవుని దర్శనం చేసుకుని మరీ వచ్చేవాడు. లోగడ వచ్చినప్పుడు మందిర పూజారికి 300 రూపాయలు చందా యిచ్చెదనని నానా చెప్పియుండెను. ఈసారి వెళ్ళినచో పూజారి ఆ వాగ్దానమును గుర్తుచేసి పైకమడుగునని భావించి తన బంధువును కూడ దత్త దర్శనమునకు పోనీయక తొందరపెట్టి తీసుకు వచ్చినాడు.

విషయమును ముందుగనే గ్రహించిన బాబా. నీ వద్ద వాగ్దానము చేసిన పైకమును యిచ్చుటకు శక్తిలేనిచో ఆవిషయమును పూజారికి చెప్పిన సరిపోవును కదా! ఈ ధనము కారణముగా దైవాన్ని దర్శించలేక పోతివి? చూచితివా ధన ప్రభావము, దైవము నుంచి దూరము చేసినదని నిరూపించి చూపించెను, తప్పును తెలుసుకున్న నానా తలను దించుకుని ఖిన్నుడయ్యెను.

ఆరతి - నైవేద్యం

ప్రతిరోజు 12 గంటలకు మధ్యాన్న ఆరతి అయిన పిమ్మట సాధారణ భక్తులంతా తిరిగి వూరిలోనికి లేక వసతి గృహములకు వెళ్ళుటకు లేచేవారు. అప్పుడు బాబా అందరికీ స్వయముగా విభూదిని పంచియిస్తూ ఒక్కొక్కరినీ ఒక్కొ విధముగా పలకరిస్తూ, సలహాలిస్తూ, వుండేవారు. కొందరిని ఎప్పుడు వచ్చావని ప్రశ్నిస్తే, మరికొందరిని ఎప్పుడు వెళతావని అడిగేవారు. కొందరిని రేపు తిరిగి వెళ్ళు అని ఆదేశించేవారు. మరికొందరిని వారియింటివద్దనున్న ఎవరిగురించో అడిగేవారు. వారికొరకు ఏవేవో సలహాలిచ్చేవారు. ఎవరికి ఏది అవసరమో అది వారికి చెప్పేడివారు. అలా చెప్పిన విషయము బాబాకు ఆ భక్తునికి మాత్రమే అర్థమయ్యేవి. యిలా వెళ్ళవలసిన భక్తులంతా బయటకు వెళ్ళిన తరువాత మిగిలిన ఆంతరంగిక భక్తులు బాబాకు రెండు వైపులా బారులు తీర్చి కూర్చుండెడివాగు. బాబా మెల్లగావచ్చి నింబారువైపు వీపుపెట్టి మసీదులో కూర్చునెడివాడు.

నైవేద్యమును తెచ్చిన భక్తులు బాబా ఆశీర్వాదము కొరకు ద్వారకామాయి బయటనిలబడి వుండెడివారు. బాబాకు నైవేద్యముగా రొట్టెలు, సాంజా, పరమాన్నము బొబ్బట్లు మొదలగు వివిధ పదార్థములు వచ్చేడివి. అట్లు వచ్చిన వాటినన్నిటినీ బాబా ముందు వుంచెడివారు. వారు వాటిని భగవంతునకు సమర్పించెడివారు. ఆ తరువాత దానిలో కొంత భాగము బయటవున్న వారికి పెట్టి మిగిలిన దానిని బాబాకు యిరుప్రక్కల కూర్చున్న భక్తులకు వడ్డించెడివారు. శ్యామా నానా సాహెబ్ నిమోంకరు లిద్దరూ సాధారణంగా వడ్డించెడివారు. బాబా చూపు సోకిన ఆ పదార్థములన్నీ మిక్కిలి రుచికరంగా వుండెడివి. ప్రతి అణువు ఎంతో శక్తిదాయినిగా వుండేది. బాబాచేత స్వయముగా నివేదన చేయబడిన ఆ ఆహారము శుచిగాను, రుచిగాను, పవిత్రమైన సర్వశక్తి ప్రదాయినిగా వుండేది.

ఒకనాడు హేమాడ్ పంతు అట్టి భోజనమును తృప్తిగా కడుపునిండా భోజనము చేసిన వెంటనే బాబా అతనికి ఒక గిన్నెడు మజ్జిగయిచ్చి త్రాగుమనెను.

అతడు కడుపులో ఖాళీగా లేదని కొద్దిగా త్రాగెను. దానిరుచి విచిత్రముగా వుండెను. బాబా అతనితో పూర్తిగా త్రాగుము నీకు యిట్టి అవకాశము మరలరాదనెను. అతడు అతికష్టముపై మజ్జిగ నంతటినీ త్రాగెను, బాబావాక్కు సత్యమయ్యెను. బాబా సమాధి అగులోపల హేమాద్రిపంతునకు మరల అట్టి అవకాశమురాలేదు.

ఆత్మరాముని భార్య

ఈమె ఒకసారి బాబాకు మూడు నైవేద్యముగా సమర్పించవలెనని కోరుకొనెను 1. వంకాయ పెరుగుపచ్చడి 2. వంకాయవేపుడు కూర 3. పేడా. ఆమెకు పరిచితురాలైన రఘువీర పురందర్ భార్య షిరిడికీ వెళ్ళునప్పుడు ఆమెకు కొన్ని వంకాయలనిచ్చి షిరిడిలోని బాబాకు పెరుగు పచ్చడి, వేపుడు కూరచేసి పెట్టమని చెప్పెను. ఆమె షిరిడికీ చేరి మొదట పెరుగు పచ్చడి చేసి బాబా భోజన సమయమునకు ద్వారకామాయికి పంపగా అది చాలా రుచిగా నుండిటచే అందరికీ బాబా పంచిపెట్టెను. వంకాయవేపుడు కూడ అప్పుడే కావలెనని అడిగెను. అది వంకాయలు దొరుకు కాలముకాదు గనుక రాధాకృష్ణమాయి వంకాయ పెరుగు పచ్చడి ఎవరు తెచ్చిరో తెలుసుకుని ఆమెకే వేపుడు కావలెనని కబురు చేయగా పురంధర్ భార్యవెంటనే వేపుడు కూర వండి పంపెను. విషయమును తెలుసుకొనిన అందరూ వంకాయకూర కూడ వెంటనే కావలెననిన బాబా కోర్కెకు ఆశ్చర్యపడిరి.

1915 డిసెంబరులో బాంద్ర నివాసి బలరాం మంకడ్ అనువాడు చనిపోయిన తన తండ్రికీ ఉత్తరక్రియలు చేయుటకు గాను షిరిడి వెళ్ళునప్పుడు ఆత్మారాం భార్య వానితో బాబాకు ఏమైనా పంపవలెనని అనుకొని యిల్లంతా వెతకగా ఏమిదొరకలేదు. కొద్దిగా కోవాబిళ్ళలు మాత్రమే వున్నవి. అవి కూడ అంతకు ముందే బాబాకు నైవేద్యం పెట్టబడి యుండెను. అయినను భక్తితో వాటినే ఆమె బాబాకు పంపెను. షిరిడి చేరిన తరువాత మంకడ్ వాటిని బాబాకు యిచ్చుట మరిచెను. సాయంత్రము కూడ మరిచెను, వెంటనే బాబా ఆతనితో నీవు బయలుదేరునపుడు ఆత్మారాముని భార్య నాకేమిచ్చెనని ప్రశ్నించగా సిగ్గుపడి పరుగు పరుగున వెళ్ళి కోవా బిళ్ళలను తెచ్చి బాబాకిచ్చెను. బాబా ఒక బిళ్ళను నోటిలో వేసుకుని గుటుక్కున మింగెను. మిగిలిన వాటిని అక్కడి వారందరికీ పంచిపెట్టిరి.

మానవజన్మ ప్రాముఖ్యం

జీవకోటికంతటికీ ఆహారము, నిద్ర, భయము, సంభోగము సామాన్య విషయములు. కాని మానవునికి యివికాక జ్ఞానము అను యింకొక విశేషగుణము కలదు, దీనవలనే మనిషికి భగవంతుని గురించి తెలుసుకొన వీలగుచున్నది. కొందరు ఈ శరీరము చీము రక్తము, మాంసముతోను, మలమూత్రాది మలినములతోను నిండి యున్నదని చెప్పెదరు. చివరకు మరణించి నశించే స్వభావముగలది ఈ శరీరం. అయిననూ దీనిద్వారానే జ్ఞానాన్ని కూడ పొందుటకు వీలున్నది. అందువలన ఈ శరీరమును గురించి తగినంత శ్రద్ధతీసుకుని చక్కని ఆరోగ్యముతో వుండునట్లు ప్రయత్నించవలెను. అట్లని మితిమీరిన సుఖములతో శారీరిక వ్యామోహములకు లొంగిపోయిన అది పశుజన్మకన్నా హీనమగును. కావున మనము ఈ శరీరమును ఎప్పుడూ చక్కని ఆరోగ్యముతో వుంచుకొనుటకు అవసరమైనంత జాగ్రత్త తప్పక తీసుకొనవలెను. అంతకంటే ఎక్కువ జాగ్రత్తలు తీసుకున్న మోహమునకు దారితీయును. తక్కువ జాగ్రత్తలు తీసుకున్న అనారోగ్యములతో బాధపడవలసి వచ్చును. ఈ సత్యమును జాగ్రత్తగ గ్రహించవలెను. ఆ తదుపరి మోక్షసాధనకుగాను ఈ శరీరమును ఒక ఉపకరణముగా వుపయోగించవలెను.

రహతానివాసి కుశాల్‌చందు

రహతా నివాసి అయిన కుశాల్‌చందును బాబా చాలా ప్రేమించెడివాడు. అప్పుడప్పుడు భక్తులతో కలిసి బాబా రహతాకు వెళ్ళునప్పుడు యితడు మేళతాళములతో బాబాను ఊరిబయట నుంచి ఆహ్వానించి తీసుకుని వెళ్ళువాడు. బాబాతో పాటుగా అందరికీ భోజనములు ఏర్పాటు చేసెడివాడు. భోజనములైన పిమ్మట చాలా సేపు యిరువురు అనేక విషయములు మాట్లాడు కొనెడివారు. అట్లే నీమ్‌గాం, కోపర్‌గాంల వరకు బాబా అప్పుడప్పుడు వెళ్ళుచుండెడివాడు. మొత్తము మీద షిరిడి నుంచి 5, 6, మైళ్ళు దాటి బాబా ఎప్పుడూ బయటకు వెళ్ళలేదు. కాని ఎంతదూరములో ఏమి జరుగుచున్నను అన్నీ బాబా తెలుసుకోగలిగేవారు.

ఖపర్డే భార్య

ఖపర్డే దంపతులు షిరిడిలో వుండగా ఖపర్డే భార్య ప్రతి రోజు మిట్ట మధ్యాన్నము బాబాకు నైవేద్యమును తీసుకుని వెళ్ళెడిది. దానిని బాబా స్వీకరించిన తరువాత మాత్రమే ఆమె భుజించెడిది, ఆమె నిలకడ, నిశ్చలభక్తి విశ్వాసములకు

బాబా సంతోషించెను. ఒక రోజు మధ్యాన్నము ఆమె మామూలుగానే నైవేద్యమును తెచ్చెను. బాబా వెంటనే ఆమె పళ్ళెమును తీసుకొని ముందుగా ఆ నైవేద్యమును తినుచుండెను. అప్పుడు శ్యామా కల్పించుకుని ఎంతో మంది నైవేద్యములను మీ ముందు వుంచిరి, వాటిని నీవు ముట్టనేముట్టవు ఈమె పళ్ళెమును ముందున కీడ్చుకుని మరీ త్వరగా తినుచున్నావు. ఎందులకీ పక్షపాతము, ఆమె తెచ్చిన నైవేద్యములోని విశేషమేమని ప్రశ్నించెను.

అందులకు బాబా యిట్లు చెప్పెను. "ఈ భోజనము యదార్ధముగా చాలా రుచికరమైనది, పూర్వజన్మలలో ఈమె ఒక వర్తకుని ఆవు. అది చక్కని పాలు యిచ్చి తనను పోషించువారికి చక్కని ప్రతిఫలమిచ్చెడిది. అందువలన మానవజన్మ కలిగి ఒకతోటమాలి యింటిలో జన్మించెను. ఆ జన్మలోకూడ సేవాభావములను కలిగి యుండుటచే తదుపరి జన్మలో ఒక క్షత్రియుని యింటిలో జన్మించి ఒక వర్తకుని వివాహమాడెను. ఆ తరువాత జన్మలో ఒక బ్రాహ్మణ కుటుంబములో జన్మించెను. ప్రతి జన్మలోను ప్రేమభావముతో ఇతరులను సేవించుచుండెడిది. చాలా కాలము తరువాత ఈమెను నేను చూచితిని. ప్రేమతో నిండిన ఈమె నై వేద్యము నుండి యింకను కొన్ని ముద్దలు నన్ను తిననిమ్ము". ఈవిధముగా చెప్పుచూ ఆమె పళ్ళెమును ఖాళీచేసి గద్దెపై కూర్చొనగా ఆమె వచ్చి బాబాకు పాదములొత్తుచుండెను. ఆమె చేతులను బాబా తోముచుండెను గురుశిష్యులిద్దరూ ఒకరికొకరు సేవచేసుకొనుచుండుట చూచువారలకు ఆశ్చర్యానందములను కలుగచేసెను. బాబా ఆమెకళ్ళ లోనికి దృష్టినిల్పి తీక్షణముగా చూచెను. ఆ చూపులతాకిడికి ఆమెలో ఏదో దివ్య శక్తి ప్రవేశించెను. ఆమెకళ్ళనుంచి అనందాశ్రువులు రాలినవి. బాబా మధురస్వరంతో "రాజారామ్" అను మంత్రమును ఎల్లప్పుడు జపించుచుండుము. నీ మనస్సు శాంతించును. నీకు మేలు కలుగును. నీ జివితాశయమును పొందెదవని చెప్పెను.

పవిత్ర భావనతో గురుసేవచేయు శిష్యులు గురువుకు ప్రేమ పాత్రులగుదురు. నిజమునకు గురువు అట్టి శిష్యులపైనే ఆధారపడి యుండును. అలాంటి గురుశిష్యులిద్దరు ఒక్కటే వారికి భేదం వుండదు. ఈ పారాయణ చేయు భక్తులందరినీ సాయి అలాంటి శిష్యులుగా తీర్చిదిద్ది తనలో అంతర్భాగంగా చేసుకోమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఐదవ అధ్యాయం సంపూర్ణం

యిరువది ఆరవ అధ్యాయము

రాధాకృష్ణమాయి అసలు పేరు సుందరబాయి క్షీరసాగర్. ఈమె 1907లో షిరిడికి వచ్చి బాబా సేవకు అంకితమైనది. ఈమె షిరిడి వచ్చుటకు ముందు బాలాజీనెవాల్కర్ అనునతడు షిరిడిలో బాబా నడచు ప్రదేశములను, ద్వారకామాయి ముందు భాగమును, లెండిబాగ్‌ను తుడిచి శుభ్రపరచేవాడు. ఆ తరువాత రాధాకృష్ణమాయి ఈ కార్యక్రమమును చేపట్టినది. ఈమె తన శరీరాన్ని, బుద్ధిని, మనస్సునూ పూర్తిగా బాబాసేవకే అంకితంచేసిన పుణ్యాత్మురాలు. 1916లో ఆమె మరణించువరకు సుమారు 9 సంవత్సరములు యితర ఆలోచనలేమీ లేక బాబా సేవలో పునీతురాలైనది. ఈమె మరణానంతరం అబ్దుల్లా అనే ముస్లిం భక్తుడు ఈ పనులన్నీ చేయుచుండెడివాడు. తాత్యా కోటెపాటిల్ కూడ బాబాకు ఎంతో ప్రేమగా సేవచేసెడివాడు. అతనికి బాబా యందు సహజప్రేమ. బాబాకు బట్టలు మార్పించుట, తనకుయిష్టమైన మంచిమంచి వంటకములన్నీ బాబాచేత తినిపించుట రాత్రిపరుండు నప్పుడు మెత్తని పరుపులను ఒకదానిమీద ఒకటివేసి వత్తుగా బాబాకు పడక సిద్ధంచేయుట యివి తాత్యా చేయుపనులలోని ప్రత్యేకతలు. ఈ పనులలో తాను చెప్పినట్లుగా బాబా వినకపోతే పంతంపట్టి ఉపవాసముండి అయినాసరే బాబాచేత ఆ పనిని చేయించి తీరేవాడు. అది నిజంగానే సంసార జీవితంలోని మేనమామ, మేనల్లుడుల సంబంధమా అన్నంత అన్యోన్య ప్రేమానురాగాలు వర్ధించేవి తాత్యా, బాబాల మధ్య.

బాబా రోజు విడిచి రోజు చావడిలో నిద్రించేవారు. అక్కడ నిద్రించిన రోజు రాత్రి బాబా మెంకూసాలు ఏవేవో విషయాలు మాట్లాడుకునేవారు. మెంకుసా కిచ్చినమాట ప్రకారం చావడిలోగల తూర్పువైపు భాగం మెంకుసాకు కేటాయించబడిన ప్రదేశంలో సాధారణంగా యితరులెవ్వరినీ నిద్రించుటకు బాబా అంగీకరించే వారు కాదు. స్త్రీలను అసలు అక్కడికి రానిచ్చేవారుకాదు. పడమటివైపు భాగంలో మాత్రమే స్త్రీలు ప్రవేశించి వెంటనే వెళ్ళి పోవునట్లుగా చూసేవారు. బాబా భక్తులకు గురువారము ప్రాధాన్యతగల రోజు. గురుసాంప్రదాయానికీ ప్రాధాన్యత నిచ్చు బాబా గురువారము తనకు ప్రీతికరమైన రోజని చెప్పుటచే ఈ అలవాటు ప్రారంభమయ్యెను. మొదట

ప్రతి రెండురోజులకు ఒకసారి చావడి ఉత్సవం జంగేది. తరువాత వారమునకొకసారి గురువారము నాడుమాత్రమే జరిగే వుత్సవం భక్తుల నాకర్షించి ఆనంద డోలికలలో తేలియాడునట్లు, మైమరచి నాట్యము చేయునట్లు చేసెడిది. దీనిని వివరముగా తెలుసుకొనెదము.



ఈ ఉత్సవము రోజు రాత్రి సమయముకాగానే భక్తులు మసీదులో చేరి ముందు భాగంలో కొంతసేపు భజనచేసెడివారు. వీరి వెనుక రథము, కుడివైపుగా తులసీ కోట ఎదురుగా బాబా ఈ మధ్య భాగంలో భజన జరిగెడిది. భజనలో పాల్గొనువారు సమయమునకు ముందుగానే వచ్చి సిద్ధముగ యుండెడివారు. భజనలో అనేక వాద్యములు వుండెడివి. ద్వారకామాయి బయట ఖాళీ స్థలములో దివిటీలను సిద్ధము చేస్తూ వుండేవారు. మధ్య మధ్యలో కొందరు "శ్రీ సాయినాథ మహారాజ్‌కీ జై" అని భక్తితో నినాదములు చేసెడివారు. మసీదు చుట్టూ దీపములు వెలిగించి పైన తోరణములను కట్టెడివారు. ఈ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే తాత్యా బాబా దగ్గరకు వచ్చి బాబా! సిద్ధముగా నుండుమని చెప్పి వెళ్ళేవాడు. బాబా గుఱ్ఱము శ్యామకర్ణను రకరకాల అలంకరణలతో అలకంకరించి ఊరేగింపుకు సిద్ధముగా బయట వుంచెడివారు. బాబా చంకలో నటకా పెట్టుకుని, పైన ఉత్తరీయములు వేసుకుని, చిలుమును, పుగాకును తీసుకొని సిద్ధమయ్యేడివాడు. తాత్యా కొత్త జలతారు శాలువను తెచ్చి బాబాకు కప్పి చంకలో చెయ్యి వేసి బాబాను లేపెడివాడు. బాబా మెల్లగాలేచి మండుతున్న ధుని దగ్గరకు వెళ్ళి కుడికాలి బొటన వ్రేలుతో మండుతున్న కట్టెలను ముందుకు త్రోసి, కుడి చేతితో వెలుగుతున్న దీపమును అర్పి ద్వారకామాయి నాలుగు మూలలకు తిరిగి ఏవేవో సైగలు చేసి ఎవరితోనో మాట్లాడుతున్నట్లు కనిపించేవారు. బహుశా తల్లి ద్వారకామాయితో మాట్లాడేవారేమో? ఆ తరువాత మెల్లగా ద్వారకామాయి మెట్లుదిగుతున్నప్పుడు శ్రీ సాయినాథ్ మహారాజ్‌కీ జై అని భక్తిపారవశ్యంలో భక్తులు కేకలు వేసెడివారు. బాబాకు యిరుప్రక్కల కొందరు చామరములను వీచెడివారు. బాబా నడచు దారిపొడవునా తెల్లని వస్త్రములను పరచెడివారు. తాత్యా ఎడమ చేతిని, మహల్సాపతి కుడి చేతిని పట్టుకోగా బాపూ సాహెబ్ జోగ్ తలపై ఎర్రని రంగు గల జలతారు పట్టు గొడుగును పట్టుకొనెడివాడు. ఊరేగింపుకు మొదట శ్యామకర్ణ సుందరంగా అలంకరించబడి ముందు వుండెడిది. దాని వెనుకభజన పాటలు, కీర్తనలు పాడువారు, వారి వెనుక వివిధ రకములైన వాద్యముల మోత ఆకాశము బ్రద్దలైనట్లుగా తోచెడిది. ద్వారకామాయి నుండి మెల్లగా సాగి 10, 15 అడుగుల దూరం రాగానే బాబా దృష్టి వూర్ధ్వగతిలో వుండినట్లుండేది. ఏవేవో సైగలు చేస్తూ ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా ఉండేవారు. ఎవరో అదృశ్యరూపంలో వారితో సంభాషిస్తున్నట్లుగా వుండేది. బహుశా గురుధన్, ద్వారకామాయి వెంకూసాలు కూడ ఈ ఊరేగింపులో బాబా వెంట

వచ్చేవారేమో! ఎడమవైపునకు తిరిగి దూరముగా కనిపించే మారుతి మందిరంలోని మారుతికేవో సైగలు చేసి సంభాషించినట్లుగా అనిపించేది. ఊరేగింపు మధ్యభాగంలోకి చేరునప్పటికి బాబా ముఖ కవళికలు మారిపోయేవి. ఉదయభానునివలె నిండైన రూపంతో స్థిరముగను, ప్రకాశముతోను, సౌందర్యముతోను వెలుగుచుండెడివారు. ఒక్కొక్కప్పుడు భక్తులను గుచ్చిగుచ్చి చూచెటివారు అట్టి సమయములో వారి చూపుపడిన వారిలోగల భయాలు, బాధలు, రోగాలు, ఆందోళనలు నశించిపోయేవి. నిర్మల ఆనందంతో వారు వుప్పొంగి పోయేవారు. మహల్సాపతి ఆ ఆనందమును భరించలేక పూనికవచ్చిన వానివలె నాట్యము చేసెడివాడు. అట్టి స్థితిలో బాబాను చూచిన తాత్యాకు ఆనందభాష్పములు జలజలారాలేవి. ఎవరు ఎలా వున్నా బాబా స్థిరచిత్తుడై వుండేవాడు. దీక్షిత్ పువ్వులను, గులాల్ పొడిని బాబాపై చల్లుచుండెడివాడు.

ఈ విధముగా బాబా మెల్లగా నడుచుచు చావడి ముఖద్వారము వద్దకు చేరగానే బాపూ సాహెబ్‌జోగ్ వెండి పళ్ళెములో సాయి పాదములు కడిగి, అర్ఘ్య పాద్యములర్పించి, గంధము పూసి ఆరతి నిచ్చెడివాడు. బాబాను మెల్లగా లోనికి తీసుకుని వెళ్ళి బాలీసులతో అమర్చిన గద్దెపై కూర్చుండబెట్టెడివారు. అప్పుడు శ్యామా చిలుమును తయారు చేసి తాత్యాకి యిచ్చెడివాడు. తాత్యా ఒక పీల్చుపీల్చి బాబా కిచ్చెడివాడు. బాబా పీల్చి మహల్సాపతికిచ్చెడివాడు. ఆ తరువాత అక్కడ చేరిన భక్తులందరూ చిలుమును పీల్చెడివారు. యిది ఒక సమభావాన్ని సూచించే సాధారణ క్రియ. ఈ విధముగా ఉత్సవము పూర్తి అయిన తరువాత భక్తులు తమ తమ యిష్ట ప్రకారము కొందరు బాబా మెడలో పూలదండలు వేసెడివారు. వీటన్నిటిపై బాబాకు ఏ మాత్రం వ్యామోహము లేదు. కేవలం భక్తుల మనోభీష్టప్రకారం, వారి తృప్తి కొరకు మాత్రమే వీటినన్నింటినీ చేయుటకు ఒప్పుకొనెడివారు ఆఖరికి బాపూ సాహెబ్ జోగ్ సర్వలాంఛనములతో సంపూర్ణ ఆరతిని యిచ్చిన తరువాత అందరు తిరిగి యిళ్ళకు, లేక బసకు వెళ్ళిపోయెడివారు. అన్ని యేర్పాట్లు చేసిన తరువాత తాత్యా కూడ యింటికి వెళ్ళుటకు సిద్ధమైనప్పుడు బాబా అతనితో వెళ్ళుము కాని రాత్రికి ఒకసారి వచ్చి నన్ను చూచి వెళ్ళుము. నాపై దయచూపుమని చెప్పెడివాడు. తాత్యా అట్లే చేసెడివాడు. భక్తులందరూ వెళ్ళిన తరువాత బాబా 50, లేక 60 దుప్పట్లను ఒక దానిపై ఒకటి వేసుకుని దానిపై నిద్రించువాడు. అది యోగనిద్ర. లోకసం దృష్టిలో కనిపించే నిద్ర. వారు యదార్ధానికి నిద్రించేవారు కాదు. వారు నిద్రించిన లోకమే నిద్రించును.

సాయి భక్తులు ప్రతిరోజు రాత్రి పరుండునపుడు. మనుసును విశ్రాంతి పరచుకుని ఈ చావడి యుత్సవమును ఒకసారి గుర్తుకు తెచ్చుకొని అందులోవారు కూడ పాల్గొనినట్లుగా భావన చేసిన బాబాకు సన్నిహితులై కలలో సాయిని దర్శించవీలుకలుగును.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఆరవ అధ్యాయం సంపూర్ణం

యిరువది ఏడవ అధ్యాయము

1907వ సంవత్సరంలో చిల్లికానులు దక్షిణగా తీసుకోవటం ప్రారంభించిన బాబాకు1912-1916 ప్రాంతంలో షుమారు రోజుకు 500 రుపాయల దక్షిణవచ్చేది. అయినా మొత్తం ధనాన్ని సాయంత్రానికి ఆశ్రితులకు పంచిపెట్టేవాడు బాబా. సాయిలీలలను మహిమలను విశేషంగా ప్రచారం చేయాలనే ముఖ్యోద్దేశంతో 1915లో సాఠే దక్షణ భిక్ష సంస్థను స్థాపించెను. ఈ సంస్థవారు బాబా జీవితపు అనేక విషయములను సంకలనంచేసి ప్రచురించిరి.

బాబా గయయాత్ర

కాకా సాహెబ్ తన కుమారుని ఉపనయనము నాగపూర్‌లో చేయ నిశ్చయించెను. యించుమించు అదే సమయములో నానా చందోర్కరు పెద్దకుమారుని వివాహము గ్వాలియర్ లో చేయుటకు నిశ్చయమయ్యెను. వారిద్దరు షిరిడికి వచ్చి ఈ శుభకార్యములకు బాబా స్వయముగా రావలెనని ఆహ్వానించెను. శ్యామాను తన ప్రతినిధిగా తీసుకువెళ్ళమని బాబా చెప్పెను. వారు బాబా స్వయముగా రావలెనని పట్టుబట్టిరి. వారికి శ్యామాను వెంట బెట్టుకుని తీసుకువెళ్ళమని. శ్యామా కాశీ, ప్రయాగయాత్రలు ముగించి గయకు వచ్చుటకు ముందే తాను గయకు చేరు కొనెదనని చెప్పెను.

బాబా ప్రతినిధిగా శ్యామా నాగపూర్ ఉపనయనమునకు వెళ్ళెను. అక్కడి నుంచి గ్వాలియర్ పెళ్ళికి వెళ్ళెను. ఆ తరువాత కాసీ అయోధ్యలు చూసుకుని మూడవనెలలో గయకు చేరెను. గయలోప్లేగు కలదని విని భయపడెను. గయలో పండా యింటిలో బస చేసెను. విశాలమైన ఆ యింటిలో సాయిబాబా యొక్క పెద్ద

ఫోటోను చూసి శ్యామా ఆశ్చర్యమును పొందెను. తాను షిరిడి నుంచి బయలుదేరుటకు ముందు బాబా పలికిన మాటలు - "శ్యామా కాశీ, ప్రయాగయాత్రలు ముగించి గయకు వచ్చుటకు ముందుగానే నేను గయకు చేరెదను". అను మాటలు గుర్తు తెచ్చుకొని ఆనంద భాష్పములు రాల్చెను. ఆ తరువాత 12 ఏండ్ల క్రిందట తాను బాబా దర్శనమునకు షిరిడి వెళ్ళినప్పుడు శ్యామా అను భక్తుడు ఆ పటము నిచ్చెనని పండా చెప్పగా శ్యామాకు కూడ ఆ విషయము జ్ఞప్తికి వచ్చెను. ఆనాటి శ్యామాయే ఈ నాడు తన అతిధిగా వున్నందున పండా కూడ ఎంతో సంతోషించెను.

సపత్నేకర్-దంపతులు

సపత్నేకర్ అక్కల్‌కోట నివాసి. యితడు న్యాయవాది విద్య చదివే రోజులలో షేవడేయను ఒక తోటి విద్యార్థికి తక్కువ మార్కులు వచ్చేవి. అతను తాను ప్రస్తుతము మార్కులు తెచ్చుకోలేకపోయినా శ్రీ షిరిడి సాయిబాబా అనుగ్రహముతో సంవత్సర పరీక్షలలో ఎక్కువ మార్కులు పొంది పరీక్షలలో ఉత్తీర్ణుడనయ్యెదనని చెప్పగా సపత్నేకర్ అతనిని, షిరిడి సాయిబాబాను కూడా విమర్శించి పరిహాశించెను. 15 సంవత్సరముల తరువాత సపత్నేకర్ ఒక్కగానొక్క కుమారుడు మరణించుటచే అతని మనస్సు వికలమై అనేక పుణ్య క్షేత్రములు తిరిగినా శాంతి లభించక షిరిడి బాబా దర్శనమునకు వచ్చెను. అతనిని బాబా మసీదులోనికి రానీయక కేకలు వేసెను. రెండు మూడు సార్లు ప్రయత్నించినా పొమ్మని అరచెను. చేయునదిలేక యింటికి తిరిగి వెళ్ళెను. కొన్నాళ్ళ తరువాత అతని భార్యకు కలలో ఒక ఫకీరు కన్పించెను. కలలో ఆమె కుండను నెత్తిపై పెట్టుకుని నీటికి వెళ్ళుచుండగా ఒక ఫకీరు ఎదురై నీకుండను నేను నీటితో నింపెదనని చెప్పెను. అది శుభశకునముగా భావించి సపత్నేకర్ భార్యతో వెంటనే ప్రయాణమై షిరిడి చేరెను. బాబానుచూచి భార్య తనకు కలలో కనపడినదీ ఫకీరేనని చెప్పెను. వినయ విధేయతలుగల ఉత్తమురాలగుటచే బాబా ఆమెను చేరపిలచెను. ఏదో విషయమిట్లు చెప్పెను. నా పొత్తికడుపు, నడుము, కాళ్ళు, చేతులు చాలా రోజులుగా నెప్పిగాయున్నవి. ఎన్ని మందులు వాడినను ప్రయోజనములేక పోయెను. యిక్కడకు రాగానే అన్నీ ఉపశమించెను. పేరు చెప్పకపోయినా యిది ఆమె కథేనని తెలుసుకొగలిగినది. యిదే సమయమని సపత్నేకర్ మరల బాబా పాదములకు నమస్కరించెను. ఈసారి కూడ బాబా బయటకు పొమ్మని అతనిని గద్దించెను. యిదంతయు లోగడ తాను మిత్రుడైన షేవడేను నిందించిన ఫలమని గుర్తించెను. పశ్చాత్తాపముతో క్షమించుమని మనసులో ప్రార్థించి మరల పాదములపై బడెను.

త్రికరణ శుద్ధిగా ప్రార్థించెను. ఆ రాత్రి దేవత కలలో కనిపించి - బాబా వద్దకు వెళ్ళుము నీ మనస్సు శాంతించునని చెప్పెను. బాబాయనగా త్రయంబకేశ్వర్‌లోగల శివుడై వుండవచ్చునన్న భావనతో అక్కడకు వెళ్ళి పదిరోజులు భక్తి శ్రద్ధలతో పూజాది కార్యక్రమాలను నిర్వహించినా మనసు శాంతి నొందక తిరిగి తనవూరుకు వచ్చి మరల దేవతను వేడుకొనగా ఆమె స్వప్నములో-నీవు అనవసరముగా త్రయంబకేశ్వరమునకు వెళ్ళితివి. బాబా అనగా షిరిడి సాయిబాబా అని చెప్పెను. షిరిడికి ఎలా వెళ్ళవలెను. అని ఆలోచించుచుండెను. యితడు పవిత్ర జీవనం గడుపు వాడగుటచే ఈతని రాకకు బాబా కూడా తగిన ఏర్పాట్లు యింకొక విధముగా చేసెను.

బాబా భక్తుడైన శ్యామా చిన్నపిల్లవాడుగా వున్నప్పుడు జబ్బుపడగా తమ గృహదేవతయైన సప్తస్పంగి దేవతకు జబ్బునయమైనచో బిడ్డను తీసుకువచ్చి నీపాద దర్శనము చేయించెదనని అతని తల్లి మొక్కుకొనెను. కొన్నాళ్ళ తరువాత ఆమె కుచములపై తామరలేచి బాధపడగా అది తగ్గినచో రెండు వెండికుచములను ఆ దేవతకు సమర్పించెదనని మరల మొక్కుకుని ఈ రెండు మొక్కులను తీర్చకయే ఆమె మరణించెను. ఇది 32 సంవత్సరములకు ముందు జరిగిన విషయము. శ్యామా కూడ మరచిపోయెను. ఒకసారి షిరిడిలోకి ఒక జ్యోతిష్కుడు వచ్చి అందరి గురించి చెబుతూ శ్యామా తన కులదేవతకుగల మొక్కు చెల్లించలేదని చెప్పెను. బాగా ఆలోచించగా శ్యామాకు ఆ రెండు మొక్కులు జ్ఞప్తికి వచ్చెను. వెంటనే రెండు వెండి కుచములను చేయించి బాబా పాదముల చెంత వుంచి తన సప్తశృంగి దేవత బాబాయే అని వాటిని స్వీకరించమని ప్రాధేయపడెను. బాబా అంగీకరించక శ్యామాను స్వయంగా వెళ్ళి ఆ దేవతకు వాటిని సమర్పించమని ఆదేశించెను, శ్యామా వాటిని తీసుకుని సప్తశృంగికి వెళ్ళి పూజారి యిల్లు కనుగొని కాకాజీ వైద్య యింటికి వెళ్ళి వివరములు తెల్పెను.

షిరిడి నుంచి బాబాయొక్క ముఖ్య అనుచరుడే తన యింటికి వచ్చుట కాకా వైద్య గొప్ప దైవానుగ్రహంగా భావించెను. అదేవిధముగా తన మొక్కు తీర్చుటకు కావలసిన పూజారి తన కోసంఎదురుచూస్తూ వుండుట శ్యామాకు ఆనందము కలిగించెను. ఈ విధముగా బాబా వీరిద్దరినీ కలుపుటకే శ్యామాను అక్కడకు పంపి వుండవచ్చును. శ్యామా మొక్కు భక్తిశ్రద్ధలతో తీర్చుకున్న తరువాత యిద్దరు కలిసి షిరిడికి వెళ్ళిరి. వైద్య బాబా పాదములను దర్శించినంతనే అతని మనోవికారములు.

అశాంతి తొలగిపోయి పరమానందము కలిగెను. బాబా ఏమీ మాట్లాడలేదు, ఆశీర్వదించలేదు. అయినా కేవలం దర్శనం వల్లనే తన కింతటి శాంతిని ప్రసాదించిన సాయి మహామహిమాన్వితుడని గ్రహించెను. 12 రోజులు షిరిడిలో వుండి తనివితీర బాబా యొక్క దర్శన, స్పర్శన, సంభాషణల ద్వారా ఆనందించి బాబావిభూది ప్రసాదమును పొంది తిరిగివెళ్ళెను.

బాబా గుఱ్ఱం-శ్యామకర్ణ

బాబా భక్తుడొకడు తన వ్యాపారంలో బాగా లాభించినందుకు మంచి గుఱ్ఱమునొకదానిని తీసుకువచ్చి బాబాకు బహూకరించెను. బాబా దానికి శ్యామసుందర్ అనిపేరు పెట్టి తుకారాం అను భక్తునికి దాని సంరక్షణ భారమప్పగించెను. అది ఒక జంతువు అనేభావనతో చూడవద్దని తన బిడ్డలాంటిదని అనేకసార్లు బాబా ఈ గుర్రం గురించి భక్తులతో చెప్పేవారు. దీనిని శ్యామకర్ణ అని కూడ పిలిచేవారు. ఒకరోజు ఎందుకో అది పచ్చగడ్డి మేత తినలేదు. తుకారాం ఎంత అనునయించినా అది మొండికేసి ఒక్క గడ్డిపోచ కూడ నమలలేదు. అతడు విసుగుచెంది పెద్దకర్రతో దాని వీపుపై కొట్టెను. యిది మసీదుకు కొంచెం దూరంలో ప్రక్కగా జరిగెను. వెంటనే తుకారాంను పిలిపించి, అంత పెద్ద కర్రతో నన్నేల కొట్టితివని బాబా గద్దించెను. బాబా వాక్కుల తీవ్రతకు అతడు గడగడావణికిపోయెను. బాబా తనబారుచొక్కాను పైకెత్తి వాతవలె తేలిన ఎర్రని కర్రదెబ్బగుర్తును చూపించెను. దానిని చూచినవారంతా ఆశ్చర్యమును, భయమును పొందిరి. అందరూ తుకారాం వైపు అనుమానంగా చూచుచుండిరి. తుకారాం తానా రోజు ద్వారకామాయి వైపుకే రాలేదని బాబాను తాను కొట్టలేదని పదేపదే చెప్పుచుండెను. అప్పుడు బాబా నాబిడ్డ శ్యామసుందర్‌ను కొట్టిన నన్ను కొట్టి నట్లుకాదా? అని గుఱ్ఱమును కొట్టిన విషయమును తుకారాంకు గుర్తుచేసెను. వెంటనే భక్తులంతా పరుగునవెళ్ళి శ్యామకర్ణను చూడగా బాబా వీపుపై వున్నంత పొడవునా దానివీపుపై కూడ కర్రదెబ్బ తగిలి వాచియుండెను. అందరు ఆశ్చర్యపడిరి, సర్వజీవులలోను నేనే వున్నాను అని బాబా నిదర్శన పూర్వకంగా నిరూపించిన విచిత్రలీల యిది. ఆ రోజు నుంచి శ్యామ కర్ణను ఎంతో గౌరవభావంతో భక్తులంతా చూసేవారు. దానికొరకు పచ్చగడ్డి, వులవలు తెచ్చియిచ్చేవారు. కొందరు పైనవేయుటకు జరీఅంచు శాలువలు యిచ్చెడివారు. ఎంతోమంది మానవులకు లేని సాన్నిహిత్యం ఆ గుఱ్ఱం బాబాతో అనుభవించినది. దాని జీవితము ధన్యం. ఔరంగాబాదుకర్ అనునతనికి సంతానము లేదు. బాబా అనుగ్రహముతో మగపిల్లవాడు జన్మించెను. అతడు కృతజ్ఞతతో 500 రూపాయలు ఖర్చుపెట్టి శ్యామకర్ణ వుండటకు

ఒక పశుశాల నిర్మించెను. గురువారమునాడు జరుగు ఉత్సవములో శ్యామకర్ణను సుందరమైన దుస్తులు కప్పి అలంకరించి వూరేగింపుకు ముందుగా వుంచెడివారు. వాద్యములకు అనుగుణంగా అది కూడ నాట్యము చేయుచు ఆనందించెడిది.

బాబాకు పరీక్ష

అది 1915వ సంవత్సరం. ఒక గురువారం రోజు ఉదయం మసీదు భక్తులతో కోలాహలంగా వున్నది. మసీదు ముందుభాగంలో రాతిపైకాలు మీదకాలు వేసుకుని బాబా కూర్చుని వున్నారు. నానా చందోర్కరు, శ్యామా, మహల్సాపతి, దీక్షిత్, తాత్యా, సాఠే మొదలైన భక్తులంతా నిలబడి వున్నారు. ఉన్నత కుటుంబీకురాలు, ధనవంతురాలైన మధ్యవయసుగల జానకీబాయి అనే స్త్రీ జలతారు పట్టుజరీ అంచుగల చీరను ధరించి చేతితో బంగారు పళ్ళెమును ధరించి అందులో బాబా కొరకు అనేక విలువైన ఆభరణములను కానుకగా తెచ్చెను. స్త్రీల వరుసలో నిలబడి వుండెను. బాబాను సేవించుటకు ప్రతిభక్తుని చేతిలోను ఏదో ఒక వస్తువుండెను. కొందరు బాబా పాదములను వెండి పళ్ళెములో వుంచి కడుగుచుండిరి. కొందరు మెడవద్ద చందనము అత్తరులు వ్రాయుచుండిరి. కొందరు బాబాకు పూలను, పండ్లను పేడాలను నైవేద్యముగా సమర్పించుచుండిరి. కొందరు తమ శక్తికొలది ధనమును బాబాకు దక్షిణగా యిచ్చుచుండిరి. కొందరు బాబాకు చామరములు వీచుచుండిరి.

భక్తుల గుంపులకు వెనుకగా వుండి దీనినంతా గమనిస్తున్న నానావళి ఎంతో సంతోషించెను. కాని కొద్దిక్షణములలోనే అతని ముఖ కవళికలు మారిపోయెను. అతని ముఖముపైగల ఆనంద చిహ్నములు పోయి అనుమానపు గుర్తులు గోచరించెను. మరుక్షణములోనే ఆ ముఖకవళికలు కోపమును సూచించెను. క్షణములలోనే అతని శరీరమంతా కోపముతో వేడెక్కెను. కళ్ళు ఎర్రనైయ్యేను. భయంకర రూపదయ్యేను. ఏయ్ ఫకీర్! అని దిక్కులు పిక్కటిల్లునట్లు అరచెను. అందరూ వెనుకకు తిరిగి నానావళి యొక్క వుద్రేకమును చూసి నిశ్చేష్టులైరి. చాలామంది భయపడి బాబాకు వెనుకవైపుగా వెళ్ళిరి. ఎవ్వరూ నోరు విప్పలేకపోయిరి. నిశబ్దము తాండవించెను. నానావళి అడుగు ముందుకువేస్తూ బాబా కూర్చున్న రాతి దగ్గరకు వెళ్ళెను. బాబా కళ్ళలోకి కళ్ళు పెట్టిచూచుచుండెను. నానావళి దురుసు స్వభావం గలవాడు. ఏమి జరుగునో అని అందరూ భయపడుచుండిరి. నానావళి బాబాతో యింతమంది నన్ను చూచి లేచి నిలబడి, భయపడియున్నారు. నీవు మాత్రం కాలుమీద కాలు వేసుకుని

దర్జాగా కూర్చునే వున్నావు అన్నాడు. బాబా తిరిగి సమాధానం చెప్పలేదు. లే అని గద్దించాడు నానావళి. బాబా లేచి ప్రక్కనే భక్తులతోపాటుగా నిలబడ్డాడు. బాబా స్థానంలో బాబావలెనే కాలుమీద కాలువేసుకుని కూర్చున్నాడు నానావళి. భక్తులు నైవేద్యంగా తెచ్చిన ఫలహారములనన్నిటినీ తెమ్మని కొన్ని తాను తిని మిగిలినవాటిని చిందర వందర చేశాడు. బంగారు పళ్ళెములో ఆభరణములను తెచ్చిన స్త్రీ వంక ఆ పళ్ళెమువంకా దృష్టిని మార్చి మార్చి చూశాడు. ఛీయని ఆమెవంక అవమాన సూచకంగా అరచాడు.

బాబావైపు చూసి ఏమి నవాబ్ ఎలావున్నావు? అని ప్రశ్నించాడు. నేను నవాబ్‌ను కాదు ఫకీరునని బాబా సమాధానమిచ్చాడు. లోకమెట్లావుంది. మళ్ళీ ప్రశ్నించాడు. మామూలుగానే వుంది బాబా జవాబు. అంటే? రెట్టించాడు నానావళి. పంచభూతాలతో, అష్టదిక్కులతో ఈలోకం నాకు మామూలుగానే కనిపిస్తున్నదని తిరిగి బాబాతన సహజధోరణిలోనే సమాధానమిచ్చాడు. బాబా సమాధానం విన్న నానావళి ముఖకవళికలు మారిపోయినాయి. నిప్పు కణికవలె ప్రజ్వలించిన మనిషి మంచుకొండవలె చల్లనైపోయాడు. మళ్ళీ బాబా కళ్ళలోకి కళ్ళుపెట్టి చూచాడు. వారిద్దరి కళ్ళు ఏవేవో మాట్లాడుకున్నాయి. నన్ను క్షమించు అంటూ నానావళి బాబా పాదాలను తాకి చకచకా నడుచుకుంటూ వెళ్ళిపోయాడు. క్షణక్షణం ఏమి జరుగుతుందో అన్న ఉత్కంఠతో సాగిన ఈ సన్నివేశం నుంచి భక్తులు తేరుకుని హాయిగా వూపిరి పీల్చుకున్నారు.

అప్పుడు నానా చందోర్కరు బాబాతో నానావళి పిచ్చిచేష్టలు రోజు రోజుకీ పెరుగుతూవున్నాయి. ఆఖరికి మీరు కూర్చునే రాయి మీదే కూర్చుని మీకు తెచ్చే నైవేద్యాన్నే తిని, పాడుచేసి, మీ భక్తులను అవమాన పరచేస్థితికి వచ్చాడు. యిక మేము యితని చేష్టలను సహించలేము. మీరు అనుతిస్తే యితనిపై తగుచర్య తీసుకుంటామని అడుగగా బాబా - మీరందరూ అనుకుంటున్నట్లుగా నానావళి పిచ్చివాడు కాదు. నన్ను పరీక్ష చేయటానికి వచ్చిన ప్రాపంచిక అవధులు దాటిన అవధూత - అని చెపుతాడు. ఆ పిచ్చివాడు మిమ్మల్ని పరీక్షించటమేమిటి బాబా అని తిరిగి నానా అడుగుతాడు. అప్పుడు పూర్తి విషయాన్ని యిలా వివరిస్తారు. సాయి - నేను ఈ వూరుకు వచ్చిన కొత్తల్లో నేను ఒక పిచ్చివాడినని నన్ను రాళ్ళతో కొట్టారు. ఆ తరువాత నన్ను వైద్యుడు అన్నారు. యిప్పుడు దేముడు అంటూ నిత్య

వైద్యాలతో, కానుకలతో, పూజలతో ఆరాధిస్తున్నారు. మీరు చేసే ఈ ఆరాధనల మత్తు నాలో యిహ లోక సంబంధమైన భౌతిక విషయాలపై వ్యామోహమును పెంచినదేమోనని నన్ను పరీక్షించాడు నానావళి. నేనిచ్చిన సమాధానం వలన నేను నా నిజస్థితి నుండి మారలేదని గ్రహించి వెళ్ళిపోయాడు. వేదాంతానికి పరకాష్టే పిచ్చి. బాబా యిచ్చిన వివరణ ప్రకారం అంతకు ముందు నానావళి ప్రవర్తనను ఒకసారి గుర్తు చేసుకొని అతని ప్రశ్నలు, బాబా సమాధానాలు కూడ అదే దృష్టిలో తెలుసుకుని ఆనందించారు. నానావళి పిచ్చివాడనే భావన ఆనాటి నుంచి పోయింది.

ఎర్రని అరటి పండ్లు

శ్రీ యం.జి. రేగే తన విద్యార్థిదశలోనే బాబాను దర్శించెను. అప్పటిలో బాబాకు సన్నిహితులుగా వుండే భక్తులందరిలోను ఈయనే చిన్నవాడు. ఒకరోజు ద్వారకామాయిలో భక్తులందరూ కూర్చుని వుండగా ఒక భక్తుడు బాబాకు ఎర్ర రంగుగల అరటిపళ్ళ గెలను బహుకరించెను. అరటి పండు తొక్క యొక్క ఎర్ర రంగు రేగెను ఆకర్షించెను. ఆ పండ్లను తినవలెనని అతడు మనసులో కోరుకొనెను. బాబా ఆ పండ్లను అందరికీ పంచుతూ ఒక పండును వలిచి భక్తునికిచ్చి ఎర్రని రంగుగల తొక్కను రేగే చేతిలోపెట్టి తినుమనెను. బాబా ఆజ్ఞ శిరసావహించి రేగే ఆ తొక్క నమిలి తినెను. అందిరికీ పళ్ళుపంచుట పూర్తి అయిన తరువాత బాబా రేగే వద్దకు వచ్చి నీకేమీ పెట్టలేదు కదా అని యింకొక అరటి పండును వలిచి తొక్కను పారవేసి సగము రేగే నోట్లో పెట్టి మిగిలిన సగం బాబా తినెను. అరటిపండు తొక్క యొక్క రంగును చూసి ఆశపడినాడు కనుక కేవలం తొక్కనే యిచ్చి తినుమని దానియొక్క రుచిని బాబా చూపించినారు. దాని రుచిని తెలుసుకుని తొక్క యొక్క రంగులో రుచిలేదని, రుచికరమైనది కేవలం లోపల వుండే మెత్తని భాగమేనని తెలుపుటకు ఆఖరికి స్వయంగా తన చేతితో అసలు పండును పెట్టి దాని రుచినీ చూపించారు. బయటకు కనిపించే బాహ్యామైన అందాల కొరకే ఆశపడక లోపలగల దివ్యశక్తినే మనం ప్రతి వస్తువులోనూ చూడాలనే బాబా చూపిన ఈ ప్రత్యక్ష నిదర్శనాన్ని జాగ్రత్తగా గ్రహించవలెను.

ఓం శాంతి శాంతి శాంతిః
యిరువది నాలుగవ అధ్యాయం సంపూర్ణం

యిరువది అయిదవ అధ్యాయము

1914లో బాబా యిచ్చిన దీక్షాకాలం ముగియకముందే బాబాకు చెప్పకుండా వెళ్ళిపోయిన ఉపాసనీ శాస్త్రి నాగపూరులోను, సింధేయందును. అచటి నుండి ఖరగ్‌పూర్‌నకు వెళ్ళెను. ఆ తరువాత ఒక పంచముని యింటిలో నివాసమేర్పరచుకుని కొంతకాలముండిరి. బాబా అనుగ్రహము వలన షిరిడిలోనున్న కాలములోనే అనేక సిద్ధశక్తులు వీరికి వశమయ్యెను మీరు 15 నెలలపాటు బయట సంచరించి 1915లో తిరిగి షిరిడికి రాగా బాబా వీరిని దగ్గరగల సాకోరి అను గ్రామములో ఆశ్రమము నేర్పరచుకొని వుండమని సూచన చేయగా వారు అట్లేచేసిరి. ఆర్తులు, అర్థార్తులు, రోగులు వేలకువేలు ఉపాసనీబాబాను సేవించి స్వస్థతను పొందిరి. అనేక మంది భక్తులకు గురుతుల్యుడైన ఉపాసనీబాబా తన 72వ ఏట 1942లో సమాధి చెందిరి. షిరిడికి 5 కిలోమీటర్ల దూరంలోగల ఈ ఆశ్రమాన్ని షిరిడికి పోవు యాత్రికులు సందర్శించవచ్చును.

కర్మలు (పనులు) ముఖ్యము

ప్రతి రోజు బాబా భిక్షకు వెళ్ళేడివాడు. బాబా మహిమలు పెరుగుతున్న కొద్దీ భిక్షవేయు వారిలో శ్రద్ధపెరిగి బాబా వచ్చు సమయమునకు భిక్షతో సిద్ధముగా వుండెడివారు. ఒకరోజు సావిత్రిబాయి అను యిల్లాలు వంటచేయుట ఆలశ్యముకాగా బాబావచ్చునని తొందరపడుచున్నది. యింటిలోగల ముసలి మామగారు కూడ భోజనము ఆలశ్యమగుటచే ఆకలితో అలమటించుచున్నాడు. బాబా భిక్షకు వచ్చునను ఆదుర్దాలో ఆమె త్వర త్వరగా వంటను ముగించుచున్నది. రొట్టెలు కూర పూర్తి అయినవి వాటిని పళ్ళెములో బాబా కొరకు సిద్ధముగా వుంచుచుండెను. బాబా భిక్షాపాత్రతో వారియింటికి రానేవచ్చెను. గమనించిన సావిత్రిబాయి బాబాను రెండు క్షణములు మాత్రమే వుండమని చెప్పెను. యింతలో మామగారు ఆకలితో కోడలిని కేకవేసెను. ఆమె బాబాకు భిక్షవేయుచున్నానని, భిక్ష వేసిన మరుక్షణమే ఆయనకు కూడ ఆహారము వడ్డిస్తానని చెప్పి రొట్టెలను కూరను బాబాకు వేయుటకు బయటకు వచ్చెను. ఆమెతో బాబా యిట్లనెను. అమ్మా! నీవు మునుముందుగా నీమామకు ఆహారము యివ్వవలెను ఎందుకని అడిగెదవా! నీమామకు ఆహారమిచ్చుట నీ కర్తవ్యము. నాకు భిక్షవేయుట సత్కర్మ. సత్కర్మకన్నా కర్తవ్యమును నిర్వహించుటకే ప్రాధాన్యతనివ్వవలెను. సకాలమున నీ మామకు భోజనము పెట్టుట నీధర్మము దానిని మొట్టమొదటగా నీవు నిర్వర్తించవలెను. ఆ తరువాతనే నాకు భిక్ష అని చెప్పెను. అందుకామె మీరు సాక్షాత్తు దైవస్వరూపులు, మిమ్ము ముందు సంతృప్తిపరచుటే నా

ఆశయమని చెప్పెను. ఆమెతో తిరిగి బాబా యిట్లనెను కర్మలు మిక్కిలి శక్తివంతమైన ఆయుధములలాంటివి తల్లీ. భగవంతుడు నీ మామగారిని నీ దగ్గరగావుంచి ఆయనకు సేవ చేయు బాధ్యత నీకప్పగించాడు. అలాంటి దైవమే నీ యింటి ముంగిట నిలచినా నీకర్తవ్యమునకే నీవు మొదటి ప్రాధాన్యత నివ్వాలి. యిదే కర్మసిద్ధాంతము, భగవంతుడు మనకిచ్చిన కర్మలను మనము సక్రమమైనరీతిలో నిర్వహించవలెను చేయవలసిన పనిని సరైన విధముగా చేయనిచో అది తప్పు అవుతుంది. నన్ను విశ్వశించిన నీచేత తప్పుచేయించుట నాకు ధర్మముకాదు కదా! నాసమక్షమున ముందు నీమామకు సంతృప్తికరముగా భోజనము పెట్టుము అంతవరకు నేను యిక్కడే కూర్చుని ఆ తరువాత ప్రేమపూరితమైన నీ భిక్షను స్వీకరించి వెళతానని ఆమె అదే విధముగా మామగారికి భోజనము పెట్టిన తరువాతే బాబాకు భిక్షయిచ్చెను. ఆనాటి నుంచి బాబా బిక్షకు వచ్చుటకు ముందుగానే సావిత్రిబాయి మామగారికి సంతృప్తికరంగా భోజనం పెట్టేది.

బాబా సంస్కృతజ్ఞానం

సాయిబాబా ఒక విచిత్ర దైవం. అలాంటి విచిత్ర దైవాన్ని తనపై నిలుపుకున్న షిరిడి ఒక పుణ్యప్రదేశం. ఆ గ్రామ ప్రజలు ధన్యులు బాబా కాలికిందపడి నలిగిన గడ్డిపోచ బ్రతుకు కూడ ధన్యము. బాబా వలన షిరిడికి ప్రాముఖ్యము పొందెను. అలాంటి సాయి పాదముల చెంత సర్వశక్తులు ఆశ్రయించి వుండును. షిరిడికి వచ్చిన భక్తులు బాబాకు పాదసేవ చేసెడివారు ఒక రోజు నానా చందోర్కరు ఏకాంతముగా బాబా పాదముల నొత్తుచూ ఏదో సంస్కృత శ్లోకమును చర్చించుచుండెను. బాబా ఏమి చదువు చున్నావని ప్రశ్నించెను. అది సంస్కృత శ్లోకము మీకు తెలియదులే బాబా అని చందోర్కరు సమాధానం చెప్పెను. తెలియనిచో తెలుసుకొనెదను శ్లోకమును పైకి చదువుమని బాబా చెప్పెను. అప్పుడు నానా తాను గొణుగుతున్న భగవద్గీత నాల్గవ అధ్యాయంలోని 34వ శ్లోకాన్ని ఈ విధముగా చదివెను.

"తద్విద్ధి ప్రణిపాతేన పరిప్రశ్నేన సేవయా
ఉపదేక్ష్యంతితే జ్ఞానం జ్ఞానిన స్తత్వదర్శినః"

బాబా : దీని అర్థమేమి.

నానా : బ్రహ్మ తత్వమును తెలిసిన జ్ఞానుల (గురువు) పాదములపై పడి సాష్టాంగ నమస్కారము చేసి ప్రశ్నించి, వారిని సేవించినచో వారు నీకు జ్ఞానమును ఉపదేశించెదరని దాని అర్థము చెప్పెను.

బాబా : శ్లోకములోని ప్రతి పదము యొక్క అర్థమును వివరించుమని కోరగా నానా అట్లే పతి పదార్థమును చెప్పెను.

బాబా : పరిప్రశ్న యనగా ఏమి?

నానా : ప్రశ్నించుట

బాబా : ప్రశ్న యనగా?

నానా : ప్రశ్నించుటే

బాబా : రెండింటికి ప్రశ్నించుటేయని చెప్పుచున్నావు, పరియను సంస్కృత పదమునకు ప్రత్యేకమైన అర్థములేదా?

నానా : పరిప్రశ్నయను దానికి యింతకంటే వేరే అర్థము నాకు తెలియదు

బాబా : సేవయనగానేమి?

నానా : రోజూ మేము మీకు చేయుసేవలాంటిదే!

బాబా : పై శ్లోకములో జ్ఞానమునకు బదులు 'అజ్ఞానము' అనుపదము ఉపయోగించిన ఎట్టి అర్థము వచ్చును?

నానా : ఆ పదముతో ఈ శ్లోక అర్థమును సమన్వయ పరచుట నాకు తెలియదు.

బాబా : గీతాకారుడైన శ్రీకృష్ణుడు జ్ఞాని, తత్వదర్శి కదా! మరి అర్జునుని యితర జ్ఞానులకు నమస్కరించి, సేవచేసి, ప్రశ్నించమని ఎల చెప్పెను.

నానా : అదియును నాకు తెలియదు.

బాబాకు సంస్కృతము రాదని, తాను భగవద్గీతకు అనేకమంది వ్యాఖ్యలు చదివిన పండితుడననే భావం నానా చందోర్కరులో అంతకుముందు బాగావుండేది. కాని తన నోటికొచ్చిన కేవలం రెండు లైన్ల శ్లోకంలోని మూడు భావములకు నాకు తెలియదు అని సమాధానం యివ్వవలసి వచ్చేసరికి నానాచందోర్కరు సిగ్గుపడెను. ఎంతటి పండితుడైనా జ్ఞానులవద్ద మూగపోవలసినదేనని తాను అనుభవపూర్వకముగా గ్రహించెను. అప్పుడు బాబా పైమూడు ప్రశ్నలకు తనదైన శైలిలో ఈ క్రింది విధముగా వ్యాఖ్యానించెను.

1) గురువును ప్రశ్నించుట యనగా శోధించుటకాదు. దొంగ ఎత్తుతో దుర్బుద్ధితో, వారిని బుట్టలో వేయుటకు, వారి తప్పులు పట్టుటకుగాను పనికిరాని

ప్రశ్నలువేసి ప్రశ్నించుటకాదు. నిజముగా తెలుసుకొనుటకు, తెలుసుకొనిన దానిని మనసులో భద్రపరచుకొని జీవితంలో ఆచరించి అనుభవ పూర్వకముగా తెలుసుకొనే ఆశక్తితో కూడిన భక్తి శ్రద్ధలతో ప్రశ్నించవలెను. పరియను శబ్దము యొక్క అర్థమిది. అదివ్యాసుడు వ్యర్థముగా వుపయోగించిన పదంకాదు.

2) సేవయనగా మనకు యిష్టమైన రోజున చేసెదము లేనిరోజున మానెదము అను భావముతో చేయునది సేవకాదు. ఈ శరీరము తనదికాదని గురుసేవకై భగవంతుడిచ్చినదని భావించవలెను. అట్టి జ్ఞానమును కలిగినవారికే గురువు ఈ శ్లోకములో చెప్పిన జ్ఞానమును బోధించిన అర్థమగునుగాని మిగిలిన వారికి చెప్పినను అర్థముకాదు. అలాంటి వారికి బోధించుట అజ్ఞానము బోధించుటే అగును.

3) ఎంత గొప్ప మహాపురుషుడైనా అత్యంత సన్నిహితుడైనచో, ఆ దివ్య పురుషుని శక్తిని సామాన్యులు గుర్తించలేరు. తమలాంటి మనిషేననే సాధారణ భావన చాలాసార్లు స్ఫురిస్తుంది. యిది మాయా ప్రభావం. అందువలననే శ్రీకృష్ణుడు ఈ శ్లోకములో అర్జునుని సంపూర్ణ జ్ఞానం కోసం తత్వవిదులను సేవించమని చెప్పెను.

బాబాయొక్క ఈ వ్యాఖ్యానమును విని నానా చాలా ఆనందించెను. శ్రీకృష్ణుడు బోధించిన భగవద్గీతలో యింత లోతైన విషయజ్ఞానం వున్న బాబా ఎంత గొప్ప పండితుడో నానా వూహకు అందలేదు. బాబా యొక్క జ్ఞానానికి ఆకాశమే హద్దని దానిని ఎవరూ కొలవలేరనే భావన నానాలో కలిగెను. నానా ఆలోచనలలో బాబా అనంతంగా పెరుగుతున్నట్లు తాను ఎంతో చిన్నవాడైపోతున్నట్లు అనిపించెను. నానాలో కలుగుతున్న మార్పును గమనించిన బాబా మెల్లగా నడుచుకుంటూ ద్వారకామాయి అరుగుమీదకు వచ్చెను. బాబాను తదేకంగా చూస్తూ అయస్కాంతంచేత ఆకర్షించబడిన యినుప ముక్కవలె నానా కూడ ద్వారకామాయి బయటకు వచ్చెను. చూచుచుండగనే బాబా శరీరము పెరిగిపోయెను. ముఖ కవళికలు క్షణక్షణమునకు మారుచుండెను. ఎరుపు, పసుపు ఆకుపచ్చ యిలా అనేక రంగుల కాంతి కిరణములు బాబా శరీరమునుండి దివ్య తేజస్సుతో బయటకు వచ్చుచుండెను. పెరుగుతున్న బాబా శరీరమును చూచుటకు నానా తన తలను పూర్తిగా ఎత్తిచూడవలసి వచ్చెను. తళతళలాడుతూ శరీరం నుండి వెడలు కాంతి పుంజములను నానా చూడలేక కళ్ళు మూసుకొనెను. ఆకాశంనుంచి వినపడుతున్నట్లుగా వున్న ధీర గంభీరమైన బాబా వాక్కులు యిట్లు వినపడెను.

నానా అజ్ఞాన అంధకారములో చిక్కి పరిమితమైన మానవ శరీరంలో యిమిడిన కన్నులు ఈ నా దివ్యరూపాన్ని చూడలేవు. దేవతలకుండే దివ్యదృష్టిని నీకు ప్రసాదిస్తున్నాను కన్నులు తెరచి ఈ నారూపాన్ని చూడు! సమస్త గోళాలకు ఆధారభూతుడనైన దివ్యశక్తిని నేనే. సూర్యచంద్రులు నా నేత్రాలు. ఈ సృష్టిలో పిపీలికాది బ్రహ్మ పర్యంతముగల జీవులన్నిటిలోగల జీవనచక్రము నాలో నిత్యము జరిగే మార్పు, వారి వారి కర్మలనుబట్టి పుణ్య పాపులను స్వర్గ, నరకములకు పంపు విరాట్ స్వరూపము నేనే. అగ్ని గోళములు, జలరాసులు, సమస్తరోగములు వాటి కవసరమగు దివ్యౌషధములు అన్నీ నాలోనే నిండి యున్నవి. ఈ సమస్త చరాచర సృష్టి నా కుక్షిలో నిండియున్నది. నాలో లేనిదిలేదు. నేను పూర్ణ పురుషుడను, సంపూర్ణశక్తివంతుడను.

బాబా యొక్క మాటలు, విశ్వరూప సందర్శనం వలన నానా ఒక్క క్షణం మూర్ఛబోయెను, మరుక్షణంలోనే తెలివివచ్చు సరికి మామూలు శరీరంతో బాబా చిరునవ్వులు నవ్వుతూ యింతకుముందు నీవు చూసిన దృశ్యాన్ని ఎవరికీ చెప్పవద్దనెను. తానింత వరకు చూసినది కలా, మాయా, లేక నిజమా అన్న విషయం తెలుసుకోలేని స్థితిలో నున్న నానా తాను సంపూర్ణ జ్ఞానంతో వుండి యింద్రియములన్నీ మామూలుగానే పని చేయుటచే యిది కలకాదని నిర్ణయించుకుని బాబా పాదములపై వ్రాలి ఆనంద భాష్పములతో ఆ దేవ దేవుని పాదములను కడిగెను.

నానా దేవాలయమును అగౌరపరచుట

ఒకసారి నానా చందోర్కరు తన షడ్డకుడగు బినివల్లెతో కలిసి షిరిడీకి వచ్చెను. ఎన్నాళ్ళుగానో నా సాహచర్యంలో వుండి ఈనాడు యిట్లేల చేసితివి, కోపరగాం నుంచి షిరిడికి ఎట్లు వచ్చితివి? అని ప్రశ్నించెను. నానాకు జరిగిన పొరపాటు గుర్తుకువచ్చెను. ప్రతిసారి షిరిడికి వచ్చునప్పుడు కొపరగాంలో దిగి గోదావరిలో స్నానంచేసి దత్తదేవుని దర్శనం చేసుకుని మరీ వచ్చేవాడు. లోగడ వచ్చినప్పుడు మందిర పూజారికి 300 రూపాయలు చందా యిచ్చెదనని నానా చెప్పియుండెను. ఈసారి వెళ్ళినచో పూజారి ఆ వాగ్దానమును గుర్తుచేసి పైకమడుగునని బావించి తన బంధువును కూడ దత్త దర్శనమునకు పోనీయక తొందరపెట్టి తీసుకు వచ్చినాడు.

విషయమును ముందుగనే గ్రహించిన బాబా. నీ వద్ద వాగ్దానము చేసిన పైకమును యిచ్చుటకు శక్తిలేనిచో ఆవిషయమును పూజారికి చెప్పిన సరిపోవును కదా! ఈ ధనము కారణముగా దైవాన్ని దర్శించలేక పోతివి? చూచితివా ధన ప్రభావము, దైవము నుంచి దూరము చేసినదని నిరూపించి చూపించెను, తప్పును తెలుసుకున్న నానా తలను దించుకుని ఖిన్నుడయ్యెను.

ఆరతి - నైవేద్యం

ప్రతిరోజు 12 గంటలకు మధ్యాన్న ఆరతి అయిన పిమ్మట సాధారణ భక్తులంతా తిరిగి వూరిలోనికి లేక వసతి గృహములకు వెళ్ళుటకు లేచేవారు. అప్పుడు బాబా అందరికీ స్వయముగా విభూదిని పంచియిస్తూ ఒక్కొక్కరినీ ఒక్కొ విధముగా పలకరిస్తూ, సలహాలిస్తూ, వుండేవారు. కొందరిని ఎప్పుడు వచ్చావని ప్రశ్నిస్తే, మరికొందరిని ఎప్పుడు వెళతావని అడిగేవారు. కొందరిని రేపు తిరిగి వెళ్ళు అని ఆదేశించేవారు. మరికొందరిని వారియింటివద్దనున్న ఎవరిగురించో అడిగేవారు. వారికొరకు ఏవేవో సలహాలిచ్చేవారు. ఎవరికి ఏది అవసరమో అది వారికి చెప్పెడివారు. అలా చెప్పిన విషయము బాబాకు ఆ భక్తునికి మాత్రమే అర్ధమయ్యేవి. యిలా వెళ్ళవలసిన భక్తులంతా బయటకు వెళ్ళిన తరువాత మిగిలిన ఆంతరంగిక భక్తులు బాబాకు రెండు వైపులా బారులు తీర్చి కూర్చుండెడివాగు. బాబా మెల్లగావచ్చి నింబారువైపు వీపుపెట్టి మసీదులో కూర్చునెడివాడు.

నైవేద్యమును తెచ్చిన భక్తులు బాబా ఆశీర్వాదము కొరకు ద్వారకామాయి బయటనిలబడి వుండెడివారు. బాబాకు నైవేద్యముగా రొట్టెలు, సాంజా, పరమాన్నము బొబ్బట్లు మొదలగు వివిధ పదార్ధములు వచ్చేడివి. అట్లు వచ్చిన వాటినన్నిటినీ బాబా ముందు వుంచెడివారు. వారు వాటిని భగవంతునకు సమర్పించెడివారు. ఆ తరువాత దానిలో కొంత భాగము బయటవున్న వారికి పెట్టి మిగిలిన దానిని బాబాకు యిరుప్రక్కల కూర్చున్న భక్తులకు వడ్డించెడివారు. శ్యామా నానా సాహెబ్ నిమోంకరు లిద్దరూ సాధారణంగా వడ్డించెడివారు. బాబా చూపు సోకిన ఆ పదార్ధములన్నీ మిక్కిలి రుచికరంగా వుండెడివి. ప్రతి అణువు ఎంతో శక్తిదాయినిగా వుండేది. బాబాచేత స్వయముగా నివేదన చేయబడిన ఆ ఆహారము శుచిగాను, రుచిగాను, పవిత్రమైన సర్వశక్తి ప్రదాయినిగా వుండేది.

ఒకనాడు హేమాడ్ పంతు అట్టి భోజనమును తృప్తిగా కడుపునిండా భోజనము చేసిన వెంటనే బాబా అతనికి ఒక గిన్నెడు మజ్జిగయిచ్చి త్రాగుమనెను.

అతడు కడుపులో ఖాళీగా లేదని కొద్దిగా త్రాగెను. దానిరుచి విచిత్రముగా వుండెను. బాబా అతనితో పూర్తిగా త్రాగుము నీకు యిట్టి అవకాశము మరలరాదనెను. అతడు అతికష్టముపై మజ్జిగ నంతటినీ త్రాగెను, బాబావాక్కు సత్యమయ్యెను. బాబా సమాధి అగులోపల హేమాద్రిపంతునకు మరల అట్టి అవకాశమురాలేదు.

ఆత్మరాముని భార్య

ఈమె ఒకసారి బాబాకు మూడు నైవేద్యముగా సమర్పించవలెనని కోరుకొనెను 1. వంకాయ పెరుగుపచ్చడి 2. వంకాయవేపుడు కూర 3. పేడా. ఆమెకు పరిచితురాలైన రఘువీర పురందర్ భార్య షిరిడికి వెళ్ళునప్పుడు ఆమెకు కొన్ని వంకాయలనిచ్చి షిరిడిలోని బాబాకు పెరుగు పచ్చడి, వేపుడు కూరచేసి పెట్టమని చెప్పెను. ఆమె షిరిడికి చేరి మొదట పెరుగు పచ్చడి చేసి బాబా భోజన సమయమునకు ద్వారకామాయికి పంపగా అది చాలా రుచిగా నుండిటచే అందరికీ బాబా పంచిపెట్టెను. వంకాయవేపుడు కూడ అప్పుడే కావలెనని అడిగెను. అది వంకాయలు దొరుకు కాలముకాదు గనుక రాధాకృష్ణమాయి వంకాయ పెరుగు పచ్చడి ఎవరు తెచ్చిరో తెలుసుకుని ఆమెకే వేపుడు కావలెనని కబురు చేయగా పురంధర్ భార్యవెంటనే వేపుడు కూర వండి పంపెను. విషయమును తెలుసుకొనిన అందరూ వంకాయకూర కూడ వెంటనే కావలెననిన బాబా కోర్కెకు ఆశ్చర్యపడిరి.

1915 డిసెంబరులో బాంద్ర నివాసి బలరాం మంకడ్ అనువాడు చనిపోయిన తన తండ్రికి ఉత్తరక్రియలు చేయుటకు గాను షిరిడి వెళ్ళునప్పుడు ఆత్మారాం భార్య వానితో బాబాకు ఏమైనా పంపవలెనని అనుకొని యిల్లంతా వెతకగా ఏమిదొరకలేదు. కొద్దిగా కోవాబిళ్ళలు మాత్రమే వున్నవి. అవి కూడ అంతకు ముందే బాబాకు నైవేద్యం పెట్టబడి యుండెను. అయినను భక్తితో వాటినే ఆమె బాబాకు పంపెను. షిరిడి చేరిన తరువాత మంకడ్ వాటిని బాబాకు యిచ్చుట మరిచెను. సాయంత్రము కూడ మరిచెను, వెంటనే బాబా అతనితో నీవు బయలుదేరునపుడు ఆత్మారాముని భార్య నాకేమిచ్చెనని ప్రశ్నించగా సిగ్గుపడి పరుగు పరుగున వెళ్ళి కోవా బిళ్ళలను తెచ్చి బాబాకిచ్చెను. బాబా ఒక బిళ్ళను నోటిలో వేసుకుని గుటుక్కున మ్రింగెను. మిగిలిన వాటిని అక్కడి వారందరికీ పంచిపెట్టిరి.

మానవజన్మ ప్రాముఖ్యం

జీవకోటికంతటికీ ఆహారము, నిద్ర, భయము, సంభోగము సామాన్య విషయములు. కాని మానవునికి యివికాక జ్ఞానము అను యింకొక విశేషగుణము కలదు, దీనవలనే మనిషికి భగవంతుని గురించి తెలుసుకొన వీలగుచున్నది. కొందరు ఈ శరీరము చీము రక్తము, మాంసముతోను, మలమూత్రాది మలినములతోను నిండి యున్నదని చెప్పెదరు. చివరకు మరణించి నశించే స్వభావముగలది ఈ శరీరం. అయిననూ దీనిద్వారానే జ్ఞానాన్ని కూడ పొందుటకు వీలున్నది. అందువలన ఈ శరీరమును గురించి తగినంత శ్రద్ధతీసుకుని చక్కని ఆరోగ్యముతో వుండునట్లు ప్రయత్నించవలెను. అట్లని మితిమీరిన సుఖములతో శారీరిక వ్యామోహములకు లొంగిపోయిన అది పశుజన్మకన్నా హీనమగును. కావున మనము ఈ శరీరమును ఎప్పుడూ చక్కని ఆరోగ్యముతో వుంచుకొనుటకు అవసరమైనంత జాగ్రత్త తప్పక తీసుకొనవలెను. అంతకంటే ఎక్కువ జాగ్రత్తలు తీసుకున్న మోహమునకు దారితీయును. తక్కువ జాగ్రత్తలు తీసుకున్న అనారోగ్యములతో బాధపడవలసి వచ్చును. ఈ సత్యమును జాగ్రత్తగ గ్రహించవలెను. ఆ తదుపరి మోక్షసాధనకుగాను ఈ శరీరమును ఒక ఉపకరణముగా వుపయోగించవలెను.

రహతానివాసి కుశాల్‌చందు

రహతా నివాసి అయిన కుశాల్‌చందును బాబా చాలా ప్రేమించెడివాడు. అప్పుడప్పుడు భక్తులతో కలిసి బాబా రహతాకు వెళ్ళునప్పుడు యితడు మేళతాళములతో బాబాను ఊరిబయట నుంచి ఆహ్వానించి తీసుకుని వెళ్ళువాడు. బాబాతో పాటుగా అందరికీ భోజనములు ఏర్పాటు చేసెడివాడు. భోజనములైన పిమ్మట చాలా సేపు యిరువురు అనేక విషయములు మాట్లాడు కొనెడివారు. అట్లే నీమ్‌గాం, కోపర్‌గాంల వరకు బాబా అప్పుడప్పుడు వెళ్ళుచుండెడివాడు. మొత్తము మీద షిరిడి నుంచి 5, 6, మైళ్ళు దాటి బాబా ఎప్పుడూ బయటకు వెళ్ళలేదు. కాని ఎంతదూరములో ఏమి జరుగుచున్నను అన్నీ బాబా తెలుసుకోగలిగేవారు.

ఖపర్డే భార్య

ఖపర్డే దంపతులు షిరిడిలో వుండగా ఖపర్డే భార్య ప్రతి రోజు మిట్ట మధ్యాన్నము బాబాకు నైవేద్యమును తీసుకుని వెళ్ళెడిది. దానిని బాబా స్వీకరించిన తరువాత మాత్రమే ఆమె భుజించెడిది, ఆమె నిలకడ, నిశ్చలభక్తి విశ్వాసములకు

బాబా సంతోషించెను. ఒక రోజు మధ్యాన్నము ఆమె మామూలుగానే నైవేద్యమును తెచ్చెను. బాబా వెంటనే ఆమె పళ్ళెమును తీసుకొని ముందుగా ఆ నైవేద్యమును తినుచుండెను. అప్పుడు శ్యామా కల్పించుకుని ఎంతో మంది నైవేద్యములను మీ ముందు వుంచిరి, వాటిని నీవు ముట్టనేముట్టవు ఈమె పళ్ళెమును ముందున కీడ్చుకుని మరీ త్వరగా తినుచున్నావు. ఎందులకీ పక్షపాతము, ఆమె తెచ్చిన నైవేద్యములోని విశేషమేమని ప్రశ్నించెను.

అందులకు బాబా యిట్లు చెప్పెను. "ఈ భోజనము యదార్ధముగా చాలా రుచికరమైనది, పూర్వజన్మలలో ఈమె ఒక వర్తకుని ఆవు. అది చక్కని పాలు యిచ్చి తనను పోషించువారికీ చక్కని ప్రతిఫలమిచ్చెడిది. అందువలన మానవజన్మ కలిగి ఒకతోటమాలి యింటిలో జన్మించెను. ఆ జన్మలోకూడ సేవాభావములను కలిగి యుండుటచే తదుపరి జన్మలో ఒక క్షత్రియుని యింటిలో జన్మించి ఒక వర్తకుని వివాహమాడెను. ఆ తరువాత జన్మలో ఒక బ్రాహ్మణ కుటుంబములో జన్మించెను. ప్రతి జన్మలోను ప్రేమభావముతో ఇతరులను సేవించుచుండెడిది. చాలా కాలము తరువాత ఈమెను నేను చూచితిని. ప్రేమతో నిండిన ఈమె నై వేద్యము నుండి యింకను కొన్ని ముద్దలు నన్ను తిననిమ్ము". ఈవిధముగా చెప్పుచూ ఆమె పళ్ళెమును ఖాళీచేసి గద్దెపై కూర్చొనగా ఆమె వచ్చి బాబాకు పాదములొత్తుచుండెను. ఆమె చేతులను బాబా తోముచుండెను గురుశిష్యులిద్దరూ ఒకరికొకరు సేవచేసుకొనుచుండుట చూచువారలకు ఆశ్చర్యానందములను కలుగచేసెను. బాబా ఆమెకళ్ళలోనికి దృష్టినిల్పి తీక్షణముగా చూచెను. ఆ చూపులతాకిడికి ఆమెలో ఏదో దివ్య శక్తి ప్రవేశించెను. ఆమెకళ్ళనుంచి ఆనందాశ్రువులు రాలినవి. బాబా మధురస్వరంతో "రాజారామ్" అను మంత్రమును ఎల్లప్పుడు జపించుచుండుము. నీ మనస్సు శాంతించును. నీకు మేలు కలుగును. నీ జివితాశయమును పొందెదవని చెప్పెను.

పవిత్ర భావనతో గురుసేవచేయు శిష్యులు గురువుకు ప్రేమ పాత్రులగుదురు. నిజమునకు గురువు అట్టి శిష్యులపైనే ఆధారపడి యుండును. అలాంటి గురుశిష్యులిద్దరు ఒక్కటే వారికి భేదం వుండదు. ఈ పారాయణ చేయు భక్తులందరినీ సాయి అలాంటి శిష్యులుగా తీర్చిదిద్ది తనలో అంతర్భాగంగా చేసుకోమని ప్రార్థిస్తూ ఈ అధ్యాయాన్ని యింతటితో ముగిద్దాము.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఐదవ అధ్యాయం సంపూర్ణం

యిరువది ఆరవ అధ్యాయము

రాధాకృష్ణమాయి అసలు పేరు సుందరబాయి క్షీరసాగర్. ఈమె 1907లో షిరిడికి వచ్చి బాబా సేవకు అంకితమైనది. ఈమె షిరిడి వచ్చుటకు ముందు బాలాజీనెవాల్కర్ అనునతడు షిరిడిలో బాబా నడచు ప్రదేశములను, ద్వారకామాయి ముందు భాగమును, లెండిబాగ్‌ను తుడిచి శుభ్రపరచేవాడు. ఆ తరువాత రాధాకృష్ణమాయి ఈ కార్యక్రమమును చేపట్టినది. ఈమె తన శరీరాన్ని, బుద్ధిని, మనస్సునూ పూర్తిగా బాబాసేవకే అంకితంచేసిన పుణ్యాత్మురాలు. 1916లో ఆమె మరణించువరకు సుమారు 9 సంవత్సరములు యితర ఆలోచనలేమీ లేక బాబా సేవలో పునీతురాలైనది. ఈమె మరణానంతరం అబ్దుల్లా అనే ముస్లిం భక్తుడు ఈ పనులన్నీ చేయుచుండెడివాడు. తాత్యా కోటెపాటిల్ కూడ బాబాకు ఎంతో ప్రేమగా సేవచేసెడివాడు. అతనికి బాబా యందు సహజప్రేమ. బాబాకు బట్టలు మార్చించుట, తనకుయిష్టమైన మంచిమంచి వంటకములన్నీ బాబాచేత తినిపించుట రాత్రిపరుండు నప్పుడు మెత్తని పరుపులను ఒకదానిమీద ఒకటివేసి వత్తుగా బాబాకు పడక సిద్ధంచేయుట యివి తాత్యా చేయుపనులలోని ప్రత్యేకతలు. ఈ పనులలో తాను చెప్పినట్లుగా బాబా వినకపోతే పంతంపట్టి ఉపవాసముండి అయినాసరే బాబాచేత ఆ పనిని చేయించి తీరేవాడు. అది నిజంగానే సంసార జీవితంలోని మేనమామ, మేనల్లుడుల సంబంధమా అన్నంత అన్యోన్య ప్రేమానురాగాలు వర్ధించేవి తాత్యా, బాబాల మధ్య.

బాబా రోజు విడిచి రోజు చావడిలో నిద్రించేవారు. అక్కడ నిద్రించిన రోజు రాత్రి బాబా మెంకూసాలు ఏవేవో విషయాలు మాట్లాడుకునేవారు. మెంకుసా కిచ్చినమాట ప్రకారం చావడిలోగల తూర్పువైపు భాగం మెంకుసాకు కేటాయించబడిన ప్రదేశంలో సాధారణంగా యితరులెవ్వరినీ నిద్రించుటకు బాబా అంగీకరించే వారు కాదు. స్త్రీలను అసలు అక్కడికి రానిచ్చేవారుకాదు. పడమటివైపు భాగంలో మాత్రమే స్త్రీలు ప్రవేశించి వెంటనే వెళ్ళి పోవునట్లుగా చూసేవారు. బాబా భక్తులకు గురువారము ప్రాధాన్యతగల రోజు. గురుసాంప్రదాయానికి ప్రాధాన్యత నిచ్చు బాబా గురువారము తనకు ప్రీతికరమైన రోజని చెప్పుటచే ఈ అలవాటు ప్రారంభమయ్యెను. మొదట

ప్రతి రెండురోజులకు ఒకసారి చావడి ఉత్సవం జంగేది. తరువాత వారమునకొకసారి గురువారము నాడుమాత్రమే జరిగే వుత్సవం భక్తుల నాకర్షించి ఆనంద డోలికలలో తేలియాడునట్లు, మైమరచి నాట్యము చేయునట్లు చేసెడిది. దీనిని వివరముగా తెలుసుకొనెదము.



ఈ ఉత్సవము రోజు రాత్రి సమయముకాగానే భక్తులు మసీదులో చేరి ముందు భాగంలో కొంతసేపు భజనచేసెడివారు. వీరి వెనుక రథము, కుడివైపుగా తులసీ కోట ఎదురుగా బాబా ఈ మధ్య భాగంలో భజన జరిగెడిది. భజనలో పాల్గొనువారు సమయమునకు ముందుగానే వచ్చి సిద్ధముగ యుండెడివారు. భజనలో అనేక వాద్యములు వుండెడివి. ద్వారకామాయి బయట ఖాళీ స్థలములో దివిటీలను సిద్ధము చేస్తూ వుండేవారు. మధ్య మధ్యలో కొందరు "శ్రీ సాయినాథ మహారాజ్‌కీ జై" అని భక్తితో నినాదములు చేసెడివారు. మసీదు చుట్టూ దీపములు వెలిగించి పైన తోరణములను కట్టెడివారు. ఈ ఏర్పాట్లు జరుగుతున్న సమయంలోనే తాత్యా బాబా దగ్గరకు వచ్చి బాబా! సిద్ధముగా నుండుమని చెప్పి వెళ్ళేవాడు. బాబా గుఱ్ఱము శ్యామకర్ణను రకరకాల అలంకరణలతో అలకంకరించి ఊరేగింపుకు సిద్ధముగా బయట వుంచెడివారు. బాబా చంకలో నటకా పెట్టుకుని, పైన ఉత్తరీయములు వేసుకుని, చిలుమును, పుగాకును తీసుకొని సిద్ధమయ్యేడివాడు. తాత్యా కొత్త జలతారు శాలువను తెచ్చి బాబాకు కప్పి చంకలో చెయ్యి వేసి బాబాను లేపెడివాడు. బాబా మెల్లగాలేచి మండుతున్న ధుని దగ్గరకు వెళ్ళి కుడికాలి బొటన వ్రేలుతో మండుతున్న కట్టెలను ముందుకు త్రోసి, కుడి చేతితో వెలుగుతున్న దీపమును అర్పి ద్వారకామాయి నాలుగు మూలలకు తిరిగి ఏవేవో సైగలు చేసి ఎవరితోనో మాట్లాడుతున్నట్లు కనిపించేవారు. బహుశా తల్లి ద్వారకామాయితో మాట్లాడేవారేమో? ఆ తరువాత మెల్లగా ద్వారకామాయి మెట్లుదిగుతున్నప్పుడు శ్రీ సాయినాథ్ మహారాజ్‌కీ జై అని భక్తిపారవశ్యంలో భక్తులు కేకలు వేసెడివారు. బాబాకు యిరుప్రక్కల కొందరు చామరములను వీచెడివారు. బాబా నడచు దారిపొడవునా తెల్లని వస్త్రములను పరచెడివారు. తాత్యా ఎడమ చేతిని, మహల్సాపతి కుడి చేతిని పట్టుకోగా బాపూ సాహెబ్ జోగ్ తలపై ఎర్రని రంగు గల జలతారు పట్టు గొడుగును పట్టుకొనెడివాడు. ఊరేగింపుకు మొదట శ్యామకర్ణ సుందరంగా అలంకరించబడి ముందు వుండెడిది. దాని వెనుకభజన పాటలు, కీర్తనలు పాడువారు, వారి వెనుక వివిధ రకములైన వాద్యముల మోత ఆకాశము బ్రద్దలైనట్లుగా తోచెడిది. ద్వారకామాయి నుండి మెల్లగా సాగి 10, 15 అడుగుల దూరం రాగానే బాబా దృష్టి వూర్ధ్వగతిలో వుండినట్లుండేది. ఏవేవో సైగలు చేస్తూ ఎవరితోనో మాట్లాడుతున్నట్లుగా ఉండేవారు. ఎవరో అదృశ్యరూపంలో వారితో సంభాషిస్తున్నట్లుగా వుండేది. బహుశా గురుధన్, ద్వారకామాయి మెంకూసాలు కూడ ఈ ఊరేగింపులో బాబా వెంట

వచ్చేవారేమో! ఎడమవైపునకు తిరిగి దూరముగా కనిపించే మారుతి మందిరంలోని మారుతికేవో సైగలు చేసి సంభాషించినట్లుగా అనిపించేది. ఊరేగింపు మధ్యభాగంలోకి చేరునప్పటికి బాబా ముఖ కవళికలు మారిపోయేవి. ఉదయభానునివలె నిండైన రూపంతో స్థిరముగను, ప్రకాశముతోను, సౌందర్యముతోను వెలుగుచుండెడివారు. ఒక్కొక్కప్పుడు భక్తులను గుచ్చిగుచ్చి చూచెటివారు అట్టి సమయములో వారి చూపుపడిన వారిలోగల భయాలు, బాధలు, రోగాలు, ఆందోళనలు నశించిపోయేవి. నిర్మల ఆనందంతో వారు వుప్పొంగి పోయేవారు. మహల్సాపతి ఆ ఆనందమును భరించలేక పూనికవచ్చిన వానివలె నాట్యము చేసెడివాడు. అట్టి స్థితిలో బాబాను చూచిన తాత్యాకు ఆనందభాష్పములు జలజలారాలేవి. ఎవరు ఎలా వున్నా బాబా స్థిరచిత్తుడై వుండేవాడు. దీక్షిత్ పువ్వులను, గులాల్ పొడిని బాబాపై చల్లుచుండెడివాడు.

ఈ విధముగా బాబా మెల్లగా నడుచుచు చావడి ముఖద్వారము వద్దకు చేరగానే బాపూ సాహెబ్‌జోగ్ వెండి పళ్ళెములో సాయి పాదములు కడిగి, అర్ఘ్య పాద్యములర్పించి, గంధము పూసి ఆరతి నిచ్చెడివాడు. బాబాను మెల్లగా లొనకి తీసుకుని వెళ్ళి బాలీసులతో అమర్చిన గద్దెపై కూర్చుండబెట్టెడివారు. అప్పుడు శ్యామా చిలుమును తయారు చేసి తాత్యాకి యిచ్చెడివాడు. తాత్యా ఒక పీల్పుపీల్చి బాబా కిచ్చెడివాడు. బాబా పీల్చి మహల్సాపతికిచ్చెడివాడు. ఆ తరువాత అక్కడ చేరిన భక్తులందరూ చిలుమును పీల్చెడివారు. యిది ఒక సమభావాన్ని సూచించే సాధారణ క్రియ. ఈ విధముగా ఉత్సవము పూర్తి అయిన తరువాత భక్తులు తమ తమ యిష్ట ప్రకారము కొందరు బాబా మెడలో పూలదండలు వేసెడివారు. వీటన్నిటిపై బాబాకు ఏ మాత్రం వ్యామోహము లేదు. కేవలం భక్తుల మనోభీష్టప్రకారం, వారి తృప్తి కొరకు మాత్రమే వీటినన్నింటినీ చేయుటకు ఒప్పుకొనెడివారు ఆఖరికి బాపూ సాహెబ్ జోగ్ సర్వలాంఛనములతో సంపూర్ణ ఆరతిని యిచ్చిన తరువాత అందరు తిరిగి యిళ్ళకు, లేక బసకు వెళ్ళిపోయెడివారు. అన్ని యేర్పాట్లు చేసిన తరువాత తాత్యా కూడ యింటికి వెళ్ళుటకు సిద్ధమైనప్పుడు బాబా అతనితో వెళ్ళుము కాని రాత్రికి ఒకసారి వచ్చి నన్ను చూచి వెళ్ళుము. నాపై దయచూపుమని చెప్పెడివాడు. తాత్యా అట్లే చేసెడివాడు. భక్తులందరూ వెళ్ళిన తరువాత బాబా 50, లేక 60 దుప్పట్లను ఒక దానిపై ఒకటి వేసుకుని దానిపై నిద్రించువాడు. అది యోగనిద్ర. లోకసం దృష్టిలో కనిపించే నిద్ర. వారు యదార్ధానికి నిద్రించేవారు కాదు. వారు నిద్రించిన లోకమే నిద్రించును.

సాయి భక్తులు ప్రతిరోజు రాత్రి పరుండునపుడు. మనుసును విశ్రాంతి పరచుకుని ఈ చావడి యుత్సవమును ఒకసారి గుర్తుకు తెచ్చుకొని అందులోవారు కూడ పాల్గొనినట్లుగా భావన చేసిన బాబాకు సన్నిహితులై కలలో సాయిని దర్శించవీలుకలుగును.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఆరవ అధ్యాయం సంపూర్ణం

యిరువది ఏడవ అధ్యాయము

1907వ సంవత్సరంలో చిల్లికానులు దక్షిణగా తీసుకోవటం ప్రారంభించిన బాబాకు1912-1916 ప్రాంతంలో షుమారు రోజుకు 500 రుపాయల దక్షిణవచ్చేది. అయినా మొత్తం ధనాన్ని సాయంత్రానికి ఆశ్రితులకు పంచిపెట్టేవాడు బాబా. సాయిలీలలను మహిమలను విశేషంగా ప్రచారం చేయాలనే ముఖ్యోద్దేశంతో 1915లో సాఠే దక్షణ భిక్ష సంస్థను స్థాపించెను. ఈ సంస్థవారు బాబా జీవితపు అనేక విషయములను సంకలనంచేసి ప్రచురించిరి.

బాబా గయయాత్ర

కాకా సాహెబ్ తన కుమారుని ఉపనయనము నాగపూర్‌లో చేయ నిశ్చయించెను. యించుమించు అదే సమయములో నానా చందోర్కరు పెద్దకుమారుని వివాహము గ్వాలియర్ లో చేయుటకు నిశ్చయమయ్యెను. వారిద్దరు షిరిడికి వచ్చి ఈ శుభకార్యములకు బాబా స్వయముగా రావలెనని ఆహ్వానించెను. శ్యామాను తన ప్రతినిధిగా తీసుకువెళ్ళమని బాబా చెప్పెను. వారు బాబా స్వయముగా రావలెనని పట్టుబట్టిరి. వారికి శ్యామాను వెంట బెట్టుకుని తీసుకువెళ్ళమని. శ్యామా కాశీ, ప్రయాగయాత్రలు ముగించి గయకు వచ్చుటకు ముందే తాను గయకు చేరు కొనెదనని చెప్పెను.

బాబా ప్రతినిధిగా శ్యామా నాగపూర్ ఉపనయనమునకు వెళ్ళెను. అక్కడి నుంచి గ్వాలియర్ పెళ్ళికి వెళ్ళెను. ఆ తరువాత కాసీ అయోధ్యలు చూసుకుని మూడవనెలలో గయకు చేరెను. గయలోప్లేగు కలదని విని భయపడెను. గయలో పండా యింటిలో బస చేసెను. విశాలమైన ఆ యింటిలో సాయిబాబా యొక్క పెద్ద

ఫోటోను చూసి శ్యామా ఆశ్చర్యమును పొందెను. తాను షిరిడి నుంచి బయలుదేరుటకు ముందు బాబా పలికిన మాటలు - "శ్యామా కాశీ, ప్రయాగయాత్రలు ముగించి గయకు వచ్చుటకు ముందుగానే నేను గయకు చేరెదను". అను మాటలు గుర్తు తెచ్చుకొని ఆనంద భాష్పములు రాల్చెను. ఆ తరువాత 12 ఏండ్ల క్రిందట తాను బాబా దర్శనమునకు షిరిడి వెళ్ళినప్పుడు శ్యామా అను భక్తుడు ఆ పటము నిచ్చెనని పండా చెప్పగా శ్యామాకు కూడ ఆ విషయము జ్ఞప్తికి వచ్చెను. ఆనాటి శ్యామాయే ఈ నాడు తన అతిధిగా వున్నందున పండా కూడ ఎంతో సంతోషించెను.

సపత్నేకర్-దంపతులు

సపత్నేకర్ అక్కల్‌కోట నివాసి. యితడు న్యాయవాది విద్య చదివే రోజులలో షేవడేయను ఒక తోటి విద్యార్థికి తక్కువ మార్కులు వచ్చేవి. అతను తాను ప్రస్తుతము మార్కులు తెచ్చుకోలేకపోయినా శ్రీ షిరిడి సాయిబాబా అనుగ్రహముతో సంవత్సర పరీక్షలలో ఎక్కువ మార్కులు పొంది పరీక్షలలో ఉత్తీర్ణుడనయ్యెదనని చెప్పగా సపత్నేకర్ అతనిని, షిరిడి సాయిబాబాను కూడా విమర్శించి పరిహాశించెను. 15 సంవత్సరముల తరువాత సపత్నేకర్ ఒక్కగానొక్క కుమారుడు మరణించుటచే అతని మనస్సు వికలమై అనేక పుణ్య క్షేత్రములు తిరిగినా శాంతి లభించక షిరిడి బాబా దర్శనమునకు వచ్చెను. అతనిని బాబా మసీదులోనికి రానీయక కేకలు వేసెను. రెండు మూడు సార్లు ప్రయత్నించినా పొమ్మని అరచెను. చేయునదిలేక యింటికి తిరిగి వెళ్ళెను. కొన్నాళ్ళ తరువాత అతని భార్యకు కలలో ఒక ఫకీరు కన్పించెను. కలలో ఆమె కుండను నెత్తిపై పెట్టుకుని నీటికి వెళ్ళుచుండగా ఒక ఫకీరు ఎదురై నీకుండను నేను నీటితో నింపెదనని చెప్పెను. అది శుభశకునముగా భావించి సపత్నేకర్ భార్యతో వెంటనే ప్రయాణమై షిరిడి చేరెను. బాబానుచూచి భార్య తనకు కలలో కనపడినదీ ఫకీరేనని చెప్పెను. వినయ విధేయతలుగల ఉత్తమురాలగుటచే బాబా ఆమెను చేరపిలచెను. ఏదో విషయమిట్లు చెప్పెను. నా పొత్తికడుపు, నడుము, కాళ్ళు, చేతులు చాలా రోజులుగా నెప్పిగాయున్నవి. ఎన్ని మందులు వాడినను ప్రయోజనములేక పోయెను. యిక్కడకు రాగానే అన్నీ ఉపశమించెను. పేరు చెప్పకపోయినా యిది ఆమె కథేనని తెలుసుకొగలిగినది. యిదే సమయమని సపత్నేకర్ మరల బాబా పాదములకు నమస్కరించెను. ఈసారి కూడ బాబా బయటకు పొమ్మని అతనిని గద్దించెను. యిదంతయు లోగడ తాను మిత్రుడైన షేవడేను నిందించిన ఫలమని గుర్తించెను. పశ్చాత్తాపముతో క్షమించుమని మనసులో ప్రార్ధించి మరల పాదములపై బడెను.

ఈసారి సాయి తన వరద హస్తమును అతని శిరముపై వుంచి నిమిరెను. బాబా పాదములొత్తుచుండగా బాబా ఒక వ్యక్తికథను అతడు పడిన కష్టములన్నిటినీ వివరించెను. అది సపత్నేకర్‌కథే. ప్రక్కనున్న వారితో బాబా వీడు తనకొడుకును నేను చంపితిననుచున్నాడు. నేను యితరుల బిడ్డలను చంపెదనా? ఈ మసీదు మాత ఒడిలో కూర్చుని ఏడ్చుచున్నాడు. చనిపోయిన ఈతని కుమారునే తిరిగి యితని భార్య గర్భములో పడవేసెదననెను. సపత్నేకర్‌తో - ఈ నా పాదములు పవిత్రములైనవి. ముదుసలివి. యికనీ కష్టములు తీరిపోయినవి. నిశ్చింతగా నుండుమనెను. మరుసటి రోజు అతని నుండి రెండు రూపాయల దక్షిణ తీసుకొనెను. ఒక కొబ్బరికాయను యిస్తూ దీనిని నీ భార్యవడిలో వుంచుము. నిర్భయముగా వుండుము. యింటికి తిరిగి పొండు. మీ కోరిక నెరవేరుననెను. యిది జరిగిన సంవత్సరమునకు వారికి కొడుకు పుట్టెను.

సోమదేవస్వామి

హరిద్వార్‌కు చెందిన సోమదేవస్వామి 1912లో షిరిడికి వచ్చుచుండగా కొంత దూరములోనే మసీదుపై జెండాలు కనిపించెను. జెండాలపై మక్కువ చూపు యోగి పేరుప్రతిష్టల కొరకు ప్రయత్నించువాడని అట్టి యోగిని చూడవలసిన అవసరము లేదని తలచి సాయిని దర్శించకే తిరిగి వెళ్ళిపోవుటకు నిర్ణయించుకొనెను. టాంగాలో అతనితో పాటు ప్రయాణించుచున్న యితర భక్తులు అంతవరకు వచ్చినందులకు బాబాను తప్పకచూడవలెనని, ఈ బాహ్యాడంబరములను వారు పట్టించుకొను వారు కాదని చెప్పెను. వారి సలహాపై బాబాను దర్శించగానే సోమదేవస్వామి కుంటి ఆలోచనలన్నీపోయెను. అతని మనస్సు కరిగెను. కన్నులలో ఆనంద భాష్పములు నిండెను. గొంతుక తడియారిపోయెను. ఎక్కడ మనసు శాంతించి ఆనందించి ఆకర్షింపబడునో అక్కడే మనం విశ్రాంతి పొందవలెను. తన జీవితము సాయి పాద ధూళిసేవకు అంకితమొనర్చుటకై తహతహలాడెను. మసీదు లోనికి వెళ్ళి బాబా పాదములకు సమస్కరించబోగా సాయి అతనితో మా వేషమును మావద్దనే వుండనిమ్ము నీవు నీ యింటికి తిరిగి వెళ్ళుము. ఈ మసీదుకు రావద్దు. మసీదుపై జెండాలనెగరు వేయు వారి దర్శనము చేయనేల ఇక్కడ ఒక్క నిముషమైనను వుండవద్దని చెప్పెను. తన మనసులోని ఆలోచనలను ప్రకటించున్నారని అతడు గ్రహించెను. బాగా ఆలోచించగా తన మనసు ప్రకారమే బాబా ప్రవర్తించిరని ఈ తిట్లను ఆశీర్వాదములుగా భావించగా అతనికి బాబా యందు స్థిరమైన భక్తి కుదిరి గొప్ప సాయి భక్తుడయ్యెను.

సమాధిమందిర నిర్మాణసందేశము

1913వ సంవత్సరం ఆగష్టు నెలలో నాగపూర్ నివాసి కోటీశ్వరుడు అయిన శ్రీమాన్ బాబాసాహెబ్ బుట్టీ కుటుంబ సమేతంగా షిరిడిలో నివసించుచుండెను. సాఠే, దీక్షిత్ వాడల వలెనె తాను కూడ ఒక వాడాను నిర్మించవలెనని అనుకొనెను. బాబా తాను చేయు పనులను గురించి ఎప్పుడును మాట్లాడెడివారు కాదు, సరియగు నియమము సందర్భములు వచ్చినపుడు మాత్రము ఏమాత్రము సందడి చేయక యుక్తిగా పనులు పూర్తి చేయుచుండెడివారు.

ఒకనాటి రాత్రి బూటీ, శ్యామాలు దీక్షిత్ వాడాలో నిద్రించుచుండగా ఒక వాడాను కృష్ణమందిరం కొరకు నిర్మించమని సాయి కలలో వారిద్దరికీ చెప్పెను. శ్యామా ఆనందమును తట్టుకొనలేక ఏడ్చెను. ధనవంతుడు, సమర్థుడు, అన్నిటికి మించి సాయి యందు పూర్తివిశ్వాసం గలవాడు గనుక మందిరనిర్మాణము కొరకు తగిన ఏర్పాట్లు ప్రారంభించెను. చుట్టూ గదులుండి మధ్యలో విశాలమైన హాలులో శ్రీ కృష్ణుని విగ్రహము ప్రతిష్టించుటకు వీలుగా శ్యామాచే ఒక నమూనాను తయారు చేయించి బాబాకు చూపి అనుమతిని పొందెను. త్వరలో మందిర ప్రారంభమునకు శంకుస్థాపన చేయు ప్రయత్నములు చేయుచుండెను.

టెండూల్కరు కుటుంబసభ్యులు

బాంద్రాలోగల ఈ కుటుంబములోని సభ్యులందరూ బాబాయొక్క భక్తులు. ఈతని కుమారుడు వైద్య పరీక్షకు కూర్చొనుటకు శ్రద్ధగా చదువు చుండెను. ఎంత చదివినను మనసు సరిగా లగ్నముకాక పరీక్షలలో వుత్తీర్ణుడు కానేమోననే అనుమానం అతనిని వేధించుచుండెను. అతని జాతకమును చూచిన వారు ఈ సంవత్సరము పాప గ్రహముల దృష్టి యుండుటచే పరీక్షలో విజయము సాధించుట కష్టమని చెప్పిరి. ఈ స్థితిలో టెండూల్కరు భార్య సావిత్రిబాయి బాబాదర్శనము కొరకు షిరిడికి వెళ్ళినప్పుడు అనేక విషయములతో పాటుగా కుమారుని పరీక్ష విషయము కూడ ప్రస్తావించగా, సాయి నా యందు విశ్వాసముంచి తన పాఠములను జాగ్రత్తగా చదువుకోమని చెప్పుము. నిరుత్సాహ పడవద్దని చెప్పుము. జాతకములు, సాముద్రిక శాస్త్రముల నొక ప్రక్కకు దోసి నాయందే విశ్వాసముంచి శాంత చిత్తముతో పరీక్షలు వ్రాయమనుము. అతడు తప్పక ఉత్తీర్ణుడగునని చెప్పెను. తల్లి లాంటి బాబా

మాటలపై విశ్వాసముంచగా అతడు పరీక్షలలో నెగ్గెను. బాబా వాక్కులు నిజమయ్యెను. జ్యోతిష్య శాస్త్రము నిష్ఫలమయ్యెను. దీనిని బట్టి మనం గ్రహించవలసిన విషయం. బాబా వాక్కు సర్వశాస్త్రములకు అతీతమైనది. వారి నోటి నుంచి వెలువడిన మాట నూటికి నూరుపాళ్ళు జరిగి తీరవలసినదే? పొల్లు పోవుటకు వీలులేదు.

ఈ విద్యార్థి తండ్రి రఘునాథరావు టెండూల్కరు బొంబాయిలోగల విదేశీ కంపెనీలో పనిచేయుచుండెడివాడు. వృద్ధాప్యము వలన సరిగా పనిచేయ లేకపోవుటచే రాజీనామాను చేయ నిశ్చయించెను. అప్పుడతని జీతము 150 రూపాయలు. పింఛను అందులో సగము 75 రూపాయలు వచ్చును. కుటుంబమును గౌరవముగా పోషించు కొనుటకది చాలదని వారు భయపడుచుండిరి. బాబా సావిత్రి బాయికి కలలో కనిపించి 100 రూపాయలు పింఛనుగా యిచ్చిన చాలునా? అని ప్రశ్నించెను. అయినను 10 రూపాయలు అధికముగా మొత్తము 110 రూపాయలను యిచ్చుటకు కంపెనీ వారు నిర్ణయించిరి, యిది కేవలం బాబా అనుగ్రహం వలన మాత్రమే జరిగెను.

కెప్టెన్ హాటే

బికనీరు నివాసియైన యితడు బాబా భక్తుడు. ఒకరోజు యితని కలలో బాబా కనిపించి నన్ను మరచితివా యని ప్రశ్నించెను. తల్లి బిడ్డను ఎట్లు మరచును, మరచి ఎట్లు బ్రతుకును అంటూ అతడు తిరిగి సమాధానమిచ్చి తోటలోగల సొరకాయను తెచ్చి కూరచేసి బాబాకు సమర్పించుచుండగా మెలకువ వచ్చెను. కొద్దిరోజుల తరువాత షిరిడికి వెళుతున్న తన స్నేహితునికి 12 రూపాయలు యిచ్చి 2 రూపాయలతో సొరకాయ కూరచేసి, 10 రూపాయలు దక్షిణగా బాబాకు సమర్పించమని కోరెను. అతని స్నేహితుడు షిరిడికి వెళ్ళి సొరకాయ కూరను వండి బాబాకు నివేదించుటకు తీసుకుని వెళ్ళగా ఆరోజు భోజనము చేయుట మాని బాబా సొరకాయ కూరనే కడుపునిండా తినెను. ఈ విషయము తెలుసుకొనిన హాటే ఎంతో ఆనందించెను.

యింకొకసారి హాటేకు బాబా తాకి పవిత్రపరచిన రూపాయి నొకదానిని తన యింటిలో పూజలో నుంచుకొనవలెనని కోరికతో వేరొక స్నేహితుని ద్వారా ఒక రూపాయిని షిరిడికి పంపెను. ఆ స్నేహితుడు బాబాకు ఆ రూపాయి నాణెము

నిచ్చెను. యింకేమి చెప్పలేదు. బాబా దానిని అటూ యిటూ తిప్పిచూచెను. కుడిచేతి బొటన వ్రేలుతో దానిని పైకి ఎగురవేసి కొంతసేపు ఆడెను. తరువాత దానిని తిరిగియిస్తూ - దీనిని దీని యజమానికి ఊదీ ప్రసాదముతో యిచ్చివేయుము. అతని వద్ద నుంచి నాకేమీవద్దని చెప్పుము. శాంతముతోను సంతోషముతోను వుండమని చెప్పుమనెను. హాటే దానిని జాగ్రత్తగా భద్రపరచి ప్రతిరోజు పూజించెడివాడు. ఈ విధముగా బాబా భక్తుల కోరికలను బట్టి ప్రవర్తించుచుండెడివాడు. తరచుగా బాబా-మీ మనసు ఒక అద్దమైతే నేను దానిలో వుండు ప్రతిబింబమునని చెపుతూ వుండేవారు. పవిత్రమైన నిర్మల భక్తులపైనే నేనాధారపడి యున్నానని పలుమార్లు బాబా చెప్పేవారు. వారికి కావలసినది మన ప్రేమాభిమానములే కాని, ధనసంపదలు కాదు. కావున బాబాను త్రికరణ శుద్ధిగా నమ్ము భక్తులు మొక్కులకోసం ధనాన్ని ఎక్కువగా ఖర్చు చేయుట కంటే మనసు, బుద్ధి ఆలోచనలు బాబాకు సమర్పించి వారికి ఈ జీవితమును అంకితము చేయుట ముఖ్యము.

ఓం శాంతి శాంతి శాంతిః

యిరువది ఏడవ అధ్యాయం సంపూర్ణం.

అయిదవరోజు పారాయణ పూర్తిఅయినది.